# అష్టావక్ర గీత

నమో దేవదేవా ! నమో దివ్య తేజా !
నమో అద్వైత తత్వార్థ బోధనాయ
మోక్షమొసగు శాస్త్రరూపమే నీవంచు
నాదు మనమునందు కొలుతు నిన్ను !
గురుదేవ నీ కృపావీక్షణ లేశమ్ము
గూఢమౌ తత్వార్థ బోధకమ్ము
రుజుమార్గమును జూపు ఋషితుల్యుడవు నీవు
మార్గదర్శివి మానవాళికెల్ల !
దేశకాలవస్తు గుణరూప జ్ఞానమ్ము
వాస్తవమ్మున భావమాత్రమౌను
యతివరా, శాస్త్ర స్వరూపా ! నమస్సులివె,
చిద్రూప చిన్మయానంద స్వామి !

ఈ ప్రార్థనని సరిగ్గా అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే, గురువును ఆశ్రయించి, భగవంతుని యొక్క ప్రతినిధిగా, భగవంతుని దర్శింపచేయగలిగే శక్తి వున్న మహానుభావుడిగా, దివ్యమైనటువంటి తేజస్సుతో నిండియున్నటువంటి ఆ గురుదేవుడిని ఆశ్రయించి, ఆయన ఎటువంటివాడయ్యా అంటే, అద్వైతం, తత్వార్థం ఈ రెండూ బోధించేటటువంటి శక్తి కలిగినవాడు. ఈ రెండింటి వల్ల ఏమిటి ప్రయోజనం అంటే, మోక్షం లభిస్తుంది. ఈ మోక్షం లభించటానికి కావలసినటువంటి ఎన్ని శాస్త్రాలైతే అద్వైతం గురించి, తత్వం గురించి వున్నాయో, అన్ని శాస్త్ర సారముల రూపమే ఆ సద్గురుమూర్తి. కాబట్టి అట్టి సద్గురుమూర్తిని మనసున నిలిపి ఆరాధిస్తున్నాను. నా హృదయములో నిలుపుకుని ఆరాధిస్తున్నాను. కారణమేమిటంటే హృదయంలో కూడా అంతాకూడా అజ్ఞానం అనే అంధకారం వుండడం చేత, చిత్తశుద్ధి లేకపోవడం చేత,

మానవుడు చేసేటటువంటి అన్ని పనులు కూడా, అజ్ఞాన ఫలితమైన దుఃఖాన్నే ఇవ్వడం చేత, హృదయస్థానంలో అట్టి సద్గురుమూర్తిని నిలుపుకోవడం చేత, ఆయన దివ్యతేజస్సుయొక్క ప్రభావం చేత, నీలో వున్నటువంటి అజ్ఞాన అంధకారం దూరమై, ఆ కృపా వీక్షణం అనేటటువంటి నీ హృదయస్థానం ....

మామూలుగా ఎవరైనా గానీ గురువుగారి దగ్గరకు వెళ్ళి, ఆయన పాదాల మీద పడే ప్రయత్నం చేస్తారు. ఎందువల్ల అంటే, ఆయన చేసినటువంటి, శరీరాన్ని పనిముట్టుగా వుపయోగించి, చేసినటువంటి పుణ్య కార్యక్రమాలు, అన్ని సాధనలు, అన్ని తపస్సులకి ఆధారం, ఆ శరీరమనే రథానికి ఆ పాదాలే ఆధారం కాబట్టి, ఆ పాదములనే ఆశ్రయించి ఆ తపోఫలమంతా వుంటుంది కాబట్టి అట్టి తపోఫలాన్ని ఆశ్రయిస్తున్నాను, శరణాగతి చెందుతున్నాను అనే భావన చేత ఆయన పాదాలమీద పడుతుంటారు. కానీ అజ్ఞాన అంధకారం ఎక్కడ వుందటా? హృదయస్థానంలో వుంది. అట్టి హృదయస్థానంలో వున్న అజ్ఞాన అంధకారం దూరం అవ్వాలి అనేటటువంటి ఒకే ఒక లక్ష్యం చేత, గురువును ఎవరైతే ఆశ్రయిస్తారో, ఎవరైతే హృదయంలో గురువును అట్లా నిలుపుకుంటారో, ఎవరైతే మూడు అవస్థలలోనూ గురువు వద్దే తాను వున్నానని, గురువు యందే తాను వున్నానని, గురువు తనయందు వున్నాడని, తనను రెప్పపాటుకూడా విడువకుండా గమనిస్తూ వున్నాడని ఎవరైతే గురువుని అనుగమిస్తారో, ఆశ్రయిస్తారో వాళ్ళకి గురుకృపా వీక్షణ లేశము, లేశమంటే? చాలా తక్కువ. అణుమాత్రం. అంటే గురువు సాంతం కళ్ళు తెరిచికూడా చూడక్కర్లేదు. తత్వార్థం తెలియాలి అంటే, గురువుగారు అర్థనిమీళిత నేత్రుడై వుండి, రెప్పలు కొంచెంగా ఎత్తుకుని కొంచెం ఒకసారి అలా చూస్తే చాలట. అట్లాంటి వీక్షణ లేశము చేతనే, నీకు తత్వార్థమంతా బోధ పడుతుంది. అదిట గురువుగారి యొక్క కృప అంటే.

అది ఎక్కడ నిలబడాలి అంటే, హృదయస్థానంలో నిలబడాలి. అప్పుడు నీకు ఋజుమార్గం అంటే ఏమిటో తెలుస్తుంది. ఋజుమార్గం అంటే అందరూ ఏమనుకుంటారు? అంటే, వక్రంగా లేకుండా, బుద్ధి వక్రత లేకుండా, స్వభావ వక్రత లేకుండా, సరియైనటువంటి సరళ బుద్ధి కలిగి వుండడాన్ని ఋజుమార్గం అంటారు. అయితే శరీరం, ప్రాణం, మనస్సు, బుద్ధి ఈ నాలిగిటికి పైన చిత్తం దానికి

ఆధారమైనటువంటి మూలస్థానంలో వున్న అహంకారం. ఇవన్నీ కూడా ప్రకృతి ధర్మంగా, మాయా మయంగా, భ్రాంతి పద్ధతిగా, పనిచేస్తూ, లేనివి వున్నట్టు, వున్నవి లేనట్టు చూపెట్టే పద్ధతిలో వికాసం చెందుతూ వుంటాయి. ఈ ప్రకృతిని ఆశ్రయించి వికాసం చెందే సాపేక్ష పద్ధతి అంతా కూడా వున్నది లేనట్టు, లేనిది వున్నట్టు బుద్ధి కల్పిస్తూ, పైనున్నటువంటి చిత్తం, అహంకారానికి అభ్యాసబలం చేత తోడ్పాటు చేస్తూ, అనేక రకాలైనటువంటి వంకర టింకర మార్గాలన్నీ ఏర్పడుతూ వుంటాయి. అలాంటివి అన్నీ కూడా, ఈ తత్వార్థం తెలిస్తే వచ్చినటువంటి నూతనమైన దృష్టి చేత, వీటన్నింటినీ కూడా, ఒకే మార్గంలో, ఒకే సూత్రంలో, ఒకే దృష్టితో, నడపగలిగేటటువంటి శక్తి కలుగుతుంది. కాబట్టి గురుకృపా వీక్షణ లేశము చేత శిష్యుడికి తత్వార్థం బోధపడింది. తత్వ దృష్టి కలిగింది. ఆ తత్వ దృష్టితో తన శరీర ప్రాణ మనో బుద్ధి చిత్త అహంకారాలని నడపగలిగేటటువంటి శక్తి కలిగింది. అలాంటి ఋజుమార్గంలో నడవడం చేత, మహానుభావుడైనటువంటి సద్గురుమూర్తి ఎట్లా అయితే మహర్షి అయ్యాడో, అటువంటి మహర్షిత్వాన్ని తాను కూడా పొందే అవకాశాన్ని శిష్యుడు పొందుతాడు. కాబట్టి ఇప్పుడు అక్కడ గురువులో ఈ తత్వార్థ దృష్టితో చూచేటప్పటికి, అప్పటి వరకూ గురువు అన్నవాడు కాస్తా, మహర్షి అయ్యాడు. అట్టి మహానుభావుడవి ఎటువంటి వాడవయ్యా అనే తత్వజ్ఞాన దృష్టితో చూస్తే మానవాళికెల్లా మార్గదర్శిగా కనిపించాడు. అప్పటి వరకూ తనకు మాత్రమే మార్గదర్శి అనుకున్నాడు.

ఈ తత్వజ్ఞాన దృష్టితో కనుక చూచినట్లయితే, మానవులకందరికీ కూడా మార్గదర్శనం చేసేటటువంటి మహర్షిగా కనపడ్డాడు. ఇది దృష్టి భేదం వల్ల కలిగినది. అంతకు ముందు కేవలం తాను, తను ఉద్ధరించడం అనేటటువంటి వ్యక్తిగత దృక్పథంతోనే చూశాడు. కానీ, ఎప్పుడైతే నీకు తత్వదృష్టి కలిగిందో, జ్ఞానం కలిగిందో ఆ తత్వజ్ఞానం దృష్ట్యా నువ్వు దేనిని చూచినా, గురువుని చూచినా ఆగురువు అప్పుడు ఎలా కనపడ్డాడట? మహర్షివలె కనపడ్డాడు. మహర్షి ఎలా అయ్యాడయ్యా అంటే, సమస్త మానవాళికి మార్గదర్శనం నిర్వహించేటటువంటి మహనీయుడిగా కనపడడం చేత. ఇదంతా నీకు ఎక్కడినుంచి లభించిందయ్యా అనంటే, గురుకృపా వీక్షణం అణుమాత్రం చేత లభించింది. ఆయన యొక్క గురుకృపా వీక్షణం, వీక్షణం అంటే చూడటం. అలాంటి

దృష్టి చేత, నీ హృదయంలో వున్నటువంటి అజ్ఞాన అంధకారం దూరమై, ఆయనలో వున్నటువంటి దివ్య తేజస్సుచే అంతా కూడా నీ హృదయం అంతా నిండిపోయింది. అప్పుడు ఏమైందట? అలా చూస్తే దేశము, కాలము, వస్తువు, గుణము, రూపము ఈ అనంత ప్రకృతి, అప్పటి వరకూ ఆద్యంతములు కలిగినటువంటి ప్రకృతి, ఇప్పటి వరకూ ఎలా తోచింది? అనంతంగా తోచింది. అంటే చూసే కొద్దీ చూడాలని, తెలుసుకునే కొద్దీ తెలుసుకోవాలని, అనుభవించే కొద్దీ అనుభవించాలని అనిపించేటటువంటి ఈ సమస్త ప్రకృతి కూడా ఏ లక్షణాలతో కూడుకుని వుందటా? ఒక దేశం చేత పరిమితమై, ఒక కాలం చేత పరిమితమై, ఒక వస్తువు చేత పరిమితమై, ఒక గుణం చేత పరిమితమై, ఒక రూపం చేత పరిమితమైనటువంటి జ్ఞానాన్ని మాత్రమే ఇస్తుంది.

ఈ ప్రకృతి అంతా కూడా ఈ జ్ఞానాన్నే ఇస్తోంది. ఎటువంటి జ్ఞానం ఇస్తోందట? దేశము, కాలము, వస్తువు, గుణము, రూపము ఈ ఐదు లక్షణాల చేతనే పరిమితమైన జ్ఞానాన్ని అందివ్వగలుగుతోంది గానీ, అనంతమైనటువంటి జ్ఞానాన్ని అందించడం లేదు. కాబట్టి ఈ ఐదు కూడా కేవలం భావమాత్రమే. వాస్తవంగా ఈ ఐదు లక్షణాలు లేవు. దేనికి లేవట? ప్రకృతికి కూడా లేవు. కారణం? ఈ ప్రకృతి ఎవరిచేత సృష్టించబడింది? పరమాత్మ చేత సృష్టించబడింది. మరి ప్రకృతికి ఏ లక్షణాలు వుండాలి? పరమాత్మ లక్షణాలే వున్నాయి. కానీ నీకు ఈ ఐదు లక్షణాలు పరిమితంచబడినటువంటి బుద్ధి పనిచేయడం చేత, పరమాత్మ కనపడడం లేదు, ప్రకృతి కనబడుతుంది. ఈ ఐదు లక్షణాలు కనుక నీలోనుంచి దూరమైతే, నీవు ఈ ఐదు లక్షణాలకు గనుక అతీతంగా వుండగలిగినట్లయితే, నీ బుద్ధి వీటిని అధిగమించినట్లయితే, నీ ప్రజ్ఞ వీటిని అధిగమించినట్లయితే, నీకు వివేకం గనుక ఈ ఐదిటిని అధిగమించిన పరిస్థితిలో వున్నట్లయితే అప్పుడు కనపడుతున్నటువంటి వాస్తవంగా కనపడుతున్నటువంటి ఈ ప్రకృతి అప్పుడు ఎలా కనపడిందట? పరమాత్మ రూపంతో కనపడింది. అర్థమైందా అండీ!

దేశము, కాలము, వస్తువు, గుణము, రూపము ఈ ఐదు లక్షణాలు కూడా పరమాత్మలో ఐక్యం చెంది కేవలం పరమాత్మ ఒక్కడే కనబడుతున్నాడు. ప్రకృతిరూపంలో వున్న పరమాత్మ కనబడుతున్నాడు. అరూపంగా కూడా పరమాత్మ కనబడుతున్నాడు. రూపం లేకుండా కూడా పరమాత్మ దర్శనం వుంది. ప్రకృతి రూపంలో కూడా పరమాత్మని

చూడవచ్చు. అటువంటి భావాన్ని నీకు గురుకృపచేత తత్వజ్ఞాన దృష్టి చేత కలుగుతుంది. అటువంటి జ్ఞానాన్ని నీకు అందించేటటువంటి వాడు ఎవరయ్యా అని అంటే యతివరా! వరా అంటే శ్రేష్ఠుడు. ఉత్తమమైనవాడు. యతులలో ఉత్తమమైనవాడు. శ్రేష్ఠుడు. శాస్త్ర స్వరూపా! ఆయన స్వరూపం ఏమిటయ్యా అనంటే, ఆయన స్వరూపమే శాస్త్రాలుగా వ్యక్తం అయ్యింది. అంతే గాని శాస్త్రాలు ఆయన స్వరూపం గురించి వ్యక్తం చేస్తున్నాయనికాదు. నీ స్వరూప జ్ఞానమే వాగ్రూపంలో పెడితే శాస్త్రం అయింది. ఇప్పటి వరకూ మనం ఏం చేస్తున్నాం? శాస్త్రాన్ని చదివి స్వరూపజ్ఞానాన్ని తెలుసుకోవాలని మన అభిప్రాయం. అర్థమైందా అండీ ! గురువు ఏమంటున్నాడు? స్వరూప జ్ఞానమే వ్యక్తీ కరించబడినప్పుడు శాస్త్రం అయింది. గురువుగారు జ్ఞానానుభవంలో వుండి చెబితే అది ఉపనిషత్తు అయ్యింది. ఒక శిష్యుడిని ఉద్దేశ్యించి చెబితే అది ఉపనిషత్తు అయ్యింది. ఉపనిషత్తులు ఇప్పుడు గురువుగారు తెలియజేస్తున్నాయా? గురవుగారు తన అనుభవజ్ఞానాన్ని వ్యక్తీ కరిస్తే ఉపనిషత్తు అయ్యిందా? వ్యక్తీ కరిస్తే ఉపనిషత్తు అయ్యింది. అర్థమైందా అండీ!

ఇప్పుడు మనం అందరమూ చేసే ప్రయత్నం ఎలా చేస్తున్నామండీ? శాస్త్రం చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలి అనుకుంటున్నాం. ఇది సాధ్యమా? అని ప్రశ్న వేసుకోమంటున్నారు. నీలో వున్నటువంటి ఆత్మజ్ఞానానుభవాన్నీ వ్యక్తీ కరిస్తే శాస్త్రం అయ్యింది. కానీ మరి శాస్త్రం నిష్ప్రయోజనమా? ప్రయోజనమే. ఏమిటట? శాస్త్రం గురువు దగ్గరకు దారి చూపెడుతుంది. అంతే! దానితో దాని పని అయిపోతుంది. అంటే అర్థం ఏమిటట? ఏమండి నేనే భగవద్గీత 18 సంవత్సరాల నుంచీ పారాయణం చేస్తున్నాను. అధ్యయనం చేశాను, కంఠోపాఠంగా నాకన్నీ భావార్థంతో సహా వచ్చు. నాకు నిజజీవితంలో దానిని నూటికినూరుపాళ్ళు పాటిస్తున్నాను. నాకు గురువుతో పనిలేదు. అన్నావే అనుకో! అర్థమైందా అండీ! అంటే అప్పుడు ఏమైనట్టు? శాస్త్రం దగ్గర ఆగిపోయింది. ఈ శాస్త్రం ఎక్కడికి దారి చూపెట్టాలట? ఒక గురువు దగ్గరకు తీసుకెళ్ళి విడిచిపెట్టేంతవరకే దానిపని. తరువాత శాస్త్రం పని అయిపోయింది. తరువాత బాధ్యత ఎవరిదట ఇప్పుడు? గురువుగారిది. అర్థమైందా అండీ!

కాబట్టి ఎప్పుడైనా సరే, మీరు ఏదైనా ఒక శాస్త్రాన్ని అధ్యయనం చేసేటప్పుడు ఈ సత్యాన్ని గ్రహించాలి. అందుకని అక్కడ శాస్త్ర స్వరూపా అనే వాక్యం వేసారు. అంటే అర్థం

ఏమిటట? ప్రపంచంలో అజ్ఞాన దృష్టితో చూచినప్పుడు శాస్త్రం జ్ఞానాన్ని ఇచ్చేదిగా కనపడుతున్నది. కానీ ఈ శాస్త్రం ఎక్కడికి తీసుకెళ్ళి విడిచిపెట్టాలి అంటే, స్వరూప జ్ఞానం కలిగిన గురువు దగ్గరకు తీసుకెళ్ళి విడిచిపెట్టగానే దానిపని అయిపోతుంది. గురువు తన స్వరూపజ్ఞానానుభవం చేత నీ అజ్ఞానాన్ని పోగొడతాడు. అంతే గానీ, శాస్త్రం చేత అజ్ఞానం పోగొట్టడానికి వీలుకాదు. అని అర్థం. కాబట్టి మీరు ఏదైనా సరే ఒక శాస్త్రాన్ని తెలుసుకునేటప్పుడు, అధ్యయనం చేసేటప్పుడు ఈ భావాన్ని దృష్టిలో వుంచుకోవాలి. అంటే గురువుని అన్వేషించడానికి, నీకు తగినటువంటి గురువును అన్వేషించడానికి శాస్త్రం వుపయోగపడుతుంది. దానినే శాస్త్ర దృష్టం అన్నారు. అంటే అర్థం ఏమిటి? చాలా మంది మన సర్వ వేదాంత శిరోభూషణంలో కూడా మొట్టమొదట రాసినట్టు వుంది, శాస్త్ర దృష్టం, గురోర్వాక్యం, తృతీయం ఆత్మనిశ్చయం, చతుర్థం సంశయచ్ఛేదం, పంచమం ముక్తి దాయకం. ఈ ఐదు క్రమంలో, ఈ ఐదు స్థితులలో సాధకుడు పరిణామం చెందుతాడు. మొదట శాస్త్ర దృష్టం, అంటే అర్థం ఏమిటట? తాను జీవించే జీవన విధానాన్ని, తాను తెలుసుకున్నటువంటివి, విన్నటువంటివాటిని శాస్త్ర దృష్ట్యా విచారణ చేయాలి. చేస్తే ఏమిటి ప్రయోజనం? అంటే, అనుభవజ్ఞుడైనటువంటి గురువు దగ్గరకి నీవు అన్వేషణలో భాగంగా ఈ శాస్త్ర దృష్టాన్ని చేస్తున్నావు. చేశావు. గురువు దగ్గరకు వెళ్ళావు. ఏమైందట? ఏవండీ నాకు భగవద్గీతలో ఫలానా విషయం చెప్పండి. ఫలానా శ్లోకానికి అర్థం చెప్పండి. అని అడుగరాదు. ఎందుకనిట? ఆయన అనుభవజ్ఞానం వ్యక్తీ కరిస్తే ఈ గీతలు ఎన్నైనా చాలవట. అర్థమైందా అండీ !

అంటే అర్థం ఏమిటట? ఇప్పుడు భగవద్గీతా సారాంశం ఒక్కటే శ్రీకృష్ణుడా? కాదుగా. శ్రీకృష్ణుడు భగవద్గీత చెప్పాడండీ! భగవద్గీత చెప్తే ఇప్పుడు ఆ భగవద్గీత సారాంశం అంతా కలిపి అది ఒక్కటేనా శ్రీ కృష్ణ పరమాత్మ అంటే? అది పరమాత్మలో ఒక అంశీభూతం. ఒక అంశను వ్యక్తీ కరిస్తే భగవద్గీత అయ్యింది. అదే ఉద్ధవుడికి చెబితే ఉద్ధవగీత అయ్యింది. అర్థమైందా అండీ! అలాగే భీష్మడికి చెబితే భీష్మగీత అయ్యింది. అలాగే అష్టావక్రుడు చెబితే అష్టవక్రగీత అయ్యింది. వశిష్ఠుడు చెబితే వశిష్ఠ గీత అయ్యింది. ఎవరు చెబితే, వారి పేరుమీద అది ప్రచారంలోకి వచ్చింది. అర్థమైందా అండీ! ఇప్పుడు ఆ ఒక్కటేనా వశిష్ఠుడు అంటే యోగ వాశిష్ఠం ఒక్కటేనా వశిష్ఠుడు? కాదు కదా!

కాబట్టి శాస్త్రంతో గురువును నిర్ణయించడం వ్యతిరేక విధానం. సరైన విధానం కాదన్నమాట. అర్థమైందా అండీ!

గురువు తనలో వున్నటువంటి అవ్యాజ కరుణ చేత, శిష్యుడిని ఉద్ధరించాలని తాను క్రిందకి, శిష్యుడి హృదయంలోకి దిగివచ్చి, శిష్యుని యొక్క అజ్ఞానావస్థని, తను పడుతున్న దుఃఖాన్ని అర్థం చేసుకొని, అతని యొక్క దుఃఖాన్ని పోగొట్టటానికి తాను చేసినటువంటి ఒకానొక ప్రయత్నం ఆ బోధ. కాబట్టి శాస్త్రం ఎక్కడికి తీసుకెళ్ళి విడిచిపెడుతుందయ్యా? అంటే, నీకు తగిన గురువు దగ్గరకు తీసుకెళ్ళి విడిచిపెడుతుంది. గురువును అన్వేషించడానికి వుపయోగపడే సాధనం. గురువు తన అనుభవజ్ఞానంతో నీ అజ్ఞానాన్ని పోగొట్టాలి. అంతేగానీ, ఫలానా శాస్త్రం చదివితే నీకు మోక్షం వస్తుందనో, ముక్తి వస్తుందనో, ఫలానాది చేస్తే నీకు ఇలా వస్తుందనో చెప్పడం (సరైన) విధానం కాదు. అనుభవజ్ఞానంలో వున్నటువంటి గురువు ఎప్పుడైనా సరే, నీవు అతడిని ఆశ్రయించడం అంటే, నిన్ను ఉద్ధరించడం అనే దైవీ ప్రణాళికలో భాగంగా తాను ఉపయోగపడుతున్నాడు. తానేమీ నిన్ను ఉద్ధరించడంలేదు. ఎందుకనిట? ప్రపంచంలో ఏ జీవినైనా వుద్ధరించాలి అనంటే "ఉద్ధరేత్ ఆత్మనాత్మానాం ఆత్మానమవసాధయేత్"- అంటే అర్థం ఏమిటి? నీ ఆత్మయొక్క జ్ఞానం ఏదైతే నీయందు నిగూఢంగా వున్నదో, అదే నిన్ను వుద్ధరిస్తుంది నాయనా! ఎందుకని? ఆత్మ సర్వవ్యాపకం, అనంతం, అప్రమేయం. మరి అటువంటి ఆత్మ నీయందు వుండగా మరళా నేనొకణ్ణి రెండవవాడిని వచ్చి వుద్ధరిస్తున్నాను అన్నానే అనుకోండి, అప్పుడేమయింది? ద్వైతం వచ్చిందిగా! నువ్వు వేరే, నేను వేరే. మరప్పుడు ఆత్మానుభవంలో ఇద్దరు వున్నారా? లేరుగా. గురుశిష్యులు అనేవారు లేరుగా. ఎవరున్నారు మరి? కేవలం ఒక్కళ్ళే ఉన్నారు. ఆ అనుభవజ్ఞానానికి సాక్షి అయినవాడు ఎవడైతే వున్నాడో, వాడొక్కడే వున్నాడు. అక్కడ అనుభవమూ లేదు. అనుభవించేవాడూ లేడు. అనుభవించబడేది లేదు. అటువంటి మూడూ లేనటువంటి అతీతమైనటువంటి స్థితిగా ఆత్మానుభవం వున్నది.

మరి పంచకోశాలు లేవా? వున్నాయి అంటున్నారా? లేదా? శాస్త్రజ్ఞానం ఏమని చెబుతోంది? పంచకోశాలు వున్నాయి అంటోందా లేదా? అంటోందా? పరి పంచకోశాలు వున్నాయా లేవా ఇప్పుడింతకీ? ఆత్మను ఒకదానిమీద ఒకటి కప్పినాయి.

అంటున్నావా లేదా? కప్పినాయా? ఆత్మను కప్పగలవా ఏవైనా? కప్పలేవుగా. ఎందుకనీ? ఆత్మ సర్వవ్యాపకం, అనంతం. అంతేకదా! మీ వివేకచూడామణి అంతా ఏం చెబుతోంది? ఆత్మను కప్పినవి అంటోందా లేదా? కొన్ని వేదాంత శాస్త్రాలలో మనకు ఏమని చెబుతోంది? ఆత్మ లోపల వుంది. పైన అన్నమయ్యకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం ఒకదానిమీద ఒకటి కప్పినాయి. లోపల స్వప్రకాశం వుంది, స్వరూపజ్ఞానం వుంది. ఇవి ఉల్లిపాయ పొరలవలె అలా ఏవో ఉపమానాలు చెప్పారు. అరటి పువ్వు వలె ఇలా ఏవో చెప్పారు. ఇలా చెప్పడం సబబేనా? అంటే, అజ్ఞాన దృష్టితో వున్నవాడికి, బుద్ధి వికాసము లేదు కాబట్టి, వివేకము లేదు కాబట్టి, తత్వజ్ఞాన దృష్టిని సరాసరి అందుకోలేడు కాబట్టి, గురువుగారి తత్వజ్ఞాన దృష్టిని, శిష్యుడు సరాసరి అందుకోగలుగుతాడా? అందుకోలేడు కదా! అందుకని, శిష్యుడి యొక్క ఊహకు అందుబాటులో ఏవి వున్నాయో, ఎట్లా అయితే... ఇప్పుడు వ్యాసభగవానుడు బ్రహ్మసూత్రాలు రచించాడండి. వేదాలను విభజించాడండీ! మరి అష్టాదశపురాణాలు చెప్పవలసిన అవసరం ఏమి వచ్చింది? ఈ కథ రామాయణం, భాగవతం, భారతం ఇవి చెప్పాల్సిన అగత్యం ఏమి వచ్చింది? అవి అంతకంటే పెద్దవే తత్వజ్ఞానానికి సంబంధించినవే చెప్పారుగా? మరి అన్ని ఉపనిషత్తులు ఆయనేకదా రాసింది. అక్కడితో ఊరుకోవచ్చుగా. ఆఁ.. అంటే అర్థం ఏమిటట? నిన్ను ఉద్ధరించాలనే అవ్యాజమైన కరుణ చేత, నీ ఊహకు అందుబాటులో వుండేట్టుగా, నువ్వు అందిస్తే అందుకోవడానికి, చెయ్యి అందిస్తే అందుకోవడానికి అందుబాటులోకి వచ్చే పద్ధతిలో చెబుతున్నాడన్నమాట. అర్థమైందా అండీ !

అందుకని గురువుకి ఎప్పుడూ కూడా మూడు లక్షణాలు వుంటాయి. తన జ్ఞానానుభవ ప్రకాశము చేత నీలో వున్నటువంటి అజ్ఞానాన్ని పోగొడుతాడు. ఇంకేం చేస్తాడు? తాను క్రిందకు దిగి వస్తాడు. తానెప్పుడూ పైన కూర్చుంటే శిష్యుడు అందుకోలేడని తెలిసీ, అవ్యాజకరుణ చేత శిష్యుని హృదయంలోకి తాను దిగి వస్తాడు. ఆ దిగిరావడానికి ఏదైనా చేస్తాడు. అది రెండవ లక్షణం. మూడవ లక్షణం ఏమిటట? శిష్యుని వద్ద వున్నటువంటి అంటే జీవితం ఉద్ధరించబడాలి, ఈ మోక్షం కోసమే నా జీవితం అని నిర్ణయించబడినటువంటి సచ్ఛిష్యుడిని ఉద్ధరించడం కోసమని, శిష్యుని

యొక్క వాసనాబలం మొత్తాన్ని తానే స్వీకరిస్తాడు. స్వీకరించి తన వద్ద వున్నటు వంటి అపారమైనటువంటి తపఃశక్తి ప్రభావం చేత జనించినటువంటి జ్ఞానాగ్నిలో ఆ వాసనాబలం దగ్ధమయ్యేట్టుగా చేస్తాడు. దాని వల్ల ఆ శిష్యుని యొక్క అంతరంగం పరిశుద్ధమైపోయింది. ఇవి మూడు పద్ధతులు. ఉద్ధరించడం అంటే ఈ మూడు చేయగలిగి వుండాలి. ఇది గురువు అంటే. గురుస్థానాన్ని స్వీకరించినవారికి ఈ మూడు శక్తులు వుండాలి. అంటే తాను తన జీవితాన్ని ఈ మూడింటి మీదా నడపాలి. దైవీ ప్రణాళిక అంటేనే ఈ మూడు. బాగా గుర్తు పెట్టుకోండి. అంటే దైవీ ప్రణాళిక మేరకు జీవిస్తున్నాను అంటే అర్థం ఏమిటంటే, నీకు అనంతమైనటు వంటి బ్రహ్మ యొక్క అనుభవంతో ఆ బ్రహ్మానుభవంలో స్థితమై, స్థిరమై వుండాలి. దానిని దేనికి వినియోగించాలట? ఎవరైతే ఆశ్రయించినవారు వున్నారో, వారి యొక్క హృదయంలోకి వారిని అర్థం చేసుకుని, వారి హృదయంలోకి దిగిరావాలి. ఆ అనంతమైనటువంటి స్థితి నుంచి పరిమితమైనటువంటి, ఆశ్రయించినటువంటి సాధకుల హృదయంలోకి దిగిరావాలి. దిగివచ్చి వారికి అందుబాటులోకి వచ్చేట్టుగా వారి జీవితాన్ని సంస్కరించాలి. ఆ సంస్కరించే క్రమంలో వారి వాసనా బలాన్నే ప్రతిఫలంగా, దక్షిణగా పుచ్చుకుని తన యొద్ద వున్నటువంటి తపోఫలం చేత లభించినటువంటి జ్ఞానాగ్నిలో శిష్యుని యొక్క వాసనాబలాన్ని దగ్ధం చేయాలి. చేస్తే సచ్ఛిష్యుడు సిద్ధుడై స్వయముగా అతనిలో వున్నటువంటి స్వరూప జ్ఞానానుభవం అతనికి ప్రకటితం అవుతుంది.

ఇప్పుడు అతనిలోనే వుందా లేదా? కనబడడం లేదు. ఎందుకు కనపడడం లేదట? అడ్డం ఏం చెబుతున్నావు? ఆ జీవిలో వున్నటువంటి వాసనాబల ప్రభావం చేత, అది కనబడడం లేదు అంటున్నావు. మరి వాసనాబలం పోవాలిగా. పోవాలి అంటే మరి ఎట్లా పోతుంది? అంటే, తనకు తాను స్వయంగా ప్రయత్నం చేసి పోగొట్టుకోవడం నీవల్ల అయ్యే పని కాదు. నువ్వు ఏం చేయవచ్చయ్యా? అంటే, సచ్ఛిష్యుడిగా అర్హత పొందే ప్రయత్నం చేయవచ్చు. నువ్వు చేయగలిగినది ఒకటే పని. ఏమిటి? హృదయంలో సద్గురువుని నిలుపుకోవడం, శరణాగతి చెంది, సదా మూడు అవస్థలలో గురువు కనుసన్నలలోనే జీవించడం అనేది ఒక్కటే శిష్యుడు చేయగలడు. అంతకు మించి ఏమీ చేయలేడు. ఎందుకనిట? తనను తాను అర్పించుకొనట కంటే శిష్యుడు మరి

నీకేమిచ్చును? ఆయన దగ్గర ఏముందట? నీ దగ్గర ఏముంది? హృదయం తప్ప మరొకటి ఏమీ లేదు. మిగిలినవి నీ దగ్గర వున్నా అవి గురువుకు పనికి రావు. అర్థమైందా అండీ!

నీ ధనం అది గురువుకి ఏమీ పనికిరాదు. నీ ఆస్తులు వాటితో అస్సలు పనిలేదు. పోనీ నీ కుటుంబం ... నీకే బరువు అయితే నాకు ఎందుకు అదంతా? అది అనవసరం. ఇంకేమున్నాయి నీ దగ్గర? అంతేకదండీ, ఇవే కదా నీ దగ్గర వున్నాయి, చెప్పుకోవడానికి ప్రత్యేకమైనవి నీ దగ్గర ఏమున్నాయి? అంటే, అనేక జన్మ సముపార్జితమైనటువంటి, ఇందాక చదువుకున్నటువంటి దేశ, కాల, వస్తు, గుణ, రూపం. నీ వాసనలు ఈ అయిదింటిలో వున్నాయా లేవా? ఇప్పుడు వాసనాబలం అంటే ఎన్ని లక్షణాలతో వుందట? ఈ అయిదు లక్షణాలతోటి వున్నది. దేశం, కాలం, వస్తు, రూపం, గుణం మీరు ఏదన్నా చెప్పాలనుకోండి ఏం చెప్తారు? ఎలా చెప్తారు? ఈ అయిదు లేకుండా చెప్పండి చూద్దాము? ఏదైనా సరే, మీరు ఏదన్నా ఒకరు చెబుతున్నది విన్నారండీ! అది మీకు అర్థం కావాలండీ! ఈ అయిదు లక్షణాలు వుంటే అర్థమైందా? ఈ అయిదు లక్షణాలు లేకపోతే అర్థమైందా? వుండాలి కదండీ! మరి ఆత్మ స్వరూప లక్షణాలు గానీ, బ్రహ్మజ్ఞానానికి సంబంధించిన లక్షణాలు గానీ, ఈ అయిదిటితో పనిలేకుండా చెబుతున్నాడుగా. అది అర్థమౌతుందా అప్పుడు. బుద్ధి అర్థం చేసుకోగలుగుతుందా? ఏమని సమాధానం చెబుతోంది? దీనికి సంబంధించిన సామాచారం నా దగ్గర ఏమీ లేదు అంటోంది. ఉదాహరణ: తురీయం అని చదువుకున్నారు మీరంతా. తురీయానికి సంబంధించింది ఏమైనా గానీ బుద్ధి మీకు అందిస్తుందా? ఎందుకు అందించడం లేదు? అది అందించాలిగా లెక్క ప్రకారము. నీకు అందించేది ఏదైనా అది బుద్ధే కదా! తురీయం విషయం చదివావండీ! తురీయం విషయం చదువుతావే గానీ, అదేమీ అవగాహనకు రాలేదు. అనుభవానికి రాలేదు. ఓహో! ఇది ఒకటి వుంది అని తెలుసు అంతే! ఎందుకని మహానుభావుల దగ్గర వినడం కానీ, ఆ ప్రవచానలలో వినడం కానీ, శాస్త్రంలో చదవడం గానీ వరకే తెలుసు. మరి నీకు స్వయంగా తెలుసా? తెలియాలి అంటే మరి ఆయనేమంటున్నాడు అక్కడ?

అది మూడు అవస్థలలోనూ కలిసిపోయి వున్నది. నాలుగో అవస్థకాదు. మూడు అవస్థలలోనూ ఒక్కతీరుగా వుండి, మూడవస్థలచేత ప్రభావితం కాకుండా వుండి ఏదైతే

వున్నదో నీలో, ఆ స్థితిలో గనుక నీవు వుంటే, అది తురీయము. అని ఒక నిర్వచనము. ఇదే తురీయమా? అంటే వీలుకాదు. అది ఒక నిర్వచనము. ఆ తురీయ స్థితిలో వున్నదానిని వాగ్రూపములో పెడితే, ఒక అంశని ఇట్లా చెప్పవచ్చు. మరి అదే తురీయమా అనిఅంటే అది అట్లా చెప్పడానికి వీలుకాదంటాడు ఆయనే. మీకు అందుబాటులోకి రావాలి కాబట్టి నేను ఇలా చెబుతున్నాను. ఇంతకంటే నువ్వు ఎక్కువ ఊహించలేవు. ఇదే నీ ఊహకు అందడంలేదు కాబట్టి, ఇంతకంటే

పై స్థితిని అసలు ఊహించలేవు. నీకు అందుబాటులోకి రాదు. కాబట్టి, ఏదైతే సర్వవ్యాపక జ్ఞానం వున్నదో, సర్వవ్యాపక సచ్చిదానందం అనండి, అనంత శక్తి జ్ఞానానందములు అనండీ, ఏ పేరుతో ఎలా చెప్పినా ఆ సర్వవ్యాపక స్థితిని వాగ్రూపంలో పెట్టేటప్పటికే పరిమితమైపోయింది. వాక్కుగా వ్యక్తం అయ్యేటప్పటికే పరిమితమైపోయిందట. ఎందుకనిట? వాక్కుగా వ్యక్తం అవ్వాలంటే మనోబుద్ధులు పనిచేయాలా? అక్కర్లేదా? మరి మనోబుద్ధులు పనిచేయాలంటే, ఆ సర్వవ్యాపకమైనదంతా ఏమైపోయింది ఇప్పుడు? వచ్చేయలా? పరిమితం అయిపోలేదా? వాక్కుగా వచ్చేటప్పటికి, ఇంకా పరిమితం అయిపోయింది. అర్థమైందా అండీ!

కాబట్టి ఏమంటున్నాము మనం? అప్రాప్య మనసా సహ - మనసుతో గానీ, వాక్కుతో గానీ, ఊహించడానికి చెప్పడానికి వీలుకానటువంటిది ఏదైతే వున్నదో అంతే కదండీ! పెద్దవాళ్లు అందరూ ఏం చెప్పారు? యతో వాచో నివర్తంతే - ఎక్కడైతే వాక్కు తనంతట తానుగా లేకుండా వుంటుందో అంటే, వాక్కు యొక్క మూలం తెలిసి వుండాలి నీకు. ఎక్కడ నుంచి వాక్కు ఉద్భవిస్తోందో, ఏ స్థితి నుంచైతే శబ్దం ఉద్భవిస్తోందో, ఆ శబ్దానికి మూలమైనటువంటి నిశ్శబ్దస్థితిలో, ఎక్కడినుంచైతే ఆలోచన ఉత్పన్నమౌతోందో, ఆ ఆలోచనకు మూలమైనటువంటి స్థితిలో ఎట్లా అయితే ఆలోచన లేకుండా వున్నదో, ఎక్కడైతే సంకల్పం వుద్భవిస్తోందో, ఎక్కడైతే అట్టి సంకల్పమనే వ్యాపారమే లేకుండా వున్నటువంటి సహజ నిర్వికల్పం ఏదైతే అయివున్నదో... ఇలా చెప్పుకుంటూ వచ్చారు. అర్థమైందా అండీ!

పైదాని గురించి చెప్పవయ్యా అని అంటే దేనిని గురించి చెప్పారు? క్రింద దాని సంగతి అంతా, ఇదంతా లేనిది ఎక్కడైతే వుందో అది ఇది. అని చెప్పారు. అర్థమైందా

అండీ! కాబట్టి మన ఇంద్రియములన్నీ ఇప్పుడు ఈ వ్యాపారంలోకి వస్తున్నాయా? రావడం లేదా? వస్తున్నాయి. ఈ వ్యాపారములోకి వచ్చినప్పుడు, మరి దీని వ్యాపార రహితమైన స్థితి దీనికంటే ముందు వుందా లేదా? వుందిగా. మెలకువలో మనం అన్ని ఇంద్రియాలనీ ఉపయోగిస్తున్నాము. నిద్రావస్థలో వుపయోగించడం లేదు. నిద్రావస్థలో ఈ ఇంద్రియాలకు వ్యాపారం వుందా? లేదా? వుండి లేదా? లేక వున్నయ్యా? కాబట్టి, నీవు విచారణ అంతా దేనిని బట్టి తెలుసుకోవాలయ్యా అని అంటే, నీ నిద్రావస్థను నీవు విచారణ చెయ్యి మొట్టమొదట. ఎందుకనిట? అక్కడ నువ్వు మెలకువలో చేస్తున్నవన్నీ లేకుండా వున్నావు. నువ్వు ఎలా వున్నావట? మెలకువలో చేస్తున్నవాటన్నటినీ లేకుండా వున్నావు. మెలకువలో వీటితో పనిచేస్తూ వున్నప్పుడు, ఈ పనిచేయడమే నువ్వు అనుకుంటున్నావు. ఇక్కడ వచ్చిన చిక్కు ఏమిటట? ఈ పనిచేయడమే నువ్వు అనుకుంటున్నావు. క్రమంగా మెలకువ స్థితిని దాటి కలలోకి వెళ్ళేటప్పటికి ఏమైంది? ఈ పనిచేయడం పోయింది. పని చేయడానికి ఆధారమైన ప్రేరణలతో కల జరుగుతోంది. మెలకువలోనేమో పనులతోనే పని జరుగుతోంది, కలలో ఏమో దేనితో పనులు జరుగుతోంది? పనులకు ఆధారమైనటువంటి ప్రేరణా స్థితులతో కల జరుగుతోంది. దానవతల ఇంకో మెట్టు అవతలకు వెళ్ళేటప్పటికి అవి కూడా ఒక తెర వెనక్కి పోయింది. నిద్ర అనే తెర వెనక్కి పోయినాయి. అక్కడ ఏమైపోయినాయట ఇప్పడు అవి? ఇప్పుడు ఇంద్రియాలు లేవా నీకిప్పుడు? వున్నాయి. కానీ ఎలా వున్నాయి? వ్యాపార రహితంగా వున్నాయి. కాబట్టి వుండి లేకుండా వున్నాయి. లేవా? అంటే వున్నాయి. వున్నాయా? అంటే వుండీ లేకుండా వున్నాయి. వున్నాయా లేవా? నీవు ఎలా వున్నావు, ఇప్పుడక్కడా? మెలకువలో వున్నంత వరకూ ఇంద్రియాలు పనిచేస్తేనే ఆ పనే నువ్వుగా వున్న వాడవు, కలలో ఆ పనులకు ప్రేరణగా వున్నటువంటి వాడవు, నిద్రలో వ్యాపార రహితంగా వున్నటువంటి స్థితిలో వున్నటువంటి వాడవు. అంతేనా కాదా? ఈ మూడు స్థితులు వున్నాయా లేవా నీకు ఇప్పుడు? ఈ మూడు స్థితులలో కూడా నువ్వు వాటితో కలిసి పోతున్నావా? విడిగా వున్నావా? కలిసి పోతున్నావా? విడిగా వున్నవా? మెలకువలో పని జరుగుతుందండీ, కలిసిపోతే ఏమయ్యావు? జీవుడవైనావు. విడిగా వుంటే ఏమయ్యావు? సాక్షివి అయ్యావు. విడిగా వుంటే ఏమయ్యావు? మెలకువలో చేసే పనికి సాక్షివి.

ఫలితాలకు సాక్షివి. విషయాలకు సాక్షివి. ఇంద్రియాలకు సాక్షివి. కలలో? ఆ ఇంద్రియాల ప్రేరణలకు సాక్షివి. మనో బుద్ధులకు సాక్షివి. నిద్రలో? చిత్త, అహంకారములకు సాక్షివి. నిద్రావస్థలో ఎక్కడున్నావు? చిత్తం అహంకారం మధ్యలో వున్నావు. అటు ఇటు కాకుండా. కదిలితే ఆ అహంకారం చిత్తం, కదలక పోతే అహం అహంగానే వుండిపోతుంది. ఆకార భ్రాంతిని పొందదు. ఆ రకంగా నువ్వు ప్రజ్ఞా స్థితిలో వున్నావు. కానీ గుర్తుపట్టలేకుండా వున్నావు. కారణం ఆ అహంకారం, చిత్తం మధ్యలో నిద్రాస్థితిలో వున్నావు కాబట్టి. ఆ వాసనాబల ప్రభావంలో మునిగి వున్నావు కాబట్టి. అది అజ్ఞాన అంధకారం కాబట్టి ఆ వాసనాబలం వచ్చినప్పుడు నీకు ఆ గాఢ నిద్రావస్థలో చీకటిగానే నీకది ప్రకటితమౌతున్నది కాబట్టి. కాబట్టి అందరం గాఢ నిద్రావస్థలో వెలుగులో వున్నామా? చీకటిలో వున్నామా? చూడండి మరి నిద్రపోయేటప్పుడు. చీకటి ఆవరించకూడదు. నిద్ర వచ్చేసేటప్పటికి బుద్ధిని చీకటి ఆవరించేస్తుంది. ఎక్కడి నుంచి వచ్చిందట ఇప్పుడది? నీ నుంచే అది వచ్చింది. బయట నుంచీ వచ్చిందా? లేదు కదా! నీ యందే ఎక్కడ వున్నదటా? ఇప్పుడది? చిత్తం అహంకారం మధ్యలో వున్నది. అక్కడ నీవు నీ ప్రజ్ఞ అక్కడ ఆగిపోతోంది. ఇప్పుడు తురీయంలో వున్నవాడికి ఏమిటట ప్రయోజనం అంటే? ఆ నిద్రావస్థకు కూడా అతను సాక్షిగా వున్నాడు. ఈ చిత్తము, అహంకారానికి కూడా సాక్షిగా వున్నాడు. వుంటే ఏమిటట పరమ ప్రయోజనం? అంటే, చిద్రూపం అయ్యాడు. ఇప్పడు ఏమయ్యాడండీ? ఎవరైతే తురీయ ప్రవేశం, తురీయానుభవం కలిగిన వారు వున్నారో, వారిని ఏమనాలట ఇప్పుడు? చిద్రూపం. ఇప్పుడు ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, అక్కడ ఏముంది చదవండి, చివరి వాక్యంలో. యతి వరా! శాస్త్ర స్వరూపా! చిద్రూపా! అని వుంది. ఈ చిద్రూపం అంటే అర్థం ఇది. మూడు అవస్థలకి సాక్షివై, ఎవరైతే తురీయానుభవం బ్రహ్మానుభవంలో వున్నారో, వాళ్ళందరూ ఎవరండీ? చిద్రూపులు. వాళ్ళకి చిత్త ప్రభావం లేదు వాళ్ళ మీద. చిత్తం యొక్క, మనోమయ కోశం యొక్క, విజ్ఞానమయ కోశం యొక్క, ఆనందమయ కోశం యొక్క ప్రభావాలు వాళ్ళ మీద ఏమీ లేవు. అర్థమైందా అండీ!

ఆత్మ పంచకోశ విలక్షణం. అంతే కదండీ! అంతేనా? వ్యతిరిక్తం. అంటే ఈ పంచకోశాలకు ఏ లక్షణాలు వున్నాయో, దానికి అవి లేవు అని అర్థం. ఎందుకు చెప్పారయ్యా ఈ పంచ కోశాలు? ఇందాక చెప్పాను మీకు, నిశ్శబ్దం బ్రహ్మముచ్యతే.

బ్రహ్మము అంటే ఏమిటయ్యా? నిశ్శబ్దమే బ్రహ్మము. నీకు తెలిసిన ప్రపంచం అంతా దేనితో కూడుకుని వుంది? శబ్దంతో కూడుకుని వుంది. దీనికి ముందు ఏముందయ్యా? ఇది లేదు. అర్థమైందా అండీ! దీనికి ముందు ఏముంది అని అడిగితే ఏం ప్రశ్న చెప్పావు? ఇది లేదయ్యా బాబు. నీకు తెలిసినదంతా లేదు. అదేమిటి? అది బ్రహ్మము. ఇది లేదంటే ఏదైతే మిగిలి వున్నదో, అదంతా బ్రహ్మమే. మరి ఇది వున్నప్పుడో? ఇది కూడా బ్రహ్మమే. అంటే అర్థం ఏమిటట? ఇది లేకముందు వున్న స్థితిని గనుక నీవు ఒప్పుకుని అందులో నిలబడి అక్కడి నుంచి దీనిని చూస్తే, ఇది కూడా అదే. అక్కడి దాకా చూడలేదు. దీనిని మాత్రమే చూస్తున్నావు, నీ కళ్ళ ఎదుట వున్నదానిని మాత్రమే చూస్తున్నావు. నీకు ఎప్పటికీ మాత్రం అర్థం కాలేదు. నీకెప్పటికీ దీని అవతల వున్నది ఎప్పటికీ నీవసలు తెలుసుకోవడం లేదు. అంటే నువ్వు దృష్టిని అక్కడిదాకా వ్యాపకం చెందించలేవు. ఆ సర్వవ్యాపక లక్షణ స్థితిగా నువ్వు మారలేవు. అర్థమైందా అండీ! ఏమైంది అప్పుడూ? ఈ దేశము, కాలము, వస్తువు, గుణము, రూపము అనే ఐదు లక్షణాలు నీ కళ్ళ ఎదురుగుండా వున్నటువంటి దానికి వున్నాయి. ఇది దేని ప్రభావం చేత వున్నది? చిత్తం ప్రభావం చేత వున్నది. వాసనాబల ప్రభావం చేత వున్నది ఈ ఐదు లక్షణాలు కూడా. ఎవడైతే మూడు అవస్థలను దాటి, బ్రహ్మానుభవంలో స్థితుడై, స్థిరమై వున్నాడో, వాడు చిద్రూపుడు. ఎందుకనిట? నిశ్శబ్దం బ్రహ్మముచ్యతే. శబ్దజాలమయం కదండీ ఇదంతా కూడా. శబ్దము చేత సృజించబడింది. ఈ శబ్దం చేత సృజించబడిన దీంట్లో ఈ అయిదు లక్షణాలు వున్నాయి. కాబట్టి అటువంటి బ్రహ్మానుభవం కలిగినటువంటి చిన్మయానంద స్వామికి నమస్సులివే. అర్థమైందా అండీ! అది ఆయన గురు స్వరూపం అంటే.

ఈ అష్టావక్ర గీత మనందరికీ సులభమైనటువంటి పద్ధతిలో అందించినటువంటి మహానుభావుడు చిన్మయానందులు. ఇది మనం క్రమంగా పరిశీలిస్తాము. పరిశీలించేటప్పుడు మీరందరూ కూడాను, వివేకచూడామణి చదివిన వారై వుండాలి. అది అవగాహన అయి వుండాలి. వివేకచూడామణిలో వున్న అంశాలని కొంచెం పై భావనలో తెలుసుకుంటాం. మీరు పూర్వం వివేక చూడా మణి చదివారా? అవగాహన వుందా? అయినా మన దగ్గర వుంది వివేకచూడామణి, ఎక్కడికక్కడ మీరు అష్టావక్రగీతలో ఒక పాయింటు ఇక్కడ చదువుకుంటూ, దీనికి సంబంధించినది

వివేకచూడామణిలో ఎక్కడ వుంది అనేది బేరీజు వేసుకోవాలి. రెండు గ్రంథాలు ప్రక్కనే పెట్టుకుని, అదే విషయం వివేకచూడామణిలో ఏముంది? ముందు వివేకచూడామణిలో ఏముందో స్థిరంగా పూర్తిచేయగలగాలి. ఇప్పుడు అష్టావక్ర గీతలో దాని పై భావం వుంటుంది. ఈ పై భావాన్ని దాన్ని ఆధారం చేసుకుని అందుకోవాలి. ఈ రెండూ ఒకేసారి బాలెన్స్ అవ్వాలి. అయితే గానీ నువ్వు అష్టావక్రగీత పై విషయాన్ని అందుకోవడానికి స్థిరపడవు. కాబట్టి మీలో ఎవరి శక్తి సామర్థ్యం మేరకు వారు, మీ బుద్ధి శక్తి ఏమేరకు సహకరిస్తే, ఆ మేరకు ప్రయత్నం చేయండి.

[ఇవాళ్టికి ఆల్రెడీ 12.30 అయ్యింది కాబట్టి ఇప్పుడు స్వస్తి. రేపు ఉదయం, ఇప్పటికే చాలా సేపు ప్రయాణం చేసి వచ్చారు కదా!]

ఓం

పూర్ణ మదః పూర్ణ మిదం

పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే

పూర్ణస్య పూర్ణమాదాయ

పూర్ణమేవా వశిష్యతే

ఓం తత్ సత్

ఓం

సహనాభవతు సహనౌ భునక్తు

సహవీర్యం కరవావహై

తేజస్వి నామవధీతమస్తు

మా విద్విషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

సాయిరాం

**File: 2** [ప్రార్థన: ఓం బ్రహ్మానందం ఓం పూర్ణమదః పూర్ణమిదం ఓం సహనావవతు]

విషయసూచిక ముందు పరిచయ వాక్యాలలో చిట్టచివరి paragraph చూడండి. చదవండి. "సాధన చతుష్టయ సంపన్నులై, శాస్త్రాధ్యయన తత్పరులై, ధార్మిక జీవనం సాగిస్తూ, అంతరంగ శుద్ధిని, నిశ్చల మనోబుద్ధుల శాంత స్థితిని సాధించి, సత్యాన్వేషణకోసమే జీవిస్తున్న ఉత్తమాధికారులకు, అర్హులకు ఈ గీత ఉద్దేశ్యించబడినది. అహంకారాన్ని తద్వారా చూడబడే ప్రపంచపు స్వభావాన్ని చక్కగా అర్థం చేసుకుని భావంలో భావంతో గుర్తింపబడే భావనామయ జగత్తును విడనాడాలనే దృఢ సంకల్పంతో ధీరత్వంతో ఆఖరి అడుగు వేయబోయే సత్యాన్వేషులకు, సాధక శ్రేష్ఠులకు తత్వజిజ్ఞాసులకు మాత్రమే ఇది సరిగా అర్థమౌతుంది." చూడండి. ఎన్ని లక్షణాలు వుండాలో, అష్టావక్రగీత ముట్టుకోవాలి అని అంటే. అధ్యయనం చేయాలని అంటే, చాలా స్పష్టంగా తెలుగు సేత చేసినటువంటి వాళ్ళు, దీనిని ముందే చెప్పారు. అంటే ఈ ఉత్తమ లక్షణాలు వుంటే తప్ప, యథాతథంగా నీకు అష్టావక్రగీత అర్థం కాదు. దీనికి కారణం వుంది. చిన్న విషయం తెలుసుకోవాలి.

ఒకసారి చతుర్ముఖ బ్రహ్మగారు శ్రీమన్నారాయణుని ఆశ్రయించి, "ఈ అనంత సృష్టి నాచేతనే సృజించబడినది కాబట్టి ఈ సృష్టిలో మొదటివాడను నేనే. ఆద్యంతములు లేక సృష్టంతా వ్యాపించి వున్నవాడను నేనే. కాబట్టి నాకన్న గొప్పవాడు ఈ సృష్టియందు మరొకడు లేడు" అని శ్రీమన్నారాయణునితో సంభాషిస్తే, శ్రీమన్నారాయణుడు సరే అలాగే, ఒకసారి అలా వెళ్ళి పరిశీలించి వద్దాము రండి నడిచి వెళ్ళొద్దాం అన్నాడు. అని కొంత దూరం తీసుకుని వెళ్ళగా, ఒక చోట ఒక మహానుభావుడు తపస్సు చేస్తున్నాడు. ఆయన రోమశ మహర్షి. ఆ రోమశ మహర్షి పక్కన గుట్టగా రోమాలు పడి వున్నాయి. ఆయన ఎంత ఎత్తు వున్నాడో, ఆయన పక్కగా పడి వున్నటువంటి రోమాలు కూడా అంత ఎత్తు గుట్ట వున్నది. ఈ మహానుభావుడు ఎవరూ అని వారు అడుగుతారు. వారినే మనం అడుగుదాం అని వారి దగ్గరకి వెళ్తే, వారు వారిని పరిచయం చేసుకుంటారు. అయ్యా! నేను రోమశ మహర్షిని. అప్పుడు ఈ బ్రహ్మగారికి ఒక సందేహం కలిగింది. అయ్యా! మీ ప్రక్కనే ఈ రోమాల గుట్ట ఏమిటి అని? నాలుగు మహాయుగాలు అంటే కృతయుగము,

త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము ఇవి నాలుగు కలిపితే ఒక మహాయుగము. ఇటువంటి మహాయుగాలు అన్నీ కలిపి బ్రహ్మకు ఒక పగలు, మళ్ళా ఇంకో మహాయుగం కలిపి ఒక రాత్రి. అలాంటి వంద సంవత్సరాలు అయితే బ్రహ్మగారికి ఆయుర్దాయం నిండుతుంది. అంటే ఒక బ్రహ్మ గారు వెళ్ళి పోయి మరొక బ్రహ్మగారు వస్తారు. ఒక్కొక్క బ్రహ్మగారు వెళ్ళిపోయినప్పుడల్లా ఒక రోమం వూడి పడిపోతుంది ఆయనకి. ఇప్పుడు ఆ పక్కనున్న రోమాలన్నీ ఏమిటీ అని అంటే, అంతమంది బ్రహ్మలు వెళ్ళి పోయారు. అని రోమశ మహర్షిగారు చెప్పారు. అప్పుడు ఈ బ్రహ్మగారికి ఏమనిపించింది? ఓహో! సరే, ఇంకా వెళదాం పదండీ అన్నారు. ఇక తెలుసుకోవడం అయిపోయింది, నేనే గొప్పవాడినికాదనే సంగతి నాకు అర్థమైపోయింది. నేను గొప్పవాడిని కాదని, నాలాంటి వాళ్ళు ఎన్ని వేలు, లక్షల మంది వెళ్లిపోయారో ఆ రోమశ మహర్షి రోమాలు చూస్తేనే తెలిసిపోతుంది. సరేలేండి, ఇప్పుడు ఏమైంది? కొంచెం దూరం వెళ్ళి చూద్దాం అని ముందుకు వెళ్తారు. అక్కడ మరొక మునీంద్రులు, వారు వారి దగ్గరకి వెళ్తే అయ్యా! నమస్కారం. నేను అష్టావక్ర మునీంద్రుడను. మరి మీరేమిటి, మీరు ఎంతకాలం నుంచి తపస్సు చేస్తున్నారు? నాకంటే ముందు రోమశ మహర్షిగారు వున్నారు. వారి ఒంటి మీద వున్న రోమాలు అన్నీ పడిపోతే, రోమశ మహర్షిగారు వుండరు. వారు చాలిస్తారు. అటువంటి రోమశమహర్షిగారు ఒక్క రోమశ మహర్షిపోతే నాకు వున్నటువంటి 8 వంకర్లలో ఒక వంకర పోతుంది. ఇప్పటికి ఇంకా ఒక వంకర కూడా పోలేదు. అన్నారు. వీళ్ళందరూ చిరంజీవులన్నమాట. ఆ మాట చెప్పడం కోసం. అంటే సృష్టి వున్నంతకాలం, విశ్వ సృష్టి వున్నంతకాలం వీళ్ళందరూ వుండే వాళ్ళే. అందుకే ధృవమండలం ఎప్పటికీ పడిపోదు. మన పెద్దవాళ్ళు అందుకే ఇదంతా చెప్పకుండా, ఇదంతా అర్థం కాదని, ఏం చెప్పారు? సప్త ఋషులు అనేవాళ్ళు ఎప్పటికీ వుంటారు. ధృవమండలం ఎప్పటికీ పడిపోదు. ఇలాగ పెద్దవాళ్ళు చెప్పడానికి కారణం అది. ఇలాగ మహానుభావులు అనంత సృష్టికి, దైవీ ప్రణాళికకు ఆధారంగా వుంటారు. మైత్రేయుడు ఇలా చాలా మంది వున్నారు. వీళ్ళందరూ కూడా నిరంతరాయంగా ఆ దైవీ ప్రణాళికలో ఎప్పుడూ వుంటారు. వాళ్ళు ఆ దైవీ ప్రణాళికను నిర్వహిస్తూ వుంటారు. వీళ్ళు ప్రత్యేకంగా చేసేది ఏమైనా వుందా ఇప్పుడు? ఎందుకని? సంకల్పమే అనంత సృష్టికి ఆధారం. కాబట్టి

అటువంటి మహానుభావుడు చెప్పినటువంటిది ఈ గీత. ఇదంతా ఎందుకు చెప్పుకున్నాము అనంటే, అష్టావక్ర మహర్షి అంటే చాలా మంది 8 వంకరలు అనే వరకే తెలుసు అందరికి. ఎందుకంటే పేరు లోనే వుంది కాబట్టి. ఆయన తపః శక్తిగానీ, ఆయన యొక్క ధీ శక్తి గానీ, ఆయన ఉద్ధరించగలిగేటటువంటి శక్తి ఎంతటిది అని తెలియాలంటే, ఇప్పుడు ఆయన ఎంతకాలం నుంచి వున్నారు? ఆయన జనకరాజర్షికి బోధించారు ఈ అష్టావక్రగీత.

నిన్న మాట్లాడుకున్నాం. గురు కృపా వీక్షణ లేశమ్ము చేత నీకు జ్ఞానం కలుగుతుంది. జనక రాజర్షినే మనం అందరం ఏమనుకుంటున్నాం? జనకుడు వంటి మహానుభావుడు భూమండలం మీద మళ్ళా ఇంతవరకూ పుట్టలేదు అన్నారు. అటువంటి రాజర్షి ఇంతవరకూ మళ్ళా పుట్ట లేదు. ఏనాటి కాలం వాడు? త్రేతాయుగం నాటి కాలం వాడు. అర్థమైందా! మరి ఏ త్రేతాయుగమో లెక్క వుందా? మన త్రేతాయుగమా? ఇన్ని మహాయుగాలలో ఈ నాలుగు యుగాలలో వున్నటువంటి వాడేనా? ప్రతి త్రేతాయుగంలో ఒక రాముడు, ప్రతి త్రేతాయుగంలో ఒక జనకమహారాజు, ప్రతి త్రేతాయుగంలో ఒక రామాయణం జరిగిపోతూనే వుందిగా, కాబట్టి ఇలా మనం పౌరాణిక దృష్టితో చూస్తే, ఇప్పుడు ఆ అష్టావక్ర మునీంద్రులు ఎక్కడ? ఈ జనక రాజర్షి ఎక్కడ? అటువంటి అష్టావక్ర మునీంద్రుడు ఈ జనక రాజర్షికి బోధించాడు. ఆయన తపఃశక్తి ఇప్పుడు ఎంత? వేల లక్షల కోట్ల సంవత్సరాలు, లెక్కెట్టడానికి వీలు కానంత కాలం వాళ్ళు చిరంజీవులుగా వుండి, అదే పని, దైవీప్రణాళికను నిర్వహించడం అనే పనిలో వున్నారు. అటువంటి మహానుభావుడు ఇప్పుడు ఆయనకు ఏమని పేరు పెడదాం? సద్గురువు అందామా? జగద్గురువు అందామా? సరిపోతాయా ఈ పేర్లు? చాలటం లేదుగా. ఎందుకనిట? ఆ కథ చెబుతోంది. అర్థమైందా అండీ? ఎన్ని వందల, వేల మంది బ్రహ్మలు నశిస్తే, ఒక రోమశుడు పోతాడు. ఒక రోమశుడు పోతే, ఒక వంకర పోతుంది. మరి ఇప్పుడు ఎన్ని వేల లక్షల కోట్ల సంవత్సరాలో లెక్కెడతామా? చాలటం లేదు. అటువంటి మహానుభావుని యొక్క కృపా వీక్షణ లేశమ్ము చేత, ఎందుకనిట?

ఒక రికాబులో కాలు పెట్టి, మరొక రికాబులో కాలు పెట్టే లోపల జీవన్ముక్తి కలిగింది జనక మహారాజుకు, జనక రాజర్షికి. ఎలా సాధ్యం అయ్యింది అది? అంటే ఇప్పుడు

ఆయన ప్రతిభా పాటవాల? అష్టావక్రుని ప్రతిభా పాటవమా? అర్థమైందా అండీ! ఇట్లా జీవన్ముక్తి ఎంత సేపటిలో కలుగుతుంది? గుర్రం మీద కాలు పెట్టి ఒక రికాబులో, (ఎక్కేదాని మీద కాలు పెట్టి) మరొక కాలు పెట్టే లోపల జీవన్ముక్తి కలుగుతుంది. దేని వల్ల? గురుకృపా వీక్షణ లేశమ్ముచేత. మరిప్పుడు మనం జీవన్ముక్తికి ఎన్ని సంవత్సరాలు ప్రయత్నించాలని మన అభిప్రాయం? అర్థమైందా? అంటే ఎక్కడుంది సమస్య? అంటే, అందుకే ఈ చివరి paragraph చదవమన్నారు. మన దగ్గర ఏమి వుండాలట అష్టావక్ర గీత పట్టుకోవాలి అంటే, సాధన చతుష్టయ సంపన్నులై, ఇవన్నీ ఇంతకు ముందు మాట్లాడుకున్నాము. అయినా ఒకసారి గుర్తుచేసుకుందాము. సాధన చతుష్టయ సంపన్నులై వుండాలట. నిరంతరాయంగా మీ దగ్గర ఏముండాలట సంపద అంటే, నిత్యానిత్య వస్తు వివేకము, ఇహమూత్రార్థ ఫలభోగ విరాగము, శమాదిషట్క సంపత్తి, ముముక్షత్వము ఈ నాలుగు సాధనచతుష్టయము. మన దగ్గర ఏమి వుండాలి? మన దగ్గర మిగిలిన సంపదలు వుంటే లాభం లేదు. అష్టావక్రగీత నీకు స్వాధీనం అవ్వాలి అనంటే, నీకు తెలియాలి అంటే, అనుభవంలోకి రావాలి అనంటే, నీకు ఆ సాధన చతుష్టయంలో ఎడతెగని సంపద వుండాలి. శాస్త్రాధ్యయన తత్పరులై, తత్పరులై అంటే, తత్వదర్శనం అనేటటువంటి దృష్టితో శాస్త్రాన్ని చదవడం. శాస్త్ర దృష్టితో తత్వాన్ని తెలుసుకోవడం కాదు. తత్వ దృష్టితో శాస్త్రాన్ని చూడగలిగేటటువంటి అధ్యయనపరులై, ధార్మిక జీవనం సాగిస్తూ, అంటే ధర్మమే అధారం, అలాంటి జీవనం సాగిస్తూ, అంతరంగా శుద్ధిని – ఇటువంటి వాడికి అంతరంగం శుద్ధి కాకుండా వుంటుందా? అయినా మరి ఈ మాట ఎందుకు అన్నారు? ఎక్కడైనా, ఎంత ధర్మం ఆధారంగా జీవిస్తూ వున్నా అనంత సృష్టికి సంబంధించి నటువంటి లవలేశమైనా కూడా ప్రారబ్ధంలో మాలిన్యం వుండే అవకాశం వుంది కాబట్టి, దానిని అంతరంగ శుద్ధి అన్నారు. నిశ్చల మనోబుద్ధుల శాంత స్థితిని, మనసు బుద్ధి రెండు లక్షణాలను కలిగి వుండాలి. నిశ్చలంగా వుండాలి, శాంతంగా వుండాలి. ఇప్పుడు ఈ రెండిటిలో ఏది ముందు? చూడండి అక్కడ ఏమి వుందో? మనం ఇప్పుడు ఏ స్థితిలో వున్నాము? మనోబుద్ధులను నిశ్చలం చేయడానికి ప్రయత్నిస్తున్నామా? శాంతంగా వుంచడానికి ప్రయత్నిస్తున్నామా? (శాంతిగా వుండడానికి ప్రయత్నిస్తున్నాము). శాంతాన్ని ప్రయత్నిస్తున్నాము. మరి

ఆయనేమంటున్నారు? ముందు నిశ్చలం అయితే కదా! అసలు శాంతంగా వుండడం అనేది? అర్థమైందా! దాన్ని ఏదో ఒక కట్టు కొయ్యకి కట్టేస్తేనే, అది శాంతం అవుతుంది. కట్టుకొయ్యకే కట్టేయపోతే, ఎప్పటికీ శాంతం అవదు. అవునా కాదా? కాబట్టి నిశ్చల మనోబుద్ధులు వుండాలి. వున్నవి కూడా మళ్ళా ఎలా వుండాలి? కట్టుకొయ్యకు కట్టేసే పని లేకుండా శాంతంగా వుండాలి. కట్టుకొయ్యకు కట్టివేసినా కూడా శాంతం లేనట్టే. దీంట్లో వున్నటువంటి అంతరార్థాన్ని లోపలికి వెళ్ళే కొద్దీ మనం విచారణ చేస్తాము.

సత్యాన్వేషణ కోసమే జీవిస్తున్న ఉత్తమాధికారులు – నీ జీవన లక్ష్యం ఏమై వుండాలట? సత్యాన్వేషణ. సత్యం అన్నా భగవంతుడు అన్నా రెండూ ఒక్కటే. సద్గురువు అన్నా, సత్యం అన్నా, భగవంతుడన్నా, పరమాత్మ అన్నా, పరబ్రహ్మం అను, బ్రహ్మ అను ఇవన్నీ ఒక్కొక్కటి స్థితి భేదంగా పెట్టుకున్న పేర్లు. అంటే నా జీవితం దీని కొరకు మాత్రమే. ఇక మిగిలినటువంటివి నా జీవితంలో సాధించవలసినవి ఏమీ లేవు. చేయవలసినవి ఏమీ లేవు. నా కర్తవ్యం అంటూ ఏమీ లేదు. కేవలం ఇది ఒక్కటే. అనేటటువంటి వాళ్ళు ఎవరైతే వున్నారో, వాళ్ళు ఎవరట? ఈ పై లక్షణాలు వున్నవారందరికీ కలిపి ఒక పేరు వుంది ఏమిటంటే అది, ఉత్తమాధికారి.

ఇప్పుడిది మరి మీరు బోధించ పూనుకుంటున్నారు. అక్కడ మీరు ఎవరు? అక్కడ మీరు ఇప్పుడు హైదరాబాదులో ఏం చేయబోతున్నారండీ? అష్టవక్రగీతను బోధించపూనుకున్నారు. అంటే మీరిప్పుడు ఏ స్థితిలో వుండాలి అనేది మీరు విచారణ చేసుకోవాలి. అర్హులకు, ఈ ఉత్తమాధికారి అనేవాడే దీనికి అర్హుడు. చాలా ముఖ్యం అండి. ఈ గీత ఉపదేశించ పూనుకున్నారు. అహంకారాన్ని తద్వారా చూడబడే ప్రపంచ స్వభావాన్ని, చక్కగా అర్థం చేసుకుని, చూడండి! ఎక్కడ మాట్లాడుతున్నారో... ఎక్కడినుంచి చూడాలట? అంతఃకరణ చతుష్టయంలో అహంకారమే ఆధారం. దాని అవతల? జ్ఞాత. అంటే జ్ఞాతకి అహంకారానికి మధ్యలో పట్టుకోవాలండి. ఇప్పుడు మనం ఎక్కడ పట్టుకున్నాము? మనస్సుకి ఇంద్రియాలకి మధ్యలో పట్టుకున్నాము. ఎక్కడ పట్టుకోవాలట దానిని? జ్ఞాత అహంకారంగా మొదటి ప్రతిబింబం ఏదైతే ప్రతిబింబిస్తుందో, ఆ మొదటి ప్రతిబింబాన్ని గనుక నువ్వు నివర్తించగలిగితే, అప్పుడు ఏమైంది? అంటే, తద్వారా చూడబడే ప్రపంచపు స్వభావం. అహం దృష్ట్యా

చూడబడుతున్న ప్రపంచపు స్వభావాన్నంతా తర్వాత నువ్వు అంతఃకరణంతో విమర్శిస్తున్నావు. చూస్తున్నావు. ఈ ప్రపంచం అలా వుంది, ఈ ప్రపంచం ఇలావుంది. అలా నీకు ఎటువంటి దృష్టి వుంటే, అలా నీకు ఈ ప్రపంచం కనపడుతుంది. కాబట్టి అహంకార మూలాన్ని తెగ్గొట్టడానికి మాత్రమే ఉపయోగపడేది ఇది. అహంకార ప్రతిబింబాలైనటువంటి మనోబుద్ధి చిత్తాల జోలిని అధిగమించడానికి, వీటిని అధిగమించి అహంకార మూలాన్ని తెగ్గొట్టడానికి ప్రయత్నం చేసేవాళ్ళకి ఇది ఉపయోగం. ఎలాగ? అంటే, చూడండి. భావంలో, భావంతో గుర్తింపబడే భావనామయ జగద్భ్రమను విడనాడాలనే దృఢసంకల్పంతో... ఎటువంటి దృఢ సంకల్పం కావాలండీ? ఈ సృష్టి అంతా భావనామయ జగత్తు. ఈ సత్యం తెలిసి దీని మూలాన్ని తెగ్గొడితే, ఎవరు లేకుండా పోయారు? నువ్వు లేకుండా పోయావు. ధీరత్వం – ధీరత్వమంటే, సింహ హృదయం. ఎటువంటిది వుండాలండీ? సింహహృదయం కావాలి. ఎందుకని అలా అన్నారు?

అంటే మనకి ఉదాహరణ చెప్తారు. బయట ఒక కాకి అరిచింది అనుకోండి, ఏమి వస్తాయి? అనేక కాకులు వస్తాయి. అంతేనా అండీ? అది ఎవరైనా పట్టించుకున్నారా? ఈ ప్రపంచంలో ఈ సృష్టిలో ఏ జంతువు అయినా పట్టించుకున్నాయా? కాకులు అరవడం మామూలే, ఇతర కాకులు రావడం కూడా మామూలే. అదే ఒక సింహం గర్జించింది అనుకోండి, అప్పుడు ఆ గర్జన వినపడినంత దూరం, ఒక్క జీవి కూడా అక్కడ వుండదు. కాబట్టి ధీరత్వం అంటే ఆ గురువాక్యం అనేటటువంటి సింహగర్జన తద్వారా నీ అహంకార మూలం తెగిపోవాలి. అది ధీరత్వం అంటే. ఆ గురువాక్యం మీదే నిలబెట్టగలగాలి. దేన్ని? జ్ఞాతని. నీలో వున్నటువంటి సాక్షి, గురువాక్యాన్ని ఆశ్రయించి పనిచేయాలి. అర్థమైందా అండీ! అప్పుడే అహంకార మూలాన్ని తెగ్గొట్ట గలుగుతావు. కాబట్టి దీనికి ఏం కావాలి? దృఢ సంకల్పం వుండాలి. అలాగే ధీరత్వం వుండాలి. చూడండి ధీరత్వంతో ఆఖరి అడుగు వేయబోయే సత్యాన్వేషులకు ప్రయాణంలో ఆఖరి మెట్టు ఏమిటి? నిన్ను లేకుండా చేసుకోవడం. అదే ఆఖరి మెట్టు. అలాంటి వాళ్ళు ఉపయోగం ఇది. సాధక శ్రేష్ఠులకు, తత్వ జిజ్ఞాసులకు మాత్రమే ఇది సరిగా అర్థం అవుతుంది. ఇన్ని ఉత్తమ లక్షణాలు వున్నవారందరికి కూడా ఇది చిట్టచివరి స్థితిని అందిస్తుంది. అంటే

మిగిలినవాళ్ళు చదువవద్దు అనా అర్థం? అలాంటి వాళ్ళకు చరమ గమ్యాన్ని అందించే సామర్థ్యం ఇందులో వుంది కాబట్టి, దీనిని అంత ఉత్తమంగా, అక్షర సత్యంగా నీవు భావించి స్వీకరించి, అదే జీవితంగా జీవించు.

వివేకచూడామణిని కూడా పక్కన పెట్టుకుంటే ఇందులో వచ్చిన వన్నీ అందులో చూసుకుంటూ వుంటే మీకు వెంటనే తెలుస్తూ వుంటుంది. ఏది ఎక్కడ వుందో. చూడండి విషయసూచికలో మొట్టమొదటి ఆత్మసాక్షిగా అందరిలో చదవండి ఎవరైనా.. దానిని బట్టి ఇందులో వెదుకుదాం, అక్కడున్నవిషయమే ఇక్కడ వివేకచూడామణిలో కూడా వుంటుంద. కాక పోతే ఇక్కడ మొట్టమొదట ఎత్తుకోవడమే ఎక్కడ ఎత్తుకున్నారండీ? ఆత్మ సాక్షిగా అందరిలో అనేది ఎత్తుకున్నారు. ఇక్కడికి వచ్చేప్పటికి అది ఎక్కడ ఎత్తుకుంటారు? చివరలో. కాబట్టి ఆ ముందు వున్నదంతా నీకు తెలిసి వుంటే, ఆత్మ యొక్క సాక్షిత్వాన్ని నిర్ణయించడానికి వీలౌతుంది. (చదవండి)

"ఆత్మ సాక్షిగా అందరిలో ... మహా పండితులు, విజ్ఞాని, రాజర్షి అయిన జనకుడు తన సందేహాలను, సమస్యలను ఆత్మ నిష్ఠుడైన అష్టావక్రుని ముందు వుంచి, తీర్చవలసినదిగా ప్రార్థిస్తున్నాడు."

భగవద్గీత దేనితో మొదలైంది? అర్జున విషాదయోగంతో మొదలైంది. ప్రశ్నలు ఎవరు వేశారు? అర్జునుడు గారు ప్రశ్నలు వేశారు. ఇక్కడ కూడా ప్రశ్నలు ఎవరు వేస్తున్నారు? జనక మహారాజుగారు వేస్తున్నారు. ఎవరిని? జనకమహారాజుగారి యొక్క లక్షణాన్ని చెప్తున్నారన్నమాట. చూడండి, ఏమున్నాయో జనకమహారాజు గారికి. మహా పండితుడు, విజ్ఞాని, రాజర్షి – అదిట అండి. Already జనక మహారాజుగారు మహా పండితుడు. అంటే శాస్త్రాధ్యయనం అంతాకూడా పూర్తి అయిపోయింది. ఇంకా ఎటువంటి వారు? విజ్ఞాని. కేవలం శాస్త్ర జ్ఞానం వరకూ ఆయన ఆగిపోలేదు. వాటిని నిజజీవితంలో ఆ జ్ఞానాన్ని ఆశ్రయించి అనుసరించి జీవించాడు. తద్వారా ఏమైంది? విజ్ఞాని అయ్యాడు. ఈ విజ్ఞానాన్ని మళ్ళా ఏమి చేశాడు? రాజర్షిగా మళ్ళా ఆ రాజర్షి అంటే ఏమిటి? కాబట్టి ఆయన కేవలం విజ్ఞానంతో ఆగలేదు. రాజర్షి అనేంత వరకూ వచ్చాడు. రాజర్షి అంటే? ఏమిటి తేడా? రాజర్షి అని, బ్రహ్మర్షి అని పేర్లు పెడుతున్నారు. వశిష్ఠ మహర్షి ఒక్కడే మనకు తెలిసినటువంటి, అందుబాటులో వున్నటువంటి బ్రహ్మర్షి. ఎందుకని అలా

చెప్పారు? ప్రతి మహాయుగంలో త్రేతా యుగంలో ఒక వశిష్ఠ మహర్షిగారు ఎప్పుడూ వుంటారు. సప్తమహర్షిలో వశిష్ఠ మహర్షిగారు వున్నారు కదా ! వున్నారా? లేరా? చూడండి. మరి ఆయన ఎప్పుడూ వుంటారు కదా! మరి ఎప్పుడూ వుండే ఆయన ఎలాగ? అంటే ఆ కార్య నిమిత్తం అశరీరులు అయినవారు మళ్ళీ శరీరం ధరించి వస్తారు. వీళ్ళు ఎప్పుడూ అశరీరులే. అట్టి అశరీర స్థితి నుంచి మళ్ళా కార్యక్రమం అవసరమైనప్పుడు కాసేపు సశరీరులుగా వస్తారు.

దీంట్లో కూడా శంకర భగవత్పాదులు గురువుగారి దగ్గరకు వెళ్ళారు. ఎక్కడికి బదరికావనం అంటే బ్రహ్మకపాలం బద్రీనాథ్. వెళ్ళి గుహ ముందు నిలబడి ప్రార్థించారు. గురువుగారు లోపల గోవిందపాదాచార్యులు ప్రకాశ రూపంలో వున్నారు. ఇప్పుడు సశరీరులా? అశరీరులా? ఆ గుహలో ఏమీ విలువ లేదండి. మామూలుగా ఏం వెలుగు లేదు. కానీ గుహ అంతా కాంతి వంతంగా వుంది. ఇప్పుడు గురువుగారు ఎలా వున్నారు అక్కడ. ప్రకాశ రూపంగా వున్నారు. సశరీరంగా వారికి దర్శనం ఇచ్చారు. ఇచ్చి బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాశారు. అక్కడే వుండి వారు బ్రహ్మసూత్రాలకి భాష్యం వ్రాశారు. కాబట్టి భారతదేశం గొప్పతనం ఏమిటంటే ఇక్కడే తెలిసేది. అనేక మంది మహానుభావులు అశరీర పద్ధతిగా భారతదేశంలో వున్నారు. ఇక్కడా అక్కడా అని చెప్పడానికి ఏమీ లేదు. చాలా మంది హిమాలయాల్లో వున్నారు. వారు దేశంలో అన్ని చోట్లా వున్నారు. మన పక్కన కూడా అశరీరంగా చాలా మంది వున్నారు. మరిప్పుడు ఈ మహానుభావులందరూ నడిచినటువంటి భూమి కాబట్టి భారతదేశంలో (పుట్టడం) జన్మించడమే మహద్భాగ్యం.  అర్థమైందా అండీ! అయితే ఈ సత్యాన్ని మనం నిత్య జీవితంలో మరచిపోయాం. వారితో మనకు పనిలేకుండా, మన శరీరాన్ని సరిగ్గా చూసుకోవడంతోనే జీవితం ముగిసి పోతుంది. ఎంతసేపూ ఈ జానా బెత్తెడు శరీరం సుఖంగా వుందా లేదా? అని చూసుకోవడంతోనే సరిపోతుంది.

కాబట్టి ఆయన రాజర్షి అని ఎందుకు చెప్పారయ్యా అని అంటే, మరి రాజ్య కార్యకలాపాలలో మునిగి వున్నప్పటికీ కూడా ఆయనకు ఏం చెడిపోలేదటా? ఋషిత్వం. నాన్ ఋషిః కురుతే కావ్యం. ఏదైనా ఒక కావ్యం రచించాలి అనంటే ఋషిత్వం వుండాలంట. అంటే ఆ తపఃశక్తి వుండాలి. ఆ ధీ శక్తి వుండాలి. ఆ విజ్ఞానం, అనంత సృష్టికి

సంబంధించినటువంటి విజ్ఞానం అంతా కూడా అతనిలో వున్నప్పటికీ, అతని దైనందిన దినచర్యలో ఎక్కడా కూడా, అతను చేసే కర్తవ్యం చేత అతను ప్రభావితం కాకుండా ఎవరైతే వున్నారో అతడు రాజర్షి అని అర్థం అన్నమాట. అలాగే కర్త లేకుండా వుండేటటువంటి స్థితిలో వున్నవారికి కూడా సందేహాలు అడుగుతున్నారు. చూడండి. ఆయన ఎటువంటి వాడట? చేసే పని యొక్క ప్రభావం ఆయన మీద లేదు. కారణం ఏమిటట? నేను చేయడం లేదు. ఆయన సిద్ధాంతం ఏమిటి? రాజుగా పరిపాలన చేస్తున్నప్పటికీ కూడా కార్యభారం అంతా నిర్వహిస్తున్నప్పటికీ కూడా అందులో ఎక్కడా కూడా నేను చేయడం లేదు. ఎవరు చేస్తున్నారు మరి? ఇదంతా సృష్టిలో భాగం. పరమాత్మలో భాగం. కాబట్టి చేస్తే ఎవరు చేయాలి? ఆయనే చేయాలి. అంతే కదా! మధ్యలో నేను ఎవరిని? నేనేమి ప్రత్యేకంగా చేస్తున్నది ఏమీ లేదు. నేను ప్రత్యేకంగా లేను. నాకు ఉనికి ఎక్కడ వున్నది? పరమాత్మకి వరప్రసాదంగా నాకు ఉనికి లేదు. అంటే ఆయన ఎందులో ఇచ్చాడు నాకు ఉనికి? ఆయన యందే నాకు ఉనికి వున్నది. ఎందుకని? సర్వులకు ఉనికి ఆయనే అయివున్నాడు. నేను వున్నాను అనేటటువంటి ఆ వునికి ఎందులో భాగం అయివున్నది? పరమాత్మ యందే భాగం అయివున్నది. కాబట్టి పరమాత్మకు ఆ ఉనికి ఇవ్వగలిగిన శక్తి వున్నది కాబట్టే ఈ సృష్టి అంతా నిలబడుతుంది. పరమాత్మ ఈ సృష్టికి ఒకటే శక్తిని ఇచ్చాడు. ఏమిటట? ఉండడం అనేటటువంటి శక్తి. మరి అట్టి పరమాత్మ తయారు చేసినటువంటి ఈ అనంత సృష్టి కూడా, పరమాత్మ లక్షణంతోనే నాకు కనపడుతుంది. నాకు ఏం కనపడుతోందండి? పరమాత్మ లక్షణంతోనే కనపడుతుంది. కాబట్టి నేను చేస్తున్నది ఏమీ లేదు. నేనేమీ చేయడం లేదు. అనేటటువంటి అతడు అకర్త. అకర్తృత్వభావంతో చేస్తున్నటువంటి వాళ్ళు, అంటే కర్తవ్యం ప్రభావం అతని మీద లేదన్నమాట. వాళ్ళందరినీ ఏమన్నారండీ? రాజర్షులు.

అలాంటి ఆయన రెండు మూడు ప్రశ్నలు వేశాడు ఇప్పుడు అక్కడ. ఏమి వేశాడు? అక్కడ ఏదో రెండు ప్రశ్నలు వేశాడు చూడండి. "తన సందేహాలను, సమస్యలను ఆత్మ నిష్ఠుడైన అష్టావక్ర మునీంద్రుని ముందుంచి తీర్చవలసినదిగా ప్రార్థిస్తున్నాడు. భగవంతుడన్నా, సత్యమన్నా, ఆత్మ అన్నా ఏ పేరుతో పిలిచినా వున్నది ఒకే ఒక సత్యం. అదే ఇంద్రజాల సమానమైన తన మాయాకల్పిత జ్ఞానంలో, తానే చిక్కుకున్నట్లు దేహ

మనో బుద్ధులతో కూడిన జీవిగా, తాను చూస్తున్నాను అనుకునే ప్రపంచంలో వ్యవహరిస్తున్నట్లుగా మనస్సుతో భావిస్తున్నది, తనతో అసంఖ్యాకమైన రాగద్వేషాలను, నిశ్చయనిశ్చయాలను, ఆశానిరాశలను అనుభవిస్తూ తనదైన ప్రపంచంలో మానసిక అనుభవం పొందుతూ వున్నట్లుగా జీవుడు భావిస్తున్నాడు. ఈ కర్తృత్వ భావన కారణంగా తత్ఫలితమైన జన్మకర్మ చక్రంలో భ్రమిస్తున్నట్లుగా భ్రమపడుతున్నాడు. ఈ బాధలలో వుండిపోకుండా బయటపడడానికి తనకు, జగత్తుకు సృష్టి కర్త అయిన జగదీశ్వరుడిని ప్రార్థించాలనే కోరికతో ఏకాగ్రత పెరుగుతున్నది. ఈ ఏకాగ్రత, ఈ భావనాబలం తన పరిస్థితులను అనుకూలంగా మార్చి, సరైన మార్గాన్ని చూపి సత్యమైన జ్ఞానాన్ని అందిస్తుంది. ఏ బుద్ధితో తానుగా, జగత్తుగా, జగదీశ్వరుడిగా భావిస్తూ, భ్రమపడుతూ భ్రమిస్తున్నాడో అదే బుద్ధితో ఉన్నది ఒకే ఒక సత్యమని, అదే తానని, కనిపిస్తున్నటువంటిది అంతా భ్రమయని తెలుసుకోవడంతో భ్రమాజన్య భావనా చక్రంలో భ్రమణం సమాప్తమౌతున్నది. అజ్ఞానం నశించి, జ్ఞానం మిగిలిపోతున్నది. తిమిరం పోయింది. తేజస్సు మిగిలింది. జ్ఞానజ్యోతి నిశ్చలంగా, ఏకంగా, అద్వితీయంగా, తానుగా ప్రకాశిస్తున్నది నిత్యంగా".

ఏమన్నాడు? ఎలా చెప్పాడు? వివేకచూడామణి సారాంశం అంతా రెండు లైన్లలో చెప్పేశారా? అక్కడ 500 పేజీలలో చెప్పినటువంటి వివేకచూడమణిని, జనకమహారాజు, ఇదంతా ఎవరు చెప్తున్నారు ఇది? జనకమహారాజుగారు చెబుతున్నాడు. ఏమని చెబుతున్నాడు? మనస్సు, బుద్ధి అల్లినటువంటి తనకు తానే సాలెగూడు ఎట్లా అయితే అల్లిందో, అట్లా మనోబుద్ధులచేత కల్పించబడినటువంటి, ఎవరయ్యా? జీవుడు. ఈ మనస్సు బుద్ధి వల్లనే నువ్వు జీవుడవయినావు. ఈ జీవుడవు అవడానికి నీకు ప్రధానమైన సమస్య ఏమిటట? నేను పుట్టాను అనే బలమైనటువంటి జ్ఞానం నీలో వుందా లేదా ఇప్పుడు? మీరు పుట్టారా? పుట్టలేదా? పుట్టాను. పెరిగారా? పెరగలేదా? పెరిగాము. మళ్ళా నశిస్తారా? నశించరా? నశిస్తాము. ఈ భ్రమాకల్పిత జ్ఞానం అన్నమాట ఇది. నేను పుట్టాను, నేను పెరిగాను, నేను పోతాను అనేటటువంటిది ఏదైతే వున్నదో, ఈ జన్మ చక్రం, కర్మ చక్రం ఈ రెండు చక్రాలు కూడా ఎందులో సృజించబడుతున్నాయట? ఈ మనోబుద్ధుల కల్పనలోనే సృజించబడుతున్నాయట.

అందువల్ల ఏమైపోయావు? నీవు వేరే, నీవు చూస్తున్నటువంటి జగత్తు వేరే. ఈ జగత్తుకు ఈశ్వరుడు కూడా వున్నాడు. ఇంకొకడిని కూడా పెట్టాడు. ఏమైందండీ? ముగ్గురు అయ్యారు. ఉన్న ఒకే ఒక్కడు జగత్తు, జీవుడు, ఈశ్వరుడు. జగత్ జీవేశ్వర భ్రాంతి కలిగింది. ఇందులో మొదటి భ్రాంతి ఏమిటి అసలు? అంటే, ఈశ్వరుడికంటే తాను వేరని, ఈశ్వరుడికంటే జీవుడు వేరేనని తలంపు కలగటమే మొదటి భ్రాంతి. ఆ భ్రాంతి దృష్టితో సృష్టిని చూచాడు. అప్పడు ఏమయ్యింది? అది ఇంకో ముక్క అయిపోయింది. అర్థమైందా అండి? కాబట్టి ఈశ్వరుడి కంటే తాను వేరు అనేటటువంటి భ్రాంతిని కనుక తెగ్గొట్టినట్లయితే ఏమైంది? ఈ జగత్తు, ఆ జీవుడు ఈ రెండూ ఎగిరిపోయినాయి ఒకేసారి. ఎగిరిపోయి ఏమి మిగిలిపోయింది? ఈశ్వరుడు మిగిలిపోయాడు. కాబట్టి నీవు నిత్యం జీవించేటప్పుడు, ఈ జగత్ జీవేశ్వర భ్రాంతిలో, ఏ భ్రాంతి దృష్టినుంచి మనం చూస్తున్నాము? మనం ప్రతి నిర్ణయము, ప్రతి ఆలోచన చేసేటప్పుడు, జగత్ దృష్ట్యా చూస్తున్నామా? ఈశ్వర దృష్టితో చూస్తున్నామా? జీవుడి దృష్టితో చూస్తున్నామా? ఈ మూడు దృష్టులు మనలో వున్నాయా? లేవా? ఈశ్వర దృష్టితో నిర్ణయం చేశామండి. అప్పుడు ఏదన్నా ఒక్కటి చెప్పండి చూద్దాం, అలా ప్రస్తుతం చేస్తున్నటువంటి, కర్తృత్వభావంతో చేస్తున్నటువంటివి ఏదైతే వున్నాయో, వీటిలో ఈ మూడు వున్నాయా లేవా? వున్నాయి కదా!

ఉదాహరణ చూద్దాము. వినాయక చవితి చేయాలా వద్దా? చెయ్యాలి. చెయ్యాలా అండీ? ఎందుకు చేయాలి? చేయకపోతే ఇప్పుడు వచ్చిన నష్టం ఏమిటట? ఎప్పుడైనా ఇలా అనుకున్నారా? అనుకోలేదుగా. పెద్దవాళ్ళు చేయమన్నారు, చేశారు అంతే. ప్రశ్నించుకునే విధానం మన దగ్గర లేదు. ఎందుకు చేయాలి అసలు? అని ప్రశ్నిస్తే నీకు స్థిరత్వం వచ్చిందా? ఏ స్థిరత్వం లేకుండా గుడ్డిగా చేసుకుంటూపోతే వచ్చిందా? ఇంతకాలం ఎన్ని వినాయక చవితిలు చేసి వుంటారు? లెక్కలేదుగా. మొన్న ఈ మధ్యే మీరంతా కూడా చేసినది ఏమిటి? వరలక్ష్మీ వ్రతం కూడా చేసేసి వుంటారు. ఎందుకు? ఇవన్నీ కూడా ఎక్కడి నుంచి మొదలయినాయి? జీవేశ్వర భేదం చేత. ఈశ్వరుడు వేరే, జీవుడు వేరే అనే భావం చేత, ఈశ్వర స్థితిని నేను పొందాలి అంతేనా? కాదా? మరి ఆ సగుణ భక్తితోటి, ఈ ఈశ్వర ఆరాధన అనే ఒకే ఒక్క సూత్రం వుందన్నమాట. అంతేనా

కాదా? నీవే ఈశ్వరుడవు అని తెలుసుకోవడమనే ప్రధాన లక్ష్యంతో చేస్తే ఇన్ని సార్లు చేయవలసిన పని వుందా? ఈ పద్ధతిగా చేయవలసిన పని వుందా? ఇప్పుడు ఏ పద్ధతిలో చేస్తున్నాము? జగత్తు దృష్ట్యా, జీవుడి దృష్ట్యా, భ్రాంతిగత దృష్టితో బాలుడిగా వున్నప్పుడు, నువ్వు అవగాహన చేసుకోలేక పోయినప్పుడు నువ్వు ఎలా వున్నావో, నిన్ను నువ్వు అర్థం చేసుకునేంత తెలివి అప్పుడు లేదు నీకు. కాబట్టి నీకు బాల్యంలో నీ పెద్దవాళ్ళు ఇలా చెప్పారు. దీన్ని అర్థం చేసుకోవడం కోసం చెప్పారు. నిన్ను నువ్వు తెలుసుకోవడం కోసం చెప్పారు. కానీ నువ్వు వృద్ధాప్యం వచ్చినా కూడా ఎలా చేస్తున్నావు? కాబట్టి ఇప్పుడు చేయవలసిన పద్ధతి వేరుగా వుంది. ఎలా వుందట? నేను ఈశ్వరుడిని అనే స్థితిలో వుండాలి నువ్వు. జీవుడు, జగత్తు తొలగిపోయి నేను ఈశ్వరుడను అనే స్థితిలో నిలచివుంటే, అప్పుడు నిన్ను ఏమి విడిచిపెట్టింది? అంటే, కర్తృత్వం నిన్ను విడిచి పెట్టింది. నీవు ఈశ్వరుడిగా వుండనంత వరకూ, నిన్ను నీ కర్తృత్వం విడిచిపెట్టదు. కర్తృత్వం అనే భావన నీకు వున్నంత వరకూ నీవు పుట్టక తప్పదు. జనన మరణ చక్రాలలో చిక్కుకొనక తప్పదు. అర్థమైందా? అని స్పష్టంగా చెబుతున్నాడు. చూడండి అక్కడ చెబుతున్నాడా లేదా? కర్తృత్వ భావం చేత, జనన మరణ చక్రంలో చిక్కుకున్నావు. ఇప్పుడు నువ్వు ఏం చేయాలట? ఈశ్వరుడికి జననమరణాలు వున్నాయా? ఎందుకని లేవు? దేనికీ కర్త కాదు కాబట్టి. నేనుని అనుభవించడం లేదు కాబట్టి. అవునా కాదా? అని ఎలా నిర్ణయం చేశావు మరి? ఎలా తెలుసు నీకు? అంటే దేవాలయాల్లో ఒక విగ్రహం పెట్టావండి. ఆ విగ్రహం దేనికైనా బాధ్యత వహిస్తుందా? ఏమన్నా స్వీకరించిందా? పోనీ ఏమన్నా నిరాకరించిందా? స్వీకరించనూ లేదు, నిరాకరించనూ లేదు. కాబట్టి అటువంటి సాక్షిత్వభావం, అచల భావంతో కదలనటువంటి పద్ధతిలో ఒక విధానాన్ని మనం ఏర్పాటు చేసుకోవాలి. అయితే దాని నుంచి ఏ లక్షణాన్ని నిశ్చల మనోబుద్ధులు కలిగి వుండాలో, సొంతం కలిగివుండాలో జీవేశ్వర ఐక్య ప్రతిపాదనలో జీవుడు, ఈశ్వరుడు ఇద్దరూ వుండాలా వద్దా? కానీ వున్నదే ఈశ్వరుడు అయినప్పుడు ఐక్యం చెందేవారు ఎవరు? వున్నాయా అసలు? లేవు అని అంటున్నావు. కానీ ఆచరించేటప్పుడు మాత్రం...లేదు. సిద్ధాంతంగా ఒప్పుకున్నాం కానీ, ఆచరణలో అలా లేము. అలా లేకపోవడము చేత, వివేక శూన్యత ఏర్పడి, నీవు ఈశ్వరుడికంటే భిన్నం అనే భావన చేత

జగత్ భ్రమలో పడిపోతున్నావు. కాబట్టి జగత్ భ్రమ పోవాలి అంటే, నీవు జగత్తు వైపు వెళితే అది పోదు. ఏం చేయాలి? ఈశ్వర లక్షణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తూ, ఈశ్వర లక్షణాలతో జీవిస్తూ, వివేకం కలిగి వున్నట్లయితే, ఆ జీవితానుభవం ద్వారా నేను ఈశ్వరుడిని అనే నిర్ణయం స్థిరపడుతుంది. ఆ లక్షణాలతో జీవించే కొద్దీ, నేను ఈశ్వరుడని అనే భావం స్థిరపడి, అప్పుడు ఏమైంది? భావ ప్రభావం చేత ఏర్పడినటువంటి, ఈ జగత్ భ్రమ, ఆ జీవుడు ఇద్దరూ ఒకే సారి తొలగిపోతున్నారు. ఒకేసారి తొలగిపోవాలట. అంటే అర్థం ఏమిటి? జీవుడు వుండి, జగత్ భ్రాంతి తొలగిపోవాలంటే సాధ్యం కాదు. జీవుడు వున్నంత కాలం, జగత్ భ్రాంతి వుండక తప్పదు. కాబట్టి ఏం చేయాలట? ఈ రెండూ ఒకేసారి లేకుండా చేయాలి. మనం ఇప్పటి వరకూ ఆరాధన చేసేటప్పుడు అలాంటి పద్ధతిలో చేశామా? చేయడం లేదుగా. నువ్వు జీవుడిగానే వుంటున్నావు, ఆ జగత్తులో దొరికేటటువంటి ఉత్తమమైనటువంటి వస్తువులన్నీ ఈశ్వరారాధనకు వినియోగించాను అంటున్నావు. ఇప్పుడు ఈ వస్తువులలో ఏం గమనించావు? ఈశ్వరుడినే గమనించావా? గమనించలేదు. వస్తువులను వస్తువులుగానే చూశావు. భోగ్య వస్తువుగా చూశావు. వీటిని పైగా ఎలా చూశావు? జీవుడికి ఈ ప్రపంచం అంతా ఎలా కనపడిందటా? భోగ్యవస్తువుగా కనపడింది. అంటే అనుభవించడానికి తగిన వస్తువుగా కనపడుతోంది జీవుడికి. నీకు ఏమి అధికారం వుంది? వుందా? నీవు సృష్టించావా? నీవు పోషించావా? నీవు దేనికైనా కారణమా? కాదుకదా! ఈశ్వరుడు కారణంగా అనంత సృష్టి సృజించబడింది. ఆయన కర్తగా ఈ కార్యం, ఈ సృష్టికార్యం నిర్వహించబడుతోంది. మధ్యలో నీకు ఏం అధికారం వుందని, ఈ కాస్తా ఈ 1000 గజాలు నాది, ఈ 200 గజాలు నాది, ఈ 6 గజాలు నాది చివరికి స్మశానంలో స్థలం కూడా మనం reservation అన్నమాట. ముందే reservation చేసుకోకపోతే స్మశానంలో స్థలం కూడా లేదు. మరి ఇప్పుడు మనం ఎక్కడి దాకా వచ్చేశాము? అంటే జగత్ భ్రాంతి, ఇలా రావడానికి కారణం ఏమిటి? అంటే, జగత్ భ్రాంతి. ఈ ఆరు జతలు నావి, అది అనంత సృష్టిలో భాగం కాదా?

యశోదమ్మకి గోపికలు complaint ఏమని చేశారు? విజ్ఞాపన చేశారు. ఏంటంటే? మీ పిల్లవాడు మా ఇళ్ళకు వచ్చి, ఆవుల యొక్క దూడలని, మేము పాలు

పిండుకోక ముందే వదిలిపెట్టేస్తున్నాడు. దాని వల్ల మా ఇంట్లో పిల్లలకు పాలు వుండటం లేదు. మా కోడలు గారికి ఆరోగ్యం సరిగా లేకపోవడం చేత, ఆమెకు పుట్టినటువంటి మా మనవడికి పాలు ఆవిడ ఇవ్వలేని పరిస్థితిలో వున్నందువల్ల, ఈ ఆవుపాలు పడుతున్నాం. మీ పిల్లవాడు వచ్చి ఆ దూడను విడిచిపెట్టడం వల్ల పాలు లేకుండా పోయినాయి. కాబట్టి మా పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. మీ పిల్లవాడు ఇబ్బంది పెడుతున్నాడు. కృష్ణుడు ఏమన్నాడు? ఆవు యొక్క స్థన్యం మొదటి అధికారం ఎవరికి? (దూడకి) నువ్వు ఏం చేస్తున్నావు? అది కనపడేట్టుగా కట్టేస్తావు. అర్థమైందా అండీ? ఆ తల్లికి ఈ బిడ్డ కనపడేటట్టుగా కట్టేశావు. తెలివైన వాడన్నమాట. కట్టేసి ఆ తల్లి ఆ పిల్లవాడిని పోషించాలనే దృష్టి వల్ల అది పాలు ఇస్తుంది. ఆ బిడ్డను తీసేయి. ఇంక అది పాలు ఇవ్వదు. ఇప్పుడు మనం వేరే వేరేగా అనుకున్నాం. ఎలాగైనా సరే మనకు పాలు తీసుకోవడం అలవాటు అయిపోయింది. మిషన్‌లు పెట్టి కాని ఎలాగైనా తీసుకోవచ్చు. ఆ రకమైనటు వంటి ప్రేరణ వచ్చేటటువంటి ఇంజెక్షన్లు ఇచ్చి కూడా మనం పాలు తీస్తున్నాము. అంటే మానవుడు ఎట్లా అయితే క్రమేణా దిగజారిపోతున్నాడో తెలుసుకోవడం కోసం చెబుతున్నారు. ఆ నాటి యుగంలో, ఆ కాలంలో కృష్ణుడు చేసింది సబబే. ఈ నాటి కాలంలో మనం ఏం చేస్తున్నాము? ఇప్పడు దూడలతో మనకు పనిలేదు. దూడలు అసలు మొదటి సంవత్సరం లోపలే చనిపోతున్నాయి. ఎప్పటికప్పుడు ఏవి అవసరమో వాటిని మాత్రమే వుంచడం, మిగిలినవాటిని విసర్జించడం. అంటే పూర్తి వ్యాపారాత్మకంగా మారిపోయింది. మరిప్పుడు మనల్ని ఏమి అర్థం చేసుకోమంటున్నారు? అసలు సృష్టిలోనే నీకు ఏమీ భాగం లేదయ్యా. ఆ స్థాయిలో మాట్లాడుతున్నారు.

నువ్వు సృష్టిలో ఒకానొక అంశవి. ఆ పరమాత్మలో ఒకానొక అంశవి. అయితే పరమాత్మలో అంశగా వుండడం, లేకపోతే పరమాత్మలోనే లేకుండా పోవడం. నువ్వు లేకుండా పోయినా ఎక్కడ లేకుండా పోయావు? అట్టి పరమాత్మయందే లేకుండా పోయావు మళ్ళా. ఒక వేళ వున్నాను అన్నావనుకో, ఎక్కడున్నావు? ఆ పరమాత్మయందే వున్నావు. లేకుండా – అందులో కూడా చూడండి. లేక + ఉండడం. ఇప్పుడు ఎక్కడ ఉన్నారండీ? లేనే లేడు. లేకుండా పోయాడు. లేక వుండా పోయాడు. ఇక్కడ కూడా

చెబుతున్నావు. అంటే ఎప్పుడూ వుండేవాడు ఒకడు వున్నాడు. వాడిలోనే కాసేపు వుండడం, కాసేపు లేకపోవడం అనే రెండూ కూడా జరుగుతూ వున్నాయి. అర్థమైందా? ఇప్పడు వుండే పరమేశ్వరుడు ఎప్పుడూ వున్నాడు. వాడిలో ఏమి జరుగుతుందట? కాసేపు జగత్తు వచ్చింది, కొంతకాలం వుంది, తర్వాత లేదు. ఆ జగత్తులో భాగంగా జీవరాశులు అన్నీ వచ్చినాయి. ఇవికూడా కొంతకాలం వున్నాయి. తరువాత కొంతకాలం లేవు. మరలా కొంతకాలం తరువాత మళ్ళా ఉత్పన్నం అవుతాయి. కాల ప్రభావం చేత, ఉత్పన్నం అయ్యింది ఈ సృష్టి. మరల అదే కాలంలో కొంత కాలం అయ్యేటప్పటికి లేకుండా పోయింది. మరి ఎప్పుడూ వుండే వాడు వున్నాడా లేడా? వాడు ఎప్పుడూ వున్నాడు. వాడికి ఏ భేదమైనా వుందా? ఏ మార్పు అయినా వుందా? (లేదు). మరి నీవిప్పుడు ఎవరిమీద అయితే ఆధారపడి సృష్టించబడుతున్నావో, ఎవరిమీద ఆధారపడి నీ పరిణామం అంతా జరుగుతూ వుందో, ఎవరిలో నీవు లయించి పోతున్నావో, అట్టి సర్వాధారుడిని తెలుసుకునే ప్రయత్నం, సర్వాధారుడి యొక్క లక్షణాలే నీకు వున్నాయా? లేవా? అని విచారణ చేసుకోవాల్సిన అగత్యం వుందా లేదా? వుంది కదా! మరి మనం జీవితంలో ఇప్పటి వరకూ ఒక యాభై ఏళ్ళు, అరవై ఏళ్ళు గతించిందా? గతించలేదా? ఇప్పుడు ఏ స్థితికి వచ్చాం? కాళ్ళు, చేతులు, వెన్ను నిలపలేని స్థితికి వచ్చాము. వచ్చామా లేదా? ఈ పద్ధతిని ఎప్పుడైనా గుర్తించామా? గుర్తించక పోవడం వల్ల ఏమైంది నష్టం? సాలె పురుగు వలె మన చుట్టూ మనమే గూడు అల్లుకుని ఆ గూడు లోనే ఆహారం లభిస్తే తిని, ఆ ఆహారంతో సంతృప్తి చెంది, అక్కడే ఆ గూడు లోనే మరలా శరీరాన్ని విడిచి పెట్టేస్తున్నాము. కాబట్టి ఇలాంటి మనో బుద్ధులచేత కల్పించబడినటువంటి జగత్ జీవేశ్వర భ్రాంతి అనేటటువంటి దాంట్లో చిక్కుకోవద్దు. ఇవి రెండూ నీ మనో బుద్ధుల యొక్క కల్పితాలు. యథార్థ దృష్టితో చూస్తే, ఎప్పుడూ వున్నవాడు ఎప్పుడూ వున్నాడు. మధ్యలో వచ్చిపోయేవి, వస్తున్నది, పోతున్నది. అర్థమైందా అండీ?

అచల సిద్ధాంతం కూడా ఇదేగా చెబుతున్నది, ఎప్పుడూ వున్నది చట్టువలె అలాగే కదలక వున్నది. మధ్యలో వచ్చిపోయే ఎఱుక కొంత కాలం వున్నది, తరువాత కొంతకాలం తర్వాత లేకుండా పోయింది. ఈ అనంత విశ్వమూ కూడా అదే. అందులో భాగమే నువ్వు కూడా. మరి ఇప్పుడు మనం కాదనగలమా? కాదనలేకపోతున్నాం కదా!

ఈ భూమండలం మీద నువ్వు ఒక్కడివేనా నవుడివి? ఇలాంటి భూమండలాలు అనంత సృష్టిలో ఎన్ని వున్నాయి? నీకు నాకు లెక్క తెలియదు. తెలియదు కాబట్టి లేదు అనవచ్చా? అనలేవుగా. ఈశ్వరుడు ఒక్కడే సూర్యుడా? అని ప్రశ్నిస్తున్నాడు. అంటే ఏమన్నారు? అన్ని నక్షత్రాలు సూర్యుడులే. మరి అన్ని నక్షత్రాలు సూర్యుడులే అయినప్పుడు మన కళ్ళకు కనబడుతున్న నక్షత్రాలే ఎన్ని వున్నాయి? లెక్కపెట్ట లేని అన్ని వున్నాయి. మరి ఇన్న లెక్కపెట్టలేనన్నవాటికి సౌర కుటుంబాలు వున్నాయా? లేవా? నీకు ఎలా తెలుసు? ఎందుకనిట? ఈ భూమండలం మీద వున్నటువంటి దాంట్లోనే, నీకు పరిమితమైన జ్ఞానం వుంది. అంతేనా కాదా? 84 లక్షల జీవరాశులు ఈ భూమి మీద వుంటే, భూమండలం మీద మనకు ఎన్ని జీవరాశులు తెలుసు? మనం తెలుసుకునే ప్రయత్నం చేశామా? లేదుగా. గుప్పెడు మానవులు చాలండీ, మన తగాదాలకీనూ మన సుఖాలకి. అంతేనా కాదా? ఒక పది మంది తెలుసేమో మహా అయితే జీవితం మొత్తం మీద. ఆ 10 మందితో మన జీవితం ముగిసిపోతుంది. మరిప్పుడు మనకి ఏం బాగా తెలుసు? ఇప్పుడు మనం ఎవరితో పోటీ పడుతున్నాము? సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, సర్వ కర్త, సర్వ భోక్త, సర్వ హర్త, ఏ కాలంలోనూ చలించనటువంటి వాడు, ఎల్లప్పుడూ వున్నటువంటి వాడు, అట్టి ఈశ్వరునితో మన పోటీ అన్నమాట. ఇప్పుడు మనమేమి అంటున్నాము? ఈశ్వరుడు లేడు అని చెప్పగలవా ఎవరన్నా? ఎలా? అక్కడిదాకా వచ్చేశామన్నమాట మనం. ఎందుకని? వుంటే నాకు ఏమిటండీ ప్రయోజనం? అంటే ప్రయోజనం దృష్ట్యా నిర్ణయించేటటువంటి పద్ధతిలోకి మనం మారిపోయాము. కర్తృత్వము, భోక్తృత్వము వలన ఏమి జరిగినది అంటే, ప్రయోజనము దృష్ట్యా నిర్ణయించడము.

ఇల్లు వుందా లేదా? వుంది. ఎలా చెప్తున్నావు? దాని వల్ల నాకు ప్రయోజనము వుందికాబట్టి. ప్రయోజనము లేకపోతే నాకెందుకు దాని సంగతి? అంటున్నావా లేదా? కాబట్టి జగత్ భ్రాంతి అంటే ఏమిటయ్యా? అంటే, ఫలితము దృష్ట్యా నిర్ణయించడమే జగత్ భ్రాంతి. జగత్ భ్రాంతి అంటే ఏమిటి? ఫలితము దృష్ట్యా నిర్ణయించడమే జగత్ భ్రాంతి. ఫలితము అంటే ఇప్పుడు ఎక్కడ వుంది? కారణ స్థితిలో వుందా? లేదు. కార్య స్థితిలో కూడా చిట్టచివరి భాగం. కాబట్టి జనన మరణాలచేత నీవు బాధించబడుతున్నావు. ఈ ఫలితం దృష్ట్యా నిర్ణయించేటటువంటి లక్షణం నీలో వున్నంత వరకూ, నీవు జనన

మరణాల చేత బాధించబడక తప్పదు. ఈ జగత్ భ్రాంతి విడవాలి అనంటే, జీవజగత్తులు రెండూ విడిచిపెట్టినప్పుడు మాత్రమే సాధ్యమౌతుంది. కాబట్టి వీటి మూలమైనటువంటి ఈశ్వరుడిని ఆశ్రయించి, నేను ఈశ్వరుడిని అనే భావంలో కనుక నీవు వుండినట్లయితే, ఏమైందంటే నీ జీవజగత్ భ్రాంతులు రెండూ ఒకేసారి విడిచిపెట్టేశాయి. అప్పుడు ఈశ్వర కార్యంలో కారణం ఎవరు? ఈశ్వరుడు. ఈ సృష్టికి కారణంగా ఈశ్వరుడు వున్నాడు. ఈ సృష్టి అంతా కార్యంగా కనుక భావించినట్లయితే, ఈ కార్యం మొత్తము కారణం మీద ఆధారపడి వున్నది కాబట్టి, ఆ కారణమే నేనుగా నువ్వు ఎప్పుడైతే నిర్ణయించుకుని జీవిస్తావో, అప్పుడు నీలో ఆ ఈశ్వర లక్షణాలే నిలబడి వుంటాయి. జగత్తుకు సంబంధించిన లక్షణాలు కానీ, జీవుడికి సంబంధించిన లక్షణాలు కానీ లేకుండా పోయినాయి. అని వివేకచూడామణి నిర్ణయం చేసింది. అంతేనా కాదా?

ఈ వివేకచూడామణి చిట్టచివరి భాగం చూడండి. ఆ క్రింద అవి చదవండి. "నానాత్వ నిషేధము, ఆత్మానుభవ ఉపదేశము, శిష్యుని బోధనానుభవము, ఉపదేశము యొక్క ఉపసంహారము, అధిష్టాన నిరూపణము" ఈ సృష్టికి అధిష్టానము ఎవరు? ఈశ్వరుడు. ఆ నిరూపణము. "సమాధి నిరూపణము" – అది. నీవు ఈశ్వరుడవు అని భావించినప్పుడు ఏ స్థితిలో వున్నావు? నాకు ఈశ్వుడికి భేదం లేదండి. ఈశ్వరుడు అధిష్టానముగా ఈ సృష్టి వున్నదండి. మట్టితో తయారు చేయబడినటువంటి ఏ పాత్ర అయినా సరే, దాంట్లో ఏ లక్షణం వుండాలి? మట్టి లక్షణమే వుండాలి. ఈశ్వర నిర్మితమైనటువంటి సృష్టి అంతా ఏ లక్షణంతో వుంది? ఈశ్వర లక్షణంతో వున్నది. కాబట్టి నేను ఎవరను? నేను ఈశ్వరుడును. అది అధిష్టాన నిర్ణయములో నిలబడి వున్నావనుకోండి, అప్పుడు ఏమైంది? అదేనయ్యా 'సమాధి' అంటే. (కర్త, భోక్త లేడు) అదే సమాధి సమ+ధీ అంటే. కర్త చేత కాని, భోక్త చేత కాని ప్రభావితం కానటువంటి స్థితిలో వుండడమే సమాధి. సాధరణంగా మనకు సమాధి అంటే ఏమని బాగా తెలుసు? చనిపోయినాక భూగర్భంలో పాతి పెట్టడం కానీ, అర్థమైందా అండీ? లేదంటే జీవ చైతన్యం కలిగివుండి, నీవు ఒక విగ్రహము వలె కాళ్ళు చేతులు కట్టుకుని కూర్చోవడం గాని. అర్థమైందా అండీ! కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తూ అలా కూర్చొని వున్నటువంటి విగ్రహమే సమాధి అంటే మనకి సాధనలో తెలుస్తుంది. కానీ ఇక్కడ వివేకచూడామణిలో

ఏమి నిర్ణయం చెప్పారు? నీవు ఈశ్వరుడు అనే స్థితిలో వుండడమే. ఆ ఉండడం అనేది ఎలా వుండాలట? ఈశ్వరుడిగా వుండాలట. నీవు ఈశ్వరుడిగా సర్వకాల, సర్వావస్థలలోనూ ఉన్నట్లయితే అదే సమాధి. అర్థమైందా అండీ!

"వైరాగ్య నిరూపణము" అది. ఇప్పుడు ఎవరికి నిరూపణ? ఇప్పుడు వైరాగ్యం ఎవరిని చూసి నేర్చుకోవలట? ఎవడైతే సర్వకాల, సర్వావస్థలలో ఈశ్వరుడిగా వున్నాడో, వాడి జీవితం అంతా ఏమి పరుచుకుని వుంటుందట? వైరాగ్యమే వుంటుంది. అంటే ఏంటట వైరాగ్యమంటే? రాగద్వేషాదుల చేత బాధించబడకుండా వుండడం. అదే వైరాగ్యం. ఔనా కాదా? రాగద్వేషాదుల చేత బాధించబడకుండా వుండడం అంటే? (జీవత్వం లేకుండా వుండడం) శరీరమే నేనుగా వున్నప్పుడు ఈ జగత్తుకు సంబంధించిన వాటిలో కొన్ని వస్తువులను నీవిగా భావించి, ఆ కొన్ని వస్తువులు కనపడక పోతే, అలాగే కొంతకాలనికి నీ శరీరం కూడా లేకుండా పోతుంది కనుక మొదటి రాగద్వేషాలు దేనిమీద వున్నాయి? నీ మీదనే వున్నాయి. నీ శరీరం మీదే వున్నాయి. కొంతకాలం అయితే ఈ శరీరం కనపడదేమో అన్న దుఃఖం చేత ఈ తగాదా అంత. ఇప్పుడు నీ శరీరం కనపడక పోతే వచ్చిన గొప్ప మార్పు ఏమిటి? సృష్టిలో. ఏమన్నా వుందా? కొంతకాలం ఈ శరీరం కనపడిందండి, కొంతకాలం వుందండి, తరువాత కొంతకాలానికి ఈ శరీరం లేకుండా పోయిందండి. ఇప్పుడు వచ్చిన గొప్ప మార్పు ఏమిటట సృష్టిలో? ఏమీ లేదుగా. ఒక కుండ తయారైందండి. కొంతకాలం ఉపయోగించబడిందండి. తర్వాత పగలేశావండి. ఏం తేడా వచ్చింది మట్టిలో. ఏమన్నా తేడా వచ్చిందా మట్టిలో? మరి నీకెందుకు చింత? నేను పోతున్నాను అంటావు ఎందుకని? ప్రతివాడు ఏమంటున్నాడండి? నేను పోతున్నానా? నా ప్రాణం పోతుందా? రెండిటిలో ఏది కరెక్ట్? నా ప్రాణం పోతోంది రోయ్ అంటున్నావా? నేను పోతున్నాను అంటున్నావా? అక్కడ కూడా కరక్టే చెబుతున్నావు. నువ్వు పోవు ఎప్పటికి. పోతే ఏం పోతుంది. బోడి ప్రాణం వచ్చింది, పోతోంది. కొంత సేపు ఈ ఘటంలో కొట్టుకుందండి. అంతేనా? కొంతకాలం తరువాత ఘటం పగిలింది. ఆ ప్రాణం పోయింది. అంతేకదా! పోతే ఇప్పుడు ఏమైందట? ఇప్పుడు ఏమన్నా అయ్యిందా? పెనుమార్పు ఏమైనా వచ్చిందా? సృష్టి ఏమన్నా పునః సృష్టి మళ్ళా మహా ప్రళయం ఏమన్నా వచ్చిందా? ఏమీ రాలేదుగా. ఇప్పుడు నీ దుఃఖం

ఏమిటి? ఇప్పుడు నీ దుఃఖం ఎందుకు? చూడండి. ఈ దృష్టితో మనం దుఃఖించే అంశాలను చూడండి ఇప్పుడు. అసలు నిజంగా దుఃఖించవలసిన అంశాలేనా ఇవన్నీ? మా ఆయన లేవంగానే నాకు నమస్కారం పెట్టలేదు. లేదా మా అబ్బాయి వెళ్ళేటప్పుడు నాకు టాటా చెప్పలేదు. మా మనవడు ఆ స్కూల్ ఆటో ఎక్కేటప్పుడు బై చెప్పలేదు. ఏమిటి నీ దుఃఖానికి కారణం? అర్థముందా?

కాసేపు ఒక కుండ తయారైంది, కాసేపు ఉపయోగించ బడింది, కాసేపు పగల వేయబడింది అంతే! అంతేనా? అది కూడా సృష్టి ధర్మం. సృష్టి నియమం ప్రకారం జరిగిపోతూ వున్నది. ఎందుకని? 84 లక్షల జీవరాశుల దేహములు అవే. మరిప్పుడు నీకు ఏమిటి వచ్చింది నష్టం? ఏమి నష్టం రాలేదు. నీకు వున్న తెలివితేటలు మిగిలిన జీవరాశులకు లేవు. ఇది నువ్వు అర్థం చేసుకుని వుండాలి. అర్థం చేసుకున్నావు. నీ శరీరం పోయిందండి. ఇప్పుడు ఏమైంది? ఏమన్నా అయ్యిందా? ప్రమాదం ఏమన్నా వచ్చిందా? ఏమీ రాలేదుగా అనే దృష్టితో నీవు నీ జీవితాన్ని చూడు. ఈ దృష్టితో చూస్తే, శరీరంతో చేసే అన్ని పనులూ ఎలా కనపడ్డాయి? ఏమన్నా ప్రత్యేకత వుందా? ఈ శరీరానికి బాగా భూషణాలు ధరించావండి. ఆ భూషణములు ధరించావు. ఏమిటట ఇప్పుడు అయితే? ఏమన్నా పెరిగిందా విలువ? చూడండి మనవాళ్ళు అంతా కూడాను, చక్కగా పట్టు చీర కట్టుకుని, పైనుంచి క్రిందకు అలంకరించుకుని ఎవరైనా వచ్చారనుకోండి ఏమంటున్నావు? ఓహో ! మహాలక్ష్మిలాగా వుంది. అంటే ఇప్పుడు ఏం చేశావు? అక్కడ కూడా ఏం చేశావు చెప్పు? అంటే నీ ప్రత్యేకత అంతా కూడా, జీవుడికి ఈశ్వర లక్షణాన్ని ఆపాదించడమే నీ ప్రత్యేకత. అంతేనా ఇంకా ఏమన్నా వుందా? ఇప్పుడు నీవు ఎవరిని చూస్తున్నావు? ఆ శరీరాన్ని చూడడం లేదు. ఆ ఆభరణాన్ని చూడడం లేదు. అతనిలో ఆ తేజో ప్రభావం. అవన్నీ ధరించడం చేత, ఒక నూతనమైన తేజస్సు వచ్చింది అతనిలో. ఆ తేజో ప్రభావం చేత, ఆ తేజస్సు ఈశ్వర లక్షణం. ఆ తేజస్సుని గుర్తించగానే నువ్వు ఏమన్నావు? ఆహా! భగవంతుడల్లే ఏం వచ్చాడండీ? మరి అప్పుడు ఆయనలో ఆ కాపాడే లక్షణం ఏదైతే వుందో, ఆ దర్శనం ఇచ్చే లక్షణం ఏదైతే వుందో, ఆ తేజస్సు చేత ప్రభావితమై, నీవు ఆ ఈశ్వర లక్షణాన్ని గుర్తించి, అదే ప్రత్యేకంగా చెబుతున్నావు. అంతేనా కాదా?

నీకు ఆపరేషన్ చేశారండి డాక్టరు గారు. ఇప్పుడు ఏమంటున్నావు నువ్వు? నిన్ను ఆయుధాలు పెట్టి కోశాడా? కోయలేదా? ఎంత దుఃఖం వచ్చేటట్టే చేశాడండీ? కానీ ఆయనను ఏమంటున్నావు? దేవుడల్లే కాపాడావు అంటున్నావా? లేదా? మరిప్పుడు కాపాడింది ఎవరు? ఆ కాపాడడమనే ఈశ్వర లక్షణం. ఈ సుబ్బారావు గారు కాపాడింది. అర్థమైంది? అతనిలో వున్న ఆ దివ్యత్వం ఏమిటట? రక్షణ బాధ్యత. ఆ కాపాడే లక్షణం వున్నదే అది ఈశ్వర లక్షణం. ఇప్పుడు నీవు సమస్త జీవులలో దేనిని అన్వేషిస్తున్నావు? ఈ ఈశ్వర లక్షణాన్నే. అర్థమైందా అండీ! తల్లిని దైవంగా భావించు. ఎందుకు భావించాలి? ఈశ్వర లక్షణం. నీకు ఆధారం. నీ పోషక కర్త. నీవు ఏమీ చేసుకోలేని కాలంలో నీకు ఆధారంగా వున్నది కాబట్టి. ఆ ఆధారంగా వుండడమేనయ్యా ఈశ్వర లక్షణం. గురువును దైవంగా భావించు. తండ్రిని దైవంగా భావించు. మన భారత దేశంలో దైవం కానిది ఏది? ఒకటి చెప్పండి. చెట్టు, పుట్ట అన్నీ! కానీ పాము కనపడితే ప్రాణం తీస్తారు, పుట్టలోకి వెళ్ళి పాలు పోస్తారు ఎందుకని? అజ్ఞానం. వేరే ఏమీ లేదండి. ఇప్పుడు పుట్టని కొలుస్తున్నావా? పామును కొలుస్తున్నావా? అక్కడ కూడా దేహభ్రాంతే. ఎందుకని? పుట్ట ఇదే కదా! ఇక్కడ ఎట్లా అయితే శరీర భావంతో చూస్తున్నావో, అక్కడ కూడా అదే చూపు. అర్థమైందా అండి? దేవాలయానికి మెట్ల పూజ చేస్తారండి, ఎందుకు? భాగవతోత్తములు నడచిన దారి కాబట్టి, ఆ దారి వెంబడి వారి యొక్క పవిత్ర భావన, ఆ పవిత్రత నీకు అబ్బుతుందని. దృష్టి అంతా దేని మీద పెట్టావు? ఆలోచించండి. నేను గమనిస్తూ వుంటాను, దేని కోసం పెట్టారు? ఏమి చేస్తున్నాం? ఇప్పుడ మెట్ల పూజ చేయమన్నారండి, ఎందుకోసం చేయమన్నారు? ఎందరో మహానుభావులు దైవదర్శనం కోసం వచ్చిన సందర్భాలు అనేకం వుంటాయి కాబట్టి ఆ మహానుభావుడు నడిచినటువంటి ఆ ప్రాంతంలో వారి యొక్క ప్రభావం ఆ సృష్టి మీద, ఆ పంచభూతాల మీద వుంటుంది కాబట్టి, ఆ పవిత్ర భావం నీలో ప్రవేశించి, నీవు ఈశ్వర లక్షణాన్ని పొందే అవకాశం వుంది. అనేదాని కోసం పెట్టమన్నారు. ఇప్పుడు మనమేమి చేశాము? మా అబ్బాయి బాగా చదువుకోవాలి, మా అబ్బాయి బాగా చదువుకోవాలి అంటూ పసుపు రాస్తున్నాము. అర్థమైందా అండీ!

కాబట్టి జగత్తునిండా నిండి వున్నటువంటి ఈశ్వరత్వాన్ని గుర్తించే ప్రయత్నమే నీవు పుట్టింది మొదలు పోయేవరకూ చేస్తున్నటువంటి ఒకే ఒక పని. ఇప్పుడు మనమందరం అనేకమైన పనులు చేశామని అనుకుంటున్నామా? లేదా? అనుకుంటున్నామా లేదా? ఎందుకని? ఎవరైనా పుట్టింది మొదలు ఇప్పటి వరకూ ఏం చేశారండీ? నువ్వు చేసినటువంటి ప్రత్యేకాలన్నీ చెబుతావు. అంటే కాశీ వెళ్ళానండి, రామేశ్వరం వెళ్ళానండి. లేకపోతే ఆ మహానుభావుడి దగ్గరకు వెళ్ళానండి, ఈ మహానుభావుడి దగ్గరకు వెళ్ళానండి. ఇదిగో ఆ పాఠం నేర్చుకున్నాను, ఈ పాఠం నేర్చుకున్నాను. ఇవేనా? మనం చెప్పేది జీవితం మొత్తం మీద? అదీ కాదు. పోనీ ఏం చెప్తావు? ఇదిగో ఆ 66 రకాలు తిన్నానండి. ఈ 26 రకాలు చూశానండి. ఇలా చెప్తావు. ఇంతేనా కాదా? ఈ ప్రత్యేకతలు అన్నీ ఏమిటట? అవి ఈశ్వర విభూతిగా చూసినప్పుడు ఏమైపోయింది? ఈశ్వరుడియందు లయించాయి. ఈ జగత్తుని ఈశ్వర విభూతిగా గనుక నీవు చూచినట్లయితే, అక్కడంతా ఏమి కనపడిందంట ఇప్పుడు? అనేకత్వం కనపడలేదు. ఏకత్వ లక్షణమైనటువంటి ఈశ్వరుడే కనపడ్డాడు. జగత్తు అంతా ఈశ్వరుడే అయినప్పడు నీవు వేరే వుండే అవకాశం వుందా? జీవుడిగా వేరుగా వుండే అవకాశం వుందా నీకు? నీకు ప్రత్యేకమైన ఉనికి వుండే అవకాశం వున్నదా? లేదుగా. ఎందుకని? ఆ జగత్తులో భాగమే కదా! నువ్వు కూడా. కాబట్టి నీవు కూడా ఎవరు? ఈశ్వరుడవే అనే నిర్ణయం చేసుకోమంటున్నారు. అదదండి, అధిష్టాన నిర్ణయమంటే. సమాధి అంటే, అర్థమైందా అండి ఇప్పడు? వివేక చూడామణి చివరి భాగాలన్నీ ఇలాంటి నిర్ణయాన్ని చెబుతున్నాయి. అంతేనా కాదా?

“ధ్యాననిధి, ఆత్మ దృష్టి, ప్రపంచ బాధ, ఆత్మచింతా విధానము, దృశ్యము యొక్క ఉపేక్ష, ఆత్మజ్ఞాన ఫలము, జీవన్ముక్త లక్షణము” ఇలా జీవించేవాడు ఎవరట? జీవన్ముక్తుడు. అంటే జీవించి వుండే, జీవభావం నుంచి ముక్తుడైనవాడు. ముక్తుడు ఇప్పుడు దేంట్లోనుంచి ముక్తుడు అయ్యాడు? జగత్తు, జీవుడు అనే రెండింటి నుంచి ముక్తుడు అయిపోయి ఈశ్వరుడిగా వున్నవాడు. జగత్తుని ఈశ్వరుడిగా చూస్తున్నాడు. తనను తాను కూడా ఈశ్వరునిగానే భావిస్తున్నాడు. వాడు జీవన్ముక్తుడు.

"ప్రారబ్ధ విచారము, నానాత్వ నిషేధము, ఆత్మానుభవోపదేశము, శిష్యుని బోధానుభవము, ఉపదేశము యొక్క ఉపసంహారము, శిష్యుని సంచారము, శ్రీ గురుదేవుని పరబ్రహ్మ విహారము" ఇలాగ అష్టావక్రగీతకు సంబంధించినటువంటి అంశాలను అన్నింటినీ కూడా, వివేకచూడామణితో బేరీజు వేసుకోవాలి. వేసుకుంటే ఇందులో విస్తారంగా చెప్పబడి వున్నది. ఒక్కొక్క అంశాన్ని విస్తారంగా చెప్పారు. ఇక్కడ ఏం చేశారు వాటిని? సంక్షిప్తీకరించేశారన్నమాట. అర్థమైందా అండీ! కారణం ఏమిటి? నిత్యానిత్య వస్తు వివేకము, ఆత్మానాత్మ వివేకము, సదసద్వివేకము, కార్యకారణ వివేకము, దృక్ దృశ్య వివేకము నీకు నేను ఈశ్వరుడను అనేటటువంటి ముక్తానుభవం, ఆ మోక్షం ఈ అయిదు పద్ధతులలో వివేకంతో నీకు సాధ్యం అవుతుంది. అని వేదాంతం అంతా కూడా ఈ అయిదు వివేకాలే కనపడుతూ వుంటాయి. ఎక్కడ చూసినా కూడా. ప్రాథమిక స్థితిలో నిత్యానిత్య వస్తు వివేకము. ఎదిగినాక ఆత్మానాత్మ వివేకము, ఆ తరువాత సత్ అసత్ సదసద్వివేకము, ఆ తరువాత కార్యకారణ వివేకము, ఆ తరువాత దృక్ దృశ్య వివేకము. కాబట్టి మీరు దేనినైనా సరే ఈ అయిదు వివేకాలని విడిచిపెట్టకుండా చూడగలిగేటటువంటి జీవితాన్ని కలిగివుండాలి. చాలా ముఖ్యం అండి. తెలియడం వేరు, జీవించడం వేరు. జీవించడంలో ఈ అయిదింటిని మనం వినియోగిస్తున్నామా లేదా? అనేది చూసుకోవాలి ఎప్పటికప్పుడు. ఎప్పుడెప్పుడైతే నీవు దీంట్లో నుంచి బయటకు వచ్చేస్తావో, అప్పుడప్పుడు నీకు మళ్ళా మూడు అయిపోతావు.

ఈ అయిదు వివేకాల యొక్క ప్రభావము ఏమిటంటే, ఈ మూడింటిని కలిపేస్తుంది. త్రిపుటి మొత్తాన్ని కలిపేస్తాయండి. అతే ఆ వివేకము అంటే అర్థము. త్రిపుటి ఏకత్రితమై ఒకటిగా వుండిపోతుంది. మూడుగా విడిపోదు ఇక. ఈ వివేకం లోనుంచి బయటకు వచ్చావనుకోండి, మళ్ళా మూడు అయిపోతుంది. అందులో మొదటి మూడు ఏమిటంటే, జగత్ జీవేశ్వరులే మొదటి త్రయం. అర్థమైందా అండీ! ఆ జగత్తు మళ్ళా ఎట్లా ఏర్పడిందయ్యా? మళ్ళా మూడు గుణాలు, మూడు అవస్థలు, మూడు శరీరాలు ఇలా మూడు మూడు మూడు చెప్పుకుంటూ పోతే, అవన్నీ అవే. కర్మ త్రయం, ఫల త్రయం అర్థమైందా అండీ! మనం కర్మను ఆచరిస్తున్నామా? లేదా? ఎలా ఆచరిస్తున్నాము? ఒక్కసారి ఆలోచించండి. మనం ఏమంటున్నాము? జీవులంత ప్రారబ్ధానుసారం

వుండవలసిందే. అనేనా ప్రారబ్ధ నిర్ణయం? అసలు వుందా? అసలు వుందా? అని ప్రశ్న వేసుకోమన్నాడు. ప్రారబ్ధం అంటే ఏమిటి? పుర + ఆరబ్ధము. ప్ర అంటే పూర్వము. ఆరబ్ధము అప్పటినుంచి ఆరంభించి వుండి నీకు లభించింది. నువ్వే తెచ్చుకున్నావా? తెచ్చుకోలేదా? తెచ్చుకోకపోతే ఎలా వున్నావు మరి నువ్వు ఇలా? ఇలాగే ఎందుకు వున్నావు? మరోలాగా ఎందుకు లేవు? అంతేనా కాదా? మన చుట్టుప్రక్కల ఇంతమంది జీవులు వున్నారండి. ప్రతి ఒక్కడు ఎవడికి వాడు ఏమనుకుంటున్నాడు? నేను ప్రత్యేకం. నాకు వున్న జీవితం ఇంకొకడికి లేదు. నాకు వున్న సమస్యలు ఇంకొకడికి లేవు. నాకున్న పరిస్థితులు ఇంకొకడికి లేవు. ఈ పరిస్థితులు నీకు గనుక వుంటే నువ్వు కూడా ఇలానే వుంటావు. ఇవి ఉల్టా వాదన అన్నమాట. ఎవరైనా ఒకవేళ ఏదైనా చెప్పబోయారు అనుకోండి, మన దగ్గర గొప్పసమాధానము ఒకటి వుంటుంది. ఏమిటి? నాకున్న పరిస్థితులు నీకు వుంటే, నువ్వు కూడా ఇలానే వుంటావు. అంటే ఏమిటి? ఇంక నువ్వు చెప్పేది వినదలచుకోలేదు అన్నమాట. గురు ఉపదేశంతో ఆయనకు పనిలేదు. సాధరణంగా ఎవరైనా మరొకరికి ఏం చెప్పబూనుకుంటారండి? వాడున్న పరిస్థితి నుంచి బయటకు వచ్చే మార్గాన్ని అన్వేషణలో భాగంగా మాట్లాడుకుంటారు. అంతేనా కాదా? నిజానికి. కానీ మనం వినదలచుకోలేదనుకోండి? అప్పుడు ఏం చెప్తాం? అంతా విన్న తరువాత అయినా ఈ మాట అంటాడు. కొంచెం సత్వగుణంలో వుంటే, అదే రజోగుణంలో వుంటే, ఏం వినడు. మొదట్లోనే ఇవన్నీ నాకు తెలుసుకానీ, నాకున్న పరిస్థితులు నీకు వుంటే, నువ్వుకూడా ఇలాగే వుంటావు. అర్థమైందా అండీ!

తమోగుణ సంపన్నుడు అసలు వినడే వినడు. ఇలా మనం వున్నామా? లేదా? ఇలా అంతా ఎందుకు వున్నావు మరి ఇలాగ? చూడండి. అంటే, నీ దగ్గర ఏమి వున్నాయట అసలు? ఆ ఖర్మఫలాలు నీ దగ్గర ఏమి వున్నాయి? అని విచారణ చేసి చూస్తే, శరీరం వుందా లేదా? ప్రాణం వుందా లేదా? మనస్సు? అది కూడా వుంది. ఈ మూడింటిని ఇది కర్మఫలం చేత నీకు లభించింది అని నీకు నిర్ణయం కావాలి అనంటే, ఎలా వుపయోగించాలి? ఇది తెలియాలి. ఇప్పుడు మనం ఎలా వుపయోగిస్తున్నాము? అది కర్మఫలితంగా భావించి ఉపయోగించడం లేదు. ఆ మూడే నువ్వుగా వుపయోగిస్తున్నాము. శరీరమే నేను, ప్రాణమే నేను, మనస్సే నేనుగా

ఉపయోగించేస్తున్నావు. అందువల్ల ఏమైపోయింది? ఇది కర్మఫలం అనేటటువంటి వివేకము అక్కడ పనిచేయడం లేదు. కాబట్టి ఈ మూడింటితో తపస్సు చేసే పద్ధతిలో, సాత్వికమైన పద్ధతిలో కనుక నీవు వీటిని ఉపయోగించినట్లయితే, నీకు ఒక స్ఫురణ తెలుస్తుంది. ఏమిటది? అంటే, ఈ మూడు కర్మఫలములు. అని తెలుస్తుంది. ఏం చేయడానికి వచ్చాయి? ఈ మూడు అసలు? ఇవి ప్రతి ఒక్క మానవుడికి వున్నాయా లేవా? ఏం చేయడానికి వచ్చాయి ఇవి? (కర్మఫలం అనుభవించడానికి వచ్చాయి) ఏమిటా కర్మఫలం? ధర్మ, అర్థ, కామ ఫల త్రయం. ఈ శరీరం ప్రాణం మనస్సు అవి కర్మ చేయడానికి వచ్చినాయట, పనిముట్లు. అవి మూడు పనిముట్లు. ఎవరి వల్ల వచ్చినాయి? కర్మ ప్రభావం చేత వచ్చినాయి అంటున్నాం. చేస్తే ఏమిటట ఫలితం రావాలా వద్దా? ఏమిటా ఫలితం? ధర్మం, అర్థం, కామం. ఈ మూడే ఫల త్రయం. నాల్గవదైన మోక్షం దృష్ట్యా ఈ ధర్మార్థ కామాలను నడిపితే, ఈ శరీర ప్రాణ మనస్సులు ఏం చెయ్యాలి? తపస్సు చేయాలి. ఈ మూడింటితో తపస్సు చేస్తే, ఆ తపస్సు ఏమై వుండాలట? ధర్మార్థ కామాలను మోక్షం దృష్ట్యా ఆచరించడమే తపస్సు అంటే. కాబట్టి నీ నిజజీవితంలో నీవు జీవించేటప్పుడు ధర్మం ప్రకారం జీవించాలా? అర్థం ప్రకారం జీవించాలా? కామం ప్రకారం జీవించాలా? అంటే ఈ మూడింటిని మోక్షం దృష్ట్యా జీవించినట్లయితే, ఈ శరీర ప్రాణ మనస్సులను తపింపజేసి వీటికి ఆధార భూతమైనటు వంటి కర్మబంధం నుంచి నీవు బయట పడవచ్చు. ఇదే నాయనా ముక్తి అంటే. అర్థమైందా అండి?

మరలా ఈ శరీర ప్రాణ మనస్సులు కర్మ ప్రభావం చేత తయారవ్వకుండా వుండే పద్ధతిలోకి నువ్వు మార్పు చెందవచ్చు. ఈ కర్మబంధం లేనిది అని దృఢపడుతుంది నీకు. చాలా మంది ఏమనుకుంటారంటే ముక్తుడు అంటే ఏమిటి మన అభిప్రాయంలో? అంటే ఇతమిత్థంగా చెప్పలేరండి. "**కర్మబంధ ప్రభావం లేకుండా నువ్వు శరీరంలో వుండడమే ముక్తుడంటే**". జీవన్ముక్తు అంటే అర్థం ఏమిటంటే? కర్మబంధం వలన నీకు ఏమి కలిగినాయి? శరీరం, ప్రాణం, మనస్సు. వాటిని ఆచరిస్తే ఏమి కలిగినాయి? ధర్మ అర్థ కామాలు. వీటి వలన నీకు బంధ త్రయం, మళ్ళా నీకు మూడు బంధాలు కలిగినాయి. ఏమిటది? జగత్ జీవేశ్వర భ్రాంతితో కూడినటువంటి బంధ త్రయం ఏర్పడింది. మరి ఈ కర్మ త్రయం, ఆ ఫల త్రయం, ఆ బంధ త్రయం వీటన్నింటిలో కూడా, ప్రపంచంలో ఎవరైనా

ఏం చెబుతున్నారు అందుకోసమని? దుఃఖమిశ్రితం. నీ జీవితం అంతా ఏమిటి? దుఃఖమిశ్రితం. అదొక బంధం. కేవల సుఖమూ లేదు. కేవల దుఃఖము లేదు. అంటున్నామా లేదా? కాబట్టి ఏ రకంగా ఇదంతా పడుగుపేక అంటే మన మనోబుద్ధులలో అల్లుకుపోయిందన్నమాట. ఈ అల్లుకుపోయిన దానిలోనుంచి తత్వజ్ఞానమనే దృష్టితో చూడడం మొదలు పెట్టు.

ఏమిటి తత్వజ్ఞానం? అంటే, అసలు ఈ గొడవా, గోలకు అంతా ఆధారం ఎవరండి? ఇవన్నీ తమంత తామే పనిచేస్తున్నాయా? మరొక ఆధారంతో పనిచేస్తున్నాయా? అసలు ఇవన్నీ ఉన్నాయా లేవా? ఉన్నాయి అంటున్నావా? ఎవరి ఆధారంతో వున్నాయి? (ఈశ్వరుడు) అనే దాకా వెళ్ళు. ఆధార, ఆధేయ విమర్శ చెయ్యి మొట్టమొదట. ఈ గొడవకు అంతటికి ఆధారం ఏది? ఆధేయమేది? ఏది ఆధారంగా వుంది? ఏది ఆధారపడి వున్నది? అనే దానిని నువ్వు విమర్శ చేస్తే, నువ్వు చెబుతున్న శరీర ప్రాణ మనస్సులు ఈ ధర్మార్థ కామాలు ఆ మోక్షము ఈ తపస్సులు ఏవో రకరకాలు చెబుతున్నావు కదా! జగత్ జీవ ఈశ్వరులు అనీ, అది అనీ, ఇది అనీ. ఆ ప్రత్యేకతలు, ఈ ముక్కోటి దేవతలు, ఈ వ్రతాలు, ఆ జపాలు, ఈ తపాలు, ఈ సాధనలు, ఈ విషయానుభవాలు ఇవన్నీను ఇంతేగా జీవితం అంటే. ఎంత లెక్క వేసినా ఇంతేనా కాదా? శబ్ద స్పర్శ రూప రస గంధాలు అనే ఐదు ఇంద్రియ విషయాల అనుభవాలు జీవితం అంతా ఇంతేనా? ఈ ఐదు కాకుండా ఇంకేమన్నా వున్నాయా? ఇంకేమీ లేవు. ఇదంతా నువ్వు వుండే చేస్తున్నావా? నువ్వు లేకుండా చేస్తున్నావా? నేను వున్నాను అనేటటువంటి ఆధారభూత స్థితి మీద ఇదంతా ఒకదానిమీద ఒకటి అల్లుకున్నాయి. నేను అన్నవాడు ఎవరో విచారణ చెయ్యి మొట్టమొదట. ఈ నేను వున్నాను అంటున్నాడే, ఈ వుండడం అనేది ఏంటి? నేను ఏమిటి? రెండే కదా! మొదటి స్థితిలో వున్నాయి. అర్థమైందా అండీ? కాబట్టి 'నేను ఉన్నాను' ఈ ప్రాథమిక స్థితి మీదే ఇవన్నీ అల్లుకున్నాయి. కాబట్టి ఎక్కడ విచారణ చేయమంటుంది అష్టావక్రగీత? మొదటే చెప్పాడు. జ్ఞాత అహంకారం. మొదటి ప్రతిబింబం అహంకారం. ఈశ్వరుడు మొదటి ప్రతిబింబం జీవుడు. ఈశ్వరుడికి మొదటి ప్రతిబింబం ఎవరు? జీవుడు. ఇది అనేకం అయితే ఏమైంది? జగత్తు అయ్యింది. అర్థమైందా అండి? మొదటి ప్రతిబింబ స్థానంలోనే

దీనిని విమర్శ చేసినట్లయితేనే నీవు దీనిని స్థిరంగా నిలబెట్టగలుగుతావు. ఇప్పుడు మనం ఎక్కడ విమర్శ చేస్తున్నామట? సొంతం ఫలిత రూపంలో వచ్చేసిన తరువాత, ఫలిత ప్రభావంలో వుండి విచారణ చేస్తున్నాము. అనేకత్వంలో కూడా కాదు. అనేకత్వాన్ని భోగిస్తూ భోగ ఫలమైనటువంటి ఫలాలలో విచారిస్తున్నాము. ఎక్కడ విచారణ చేయాట అసలిప్పుడు? కారణ ప్రతిబింబం. కారణంగా ఈశ్వరుడు వున్నాడు. అట్టి కారణ ప్రతిబింబం ప్రథమ ప్రతిబింబం అయినటువంటి జీవస్థానంలో విచారణ చేయమన్నాడు. కానీ ఎక్కడ విచారణ చేస్తున్నాము? ఈ జీవుడు అనేకంగా వున్నటు వంటి జగత్తును భోగిస్తూ అనుభవిస్తూ, అనుభవించి ఫలితాలలో భాగాలు అయినటువంటి సుఖదుఃఖమిశ్రితంలో విచారణ చేస్తున్నాము. ఎంతదూరం జరిగిపోయాము? అందువల్ల నీకు ఈశ్వర లక్షణంతో నిర్మించబడినటువంటి ఈ సృష్టిలో ఈశ్వరుడు కనబడడం లేదు. అర్థమైందా అండీ!

కుండ కొనడానికి వెళ్ళారండి మీరు, సాధరణంగా. చూడండి కుండ కొనేవాళ్ళను గమనిస్తే, మీకు ఏం కనపడుతూ వుంటుంది? కుండ కొట్టి చూస్తారా లేదా? ఎందుకు? ఓటిదా? గట్టిదా? తెలుసుకోవడానికి. ఎందుకు నీకు అది? దాని వల్ల ఏమిటి ప్రయోజనము? అంటే మనస్సు దేంట్లో తిరుగుతోంది? Already అక్కడ కుండలో నీళ్ళు పోశావా? పొయ్యలేదు. కుండలో నీళ్ళు పోశారటండీ? పోయలేదు. లోపల అనుభవజ్ఞానంలో వుంది. కుండలో నీళ్ళు పోయడం, అది కారిపోవడం అనే అనుభవజ్ఞానం లోపల వుంది. ఇప్పుడు దేనితో బేరీజు వేస్తున్నావు, ఈ వర్తమానంలో కుండ verification ని? ఆ పూర్వకాలపు జ్ఞానంలో verify చేస్తున్నావు. అంతేనా కాదా? ఇప్పుడు కార్యం, కుండలో నీళ్ళు పోయడమనే కార్యం జరిగిందా? జరగలేదా? జరిగిందా? జరగలేదా? అంటే కారణ స్థితిలో జరిగిపోతున్నది. వస్తుతః కార్యంగా జరిగిందా అంటే జరగలేదు. అర్థమైందా అండీ? కాబట్టి మనవాళ్ళు ఏం చెప్పారు? వివాహ నిర్ణయం చేశాం, అంటే వివాహం అయిపోయినట్టే పో అన్నారు అంతే. మనమేమి అంటున్నాము. పెళ్ళి పెటాకులు అయినాక గానీ, వివాహం అవ్వలేదు అంటున్నాము. రోజూ మనకు complaint ఎవరితో? ఆయన అనువుగా లేడు, ఈయన అనువుగా లేడు అంతా కూడా, అసలు అనువుగా ఎందుకు వుండాలి? ప్రపంచంలో

ఒకరికి ఒకరు అనువుగా ఎందుకు వుండాలి? నీవు ఈశ్వరుడికి అనువుగా వున్నావా? నువ్వు ప్రశ్న వేసుకో మొట్టమొదట. నీకు ఆధారం ఎవరు? ఈశ్వరుడు అండి. నీ జీవితం మొత్తం మీద ఎప్పుడైనా ఈశ్వరుడికి అనువుగా వున్నావా? నీవే, అసలు నీ ఉనికిలోనే తద్ వ్యతిరేకంగా వున్నావు. ఈ జీవుడు అనేవాడు ఎలా వున్నాడు? ఈశ్వరుడికి వ్యతిరేక ప్రతిబింబంగా వున్నాడు. ఎందుకని? నువ్వు అద్దంలో చూసుకో! ఎలా వున్నావు? నీ ప్రతిబింబం నీకు వ్యతిరేకంగా వుంది. కాబట్టి సృష్టి ధర్మం ప్రారంభంలోనే నువ్వు ఎలా వున్నావు? నీ ఉనికి లోనే నీవు ఎలా వున్నావు? ఈశ్వర లక్షణాలతో సమానంగా వుండవలసినటువంటి వాడివి ఏమయ్యావు? వ్యతిరేకంగా ప్రతిబింబం. అందువల్ల వ్యతిరేకమే సృష్టి ధర్మమై వున్నది. కానీ ఏం వెతుకుతున్నావు? జీవితం మొత్తం మీద? తగాదా అంతా ఇప్పుడు ఎక్కడ వచ్చింది? అసలు వుండేదే వ్యతిరేకతలురా బాబూ అని తెలుసుకున్నావనుకోండి, అప్పుడు ఇంక అనుకూలం గురించి ఏం వెతుకుతావు? ఈ అనుకూలతలను గూర్చి వ్యతిరేకతలను గూర్చి తగాదా పడే బదులు, నువ్వు అసలు దేనిని అన్వేషించాలట? నువ్వు దేనిమీద ఆధారపడి వున్నావో ఆ ఈశ్వరుడిని అన్వేషించే ప్రయత్నంలో వుండు. అప్పుడు ఈ వ్యతిరేకతలు అన్నీ ఏమైపోయినాయి? లేవుగా అప్పుడు. ఎందువల్ల లేకుండా పోయినా? ఇవన్నీ ఆ ఈశ్వరుడిలోనే కలిసిపోయినాయి. నీ అనుకూలతలు మీద వున్న అపేక్షకూడా అప్పుడు ఏమైపోయింది? అది కూడా లేకుండా పోయింది. ఇప్పటి వరకూ నీకు అనుకూలమైనవి అన్వేషించడమే సరిపోయింది జీవితం అంతా. ఎవరో ఒకరో ఇద్దరో అనుకూలంగా కనపడితో వాళ్ళతోనేమో మంచిగా మాట్లాడావు, మిగిలిన 98 వ్యతిరేకంగా వున్నారు కాబట్టి వాళ్ళతో చెడ్డగా మాట్లాడావు. ఇప్పుడు ఇవన్నీ ఎందులో కలిసిపోయినాయి ఒక్కసారిగా? ఆ ఈశ్వరలక్షణంలో కలిసిపోయినాయి. అర్థమైందా అండి? కాబట్టి నిజజీవితంలో మనం పుట్టింది మొదలు పోయేవరకు, జీవితాంతము వరకు ఒక పనే చేస్తున్నాము. ఏమిటది అంటే అనంత సృష్టిలో ఈశ్వరాన్వేషణ ఒక్కటే చేస్తున్నాము. జై బాబా !

[File no: MIC-2010-08-29_03h35m59s.mp3 over]

File: 3 [ప్రార్థన: ఓం బ్రహ్మానందం ఓం పూర్ణమదః పూర్ణమిదం ఓం సహనావవతు]

[చదవండి! పెన్సిల్ కాని పెన్నుగాని పెట్టుకుని ప్రాణమున్న వాక్యాలను underline చేసుకోవాలి. లేకపోతే ఎక్కడన్నా రాసుకోవాలి. మీ అవసరాన్ని బట్టి, మీ పరిస్థితిని బట్టి, శక్తిని బట్టి. చదవండి!]

"భ్రమాజన్య జ్ఞానంతో తాదాత్మ్యం చెందినప్పుడు జీవుడిగా భావించిన జీవాత్మ ఏదైతే వుందో, అదే ఆత్మ. అదే సత్యం. తత్వజ్ఞానం సహాయంతో సాక్షిగా నిలబడి, తన స్వయం జ్యోతిగా, ఆనందంగా, కేవలంగా వుండి వుంటున్నది."

ఆ రెండు వాక్యాలు విచారించండి. ఆ topic పేరు ఏమిటి అసలు? "ఆత్మ సాక్షిగా... అందరిలో..." ఇప్పటివరకూ నువ్వు ఎలా వున్నావు? వ్యష్టివరకే వున్నావు. నీలో వున్నటువంటి వ్యష్టి శరీర ప్రాణ మనస్సు బుద్ధిలకు సాక్షిగా మాత్రమే వున్నావు. ఇప్పుడు నీకు ఈ అధ్యాయం ద్వారా ఏం దర్శింపజేసే ప్రయత్నం చేస్తున్నారు? అంటే, నీలో వున్న సాక్షియే, అందరిలో కూడా వున్నది. ఇప్పటి వరకూ ఎలా ఒప్పుకుంటున్నావు? అంటే, గురువుగారు చెప్పారు కాబట్టి ఒప్పుకుంటున్నావు. నీకు స్వానుభవం లేదు. వుందా? ఈవెడలో వున్న సాక్షి ఎలా వుంది? దర్శించలేదు. నీకు ఆ శక్తి లేదు. కారణం ఏమిటి? నీకు బాగా తెలిసింది ఏమిటయ్యా? అని అంటే, నీ శరీరం, నీ ప్రాణం, నీ మనస్సు, నీ బుద్ధి. ఇంతవరకే తెలుసు. ఎదుటి వ్యక్తి యొక్క ప్రాణమనోబుద్ధులని, అందులో వున్నటువంటి సుగుణాలు, దుర్గుణాలు, మాలిన్యాన్ని శుద్ధతని, ఈ రెండు అవగాహన చేసుకుంటే తప్ప, అక్కడ వున్నటువంటి సాక్షిత్వాన్ని నువ్వు నిర్ణయించలేవు. కాబట్టి నీలో అయినా, వారిలో అయిన వున్నటువంటి ప్రాథమిక ధర్మాలని, ప్రాథమికమైనటువంటి దోషాలని ముందు వివరిస్తున్నారు.

మనందరికి వ్యష్టిగా వున్నటువంటిది ఏమిటి? అంటే, ఒక రెండు వాక్యాలలో చెప్పారు. ఏం చెప్పారు? చదవండి! "భ్రమాజన్య జ్ఞానంతో" – అంటే మనకిప్పుడు జ్ఞానం వుందా? లేదా? వుంది. కానీ దేని ఆధారంగా వచ్చిన జ్ఞానం వుంది అంటే, భ్రమను ఆధారంగా చేసుకుని వచ్చినటువంటి జ్ఞానమే వుంది కానీ, ఏమిలేదు? యథార్థజ్ఞానం లేదు. అంటే వున్నది వున్నట్లుగా వున్న జ్ఞానం లేదు. వస్తు నిశ్చయ జ్ఞానం

అంటారన్నమాట దానిని. ఈ వస్తునిశ్చయజ్ఞానం అంటే ఏమిటంటే, ఉన్నది ఉన్నట్లుగా తెలియడం. భ్రమాజన్యజ్ఞానం అంటే ఏమిటి? లేనిది వున్నట్లుగా కనపడటం భ్రమ. భ్రమ అంటే ఏమిటండి? లేనిది ఉన్నట్లుగా కనపడటం. భ్రాంతి అంటే ఏమిటి? ఉన్నది లేనట్లుగా కనపడటం. ఈ రెండు అవలక్షణాలు బుద్ధికి వున్నాయి. ఇవి దేనికి వున్నాయండి? బుద్ధికి వున్నాయన్నమాట. ఏమిటి? భ్రమ, భ్రాంతి. భ్రమ అంటే ఏమిటంటే, లేనిది వున్నట్లుగా కనపడటం. భ్రాంతి అంటే ఉన్నది లేనట్లుగా కనపడటం. రెండూ సమస్యలే. నువ్వు భ్రమను దూరం చేయాలా? భ్రాంతిని దూరం చేయాలా? అని సమస్య ఎత్తుకున్నప్పుడు మనోబుద్ధుల యొక్క సంఘర్షణలో అన్నీ భ్రాంతులే వుంటాయి. మనోబుద్ధుల సంఘర్షణలో అన్నీ భ్రాంతులే వుంటాయి. బుద్ధికి పైన భ్రమ వుంది. బుద్ధికి పైన భ్రమ వుంది. బుద్ధికి మనస్సుకి మధ్యలో భ్రాంతులు వున్నాయి. అంటే అర్థం ఏమిటి? ఉదాహరణ చూద్దాము. గడపకి పసుపు రాస్తే శుభం. రాయకపోతే? (అశుభం) ఎవరు చెప్పారు? (ఎవరూ చెప్పలేదు, దానిని బట్టి అర్థం చేసుకున్నాము) అంటే భ్రాంతి అంటే ఏమిటంటే, విచారణతో పనిలేకుండానే, అభ్యాసంలో అలవాటుపడిన దానిని, ఒకదానిని నిర్ణయంగా స్వీకరించి, మరొక దానిని నిర్ణయం చేయటం భ్రాంతి. దానికి విచారణతో పనిలేదు. ఎందుకు? ఏమిటి? ఇది సత్యమా? నిత్యమా? అనిత్యమా? దీనవల్ల ఏమిటి ప్రయోజనం? నీకు దీని వల్ల ఏమి వస్తుంది? ఈ జ్ఞానంతో పనిలేదు ఏమీ దానికి. కానీ ఏముంది? అభ్యాసం. అర్థమైందా అండీ? అభ్యాసం చేసేస్తున్నావు కాబట్టి, అది నీకు సత్యమే. అర్థమైందా? ఆ అభ్యాసబలం చేత నువ్వు ఎన్నింటినైతే సత్యంగా ఒప్పుకున్నావో, అంటే విచారణ లేదు, కేవలం అభ్యాసం మాత్రమే వున్నది. వివేకము లేదు. కేవలం అభ్యాసం మాత్రమే వున్నది. వాటిని నువ్వు సత్యంగా ఒప్పుకున్నావు. ఆచరించేస్తున్నావు. ఆ ఆచరణలోనే నీకు జ్ఞానం లభిస్తోంది. కానీ అది ఎటువంటి జ్ఞానం అయివున్నది? అంటే, మరొక దానిని దీనితో పోల్చిచూస్తే, నీకది భయాన్ని కలిగిస్తుంది. అంటే అర్థం ఏమిటట?

తిరుపతి వెళ్ళామని మొక్కుకున్నారండీ! ఫలానా జనవరిలో వస్తానని మొక్కుకున్నాడు. కారణాంతరాల వలన వెళ్ళలేదు. ఏమైంది ఇప్పుడు అయితే? నీలో భయం ప్రారంభమైంది. ఎందుకు మొక్కుకున్నావు నీవు అసలు? జ్ఞాని దగ్గరకు వెళ్తే,

దేనిని ప్రశ్నిస్తున్నాడు? ఈ భయానికి కారణం ఏమిటి? నువ్వు అనుకున్నప్పుడు తిరుపతి వెళ్ళలేకపోవడం. ఎందుకు అనుకున్నావు? నేను మొక్కుకున్నాను కాబట్టి. ఎందుకు మొక్కుకున్నావు? ఒక ఫలితాన్ని కోరాను కాబట్టి. ఆ ఫలితం లేకపోతే నీకు ఏ ప్రమాదం వచ్చింది? నాకు దాని వల్ల దుఃఖం వుంది కాబట్టి, ఆ దుఃఖం పోవాలని అనుకున్నాను. ఏదో, అక్కడ విషయం ఏదైనా! విషయం వల్ల నీకు దుఃఖం వచ్చిందా? దుఃఖమే విషయంగా వుందా? ఈ రెండిటిలో ఏది సత్యం? నాకు బాగా ఆరోగ్యంగా వుంటే నేను కొండకు వస్తానని అనుకున్నానండి. ఎప్పటికైనా వుంటావా నీవు ఆరోగ్యంగా? వీడు ఎప్పటికీ ఆరోగ్యంగా వుండడు, వాడెప్పటికి మూట కట్టడు. కాబట్టి ఇలా మొక్కుకున్నారా ఎవరైనా? మొక్కుకోవడం లేదు. మా అబ్బాయికి పెళ్ళి అయితే కొత్త దంపతులను తీసుకుని కొండకు వస్తాను. ఎవరి జీవితం మీద ఎవరు మొక్కుకున్నారు? చూడండి. ఆమె వివాహం ఆమె కర్మానుభవ ఫలం. అంతేనా కాదా? దానిమీద నువ్వు ఏం చేశావు? నీకు ఏమీ అధికారము లేదు. కానీ పూర్వం అభ్యాసం వుంది. అభ్యాస బలం చేత ఏం చేశావు? ఆచరిస్తున్నావు కదా! కొంతమంది మొక్కుకుంటే అది సత్యమైనట్లుగా, నీ ఎఱుకలో వున్నవారి దగ్గర జ్ఞానాన్ని సంగ్రహించావుగా. నీకు లేదు. ఒకళ్ళు ఎవరో మొక్కుకున్నారు. ఆ పని అయ్యింది. దానినే ప్రామాణికంగా స్వీకరించావు. విచారణ చేయలేదు. ఆచరించేశావు. ఏమైంది ఇప్పుడు? అది ఆచరణలో ఏదో ఒక అడ్డంకి వచ్చింది. ఆ అడ్డంకి ఫలితం, విచారణ లేకుండా అభ్యాసంలోకి దిగడం చేత, నీకు అది భయాన్ని కలిగిస్తుంది. ఏ ఆచరణ వలన అయితే నీకు భయం కలుగుతోందో అదంతా భ్రాంతియే. అని నిర్ణయం చేయమన్నారు. ఏది ఆచరిస్తేనో, ఏది ఆచరించకపోతేనో నీకు భయం కలుగుతుంది. అది ఆచరించినా ఆ భయమే వుంటుంది. అది ఆచరించకపోయినా కూడా భయమే వుంటుంది. రెండిటికి result భయమే. ఎందుకనిట? విచారణ లేదు కాబట్టి. ఉదాహరణ చెప్తాను చూడండి.

ప్రాణాయామం చేస్తే ఆరోగ్యం బాగుపడుతుంది. ఇది అందరికీ తెలిసిన సత్యమేనా? ఇప్పుడు అందరూ ఆచరిస్తున్నారు కూడా. ప్రాణాయామం ఉద్దేశ్యం వేరే వున్నప్పటికీ కూడా, సరే ఆ కాసేపు మిగిలిన విషయం అంతా, పై విషయం అంతా ప్రక్కకు పెట్టినా ప్రాణాయామం చేయడం ద్వారా శరీరం ఆరోగ్యంగా వుంటుంది. మరి ఇప్పుడు

ప్రతి ఒక్కరూ ప్రాణాయామం చెయ్యాలి అంటే, దాని విషయం తెలుసుకోవాలి అంటే ఎవరి దగ్గరకు వెళ్ళాలి? ఆ విద్య తెలిసినవారి దగ్గరకు వెళ్ళి, ప్రాణాయామం అంటే ఏమిటి? దానిని ఎట్లా నడపాలి? ఎట్లా నిలుపుకోవాలి? ఎక్కడ నిలుపుకోవాలి? ఎంతసేపు నిలుపుకోవాలి? ఏం చేయాలి? ఏం చేస్తే ఏమి అవుతుంది? ఇది మొత్తం సమగ్రంగా తెలుసుకుని చేయాలి. అంతేనా కాదా? ఎలా చేస్తున్నారు? (టీవీలో చూసి చేస్తారు) ఆయన టీవిలో బోధిస్తూ వుంటారు. మనవాళ్ళు ఇక్కడ చేసేస్తూ వుంటారు. ఏమౌతుంది? (సత్ఫలితం రాదు) నిన్ను దృష్టిలో పెట్టుకుని కాదుగా చెప్తుంది అక్కడ. (అవును). ప్రపంచాన్నంతా దృష్టిలో పెట్టుకుని ఇలా చేయాలి, అలా చేయాలి. అక్కడ ఎవరో కొంతమంది చేస్తూ వుంటారు. చెప్తూ వుంటారు. సాధారణంగా సరిపోవచ్చు. కొన్ని అసాధారణ పరిస్థితులు తలెత్తితే, అప్పుడు ఏం చేయాలి? నీకు వెంటనే ఏం కలిగింది? కొంతమందికి ఆ ప్రాణయామం చేసేటప్పుడు గొంతు ఇక్కడ పట్టుకుంటుంది. ఠఖా మంటూ పట్టేస్తుంది ఇక్కడ. అది విడవదు ఇక. ఇట్లా పట్టుకున్నది, ఇట్లా వుండిపోతుందండి. వాడు ఎన్ని తిప్పలు పడనివ్వండి అది పోదు. కారణం ఇదే నన్నమాట. అంటే దానిని విడిపించుకోవడం కూడా తెలియాలి. అంటే కట్టడం ఎలా తెలియాలో, విడిపించడం కూడా తెలియాలి. ప్రతిదాంట్లోనూ ఈ రెండూ వుంటాయన్నమాట. కాబట్టి మనవాళ్ళు చెబుతారు చూడండి, అభిమన్యుడికి పద్మవ్యూహంలోకి వెళ్ళడం మాత్రమే తెలుసు, బయటకు రావడం తెలియదు అని. మనది అంతా అదే మోడల్ అన్నమాట. ఎవరికో అర్జునుడికి కృష్ణుడు ఏం చెబుతున్నాడు? పద్మవ్యూహాన్ని వివరిస్తున్నాడు. ఈయనేం చేశాడు? తల్లి గర్భంలో వుండి ఊఁ... కొట్టాడట. కొట్టేస్తే వచ్చేసిందా? చివరికి మరణకారణంలో కూడా ఏమైంది? ఎక్కడ నీకు అజ్ఞానం వుందో, ఆ అజ్ఞానమే నీ మరణ కారణంగా మలచబడింది. అదే భారతంలో వున్న గొప్ప రహస్యం. నీకు ఎక్కడెక్కడైతే ఆ పూర్ణజ్ఞానం పూర్తి అవ్వలేదో, అది నీకు మరణకారణం అవుతున్నది. అర్థమైందా అండీ! అని నిరూపిస్తాడన్నమాట. ఆ మహాభారత యుద్ధంలో పద్మవ్యూహం చాలా సార్లు పన్నుతారు. కానీ, అర్జునుడు లేని వేళ పన్నాడు. అర్థమైందా అండీ! అర్జునుడు వున్నంతకాలం పద్మవ్యూహం ఛేదించ బడుతూనే వున్నది.

మనలో కూడా పద్మవ్యూహం వుందా? లేదా? (వుంది) ఎక్కడుంది? షట్కమలాలు. మూలాధారం, స్వాధిష్ఠానం అవన్నీ పద్మవ్యూహాలే. ఒక్కొక్కటీ ఒక్కో పద్మవ్యూహం అది. మధ్యలో వున్నటువంటి, ఆ సుషుమ్నానాడి అనేటటువంటి మూల సూత్రం ఏదైతే వుందో, అదే దాంట్లో వచ్చే, పోయే మార్గం. ప్రక్కకు పోతే ఇక మళ్ళీ ఇందులోకి రావు. ఆ పక్కకు పోకుండా, ఆ సుషుమ్నానాడిలోనే నడపగలగాలి. నడపగలిగితే నువ్వు దాన్ని ఛేదించుకుని వెళ్ళగలుగుతావు. అర్థమైందా అండీ! వెళ్ళటం మాత్రమే తెలుసండీ! అంటే ఇప్పుడు ఏమైంది? అంటే బయటకు వెళ్ళి, ఆ దళాల మీద పనిచేసి, ఆ కర్మానుభవం పొందటం వరకూ మాత్రమే పనిచేసి, ఆ కర్మానుభవం పొందడం మాత్రమే తెలుసు. దాన్ని విడిపించుకోవడం కూడా తెలియాలి కదా! మరి ఎట్లా తెలుస్తుంది? కాబట్టి మనల్ని అందరిని ఉద్దేశ్యించే ఆ పాత్రలు అక్కడ ప్రవేశపెట్టి చెప్పారు. అర్థమైందా అండీ! అక్కడ జరిగిన యుద్ధం ఒక సంఘటన. ఆ సంఘటనను ఆధారం చేసుకుని, కర్మని, భక్తిని, యోగాన్ని, జ్ఞానాన్ని అనేక మార్గాలలో, అనేక సంస్కారబలాలు వున్నటువంటి సాధకులకు అర్థమయ్యేటట్లు చెప్పడానికి ఆ మహాభారత కథను అలా చెప్పారు. కాబట్టి యోగ దృష్టి కలిగినవాడికేమో మహాభారతయుద్ధం అంతా ఇలా కనపడుతుంది. దీనినే జ్ఞాన దృష్టితో చూస్తే, ఆత్మ విచారణ ఏం చెబుతోందయ్యా అంటే, నీ హృత్కమలం ఒక్కటే కమలమయ్యా! నీ హృదయమనేది ఏ స్థానం అయితే వున్నదో, అది ఒక్కటే పద్మం. అదే అష్టదళ పద్మం. నీకు మిగిలినవన్నీ లేవు. మిగిలినవన్నీ భ్రమాజనితములు. మిగిలినవన్నీ భ్రమాజనితములు, భ్రాంతిజన్యములు కావు. అవి భ్రమాజనితములు అంటే ఎక్కడున్నాయి అవి? బుద్ధికి పైనున్నాయి. అర్థమైందా అండీ! భ్రాంతి జన్యములు అంటే మనోబుద్ధుల మధ్యలో వున్నాయి. ఈ సత్యం బాగా తెలియాలి. శరీరంతో, ప్రాణంతో ఆచరించినప్పుడు మరణభయాన్ని, ప్రాణభయాన్ని కలుగజేసేవన్నీ భ్రాంతులే. దాని result ఏముంటుందంటా? భ్రాంతికి ఫలితం భయం. భయపడటం గాని, భయపెట్టటం కాని. ఈ రెండిటిలో ఏదో ఒకటి చేస్తావు. చేసినప్పుడు నీకు దాని వెనుక వున్న కారణం ఏమిటంటే భ్రాంతి. పిల్లల్ని భయపెట్టాలా? పిల్లలకు భయపడాలా? రెండిటిలో ఏది చేయాలి? పిల్లల్ని భయపెట్టాలా? పిల్లలకు భయం వుండాలా? చూడండి. అంటే నువ్వు భయపెట్టకుండానే వాడికి భయం వుండాలి. వుంటుందా? చూడండి పెద్ద (big)

Question. మనమందరం తల్లిదండ్రులమే కదా! ఇంకో stage కూడా దాటాము కదా! దాటామా? ఇప్పుడు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పండి నిజజీవితంలో. (భయం నేర్పుతాం). పిల్లల్ని భయపెట్టాలా? పిల్లలకి మనం భయపడాలా? పిల్లలకు భయం వుండాలా? ఈ మూడింటిలో ఏది correct? (పిల్లలకే భయం వుండాలా) పిల్లలకే భయంవుండాలా? పిల్లలకి మనం భయపడాలా? కుదరదా! పిల్లలకు మనం భయపడడం కుదరదా! మనల్ని భయపెట్టే పిల్లలు లేరా? (ఉన్నారండీ!) అదికాదండి. నేను ఎందుకు చెప్తున్నానంటే, నిత్యజీవితంలో ఆచరణ దాకా రావాలి మనం. ఈ వేదాంతాన్ని ఎక్కడిదాకా తేవాలి? నువ్వు రోజూ జీవించే జీవితం దగ్గరకే తేవాలి దీనిని. తెస్తేనే నువ్వు ఏం చెయ్యాలో తెలుస్తుంది. ఇంతకు ముందుమాట్లాడుకున్నది ఏమిటి? సిద్ధాంతము. అర్థమైందా అండీ! ఈ సిద్ధాంతాన్ని తెలుసుకున్నావు, తెలుసుకుంటే ఏమిటి ప్రయోజనము? ఆచరణ, నువ్వు ఆచరణ ఎక్కడ చేస్తున్నావు? నువ్వు నీ కుటుంబము నీ పిల్లలు ఇంతే కదా నీ ఆచరణ నీ గోల. ఇప్పుడు దీనిని ఇక్కడ ఎలా apply చేస్తావు? పిల్లల్ని భయపెట్టాలా? భయపెట్టకూడదా? (నేను భయాలతో వుంటే, వాళ్ళను భయపెడతాను) అంటే ఇక్కడొక అంశం వుంది. ముందు నీకు భయము తెలిసి వుండాలి. నీకు తెలియనది వాడిని ఏమన్నా చేయగలవా? ఏం చేయలేవు. నువ్వు మీ తల్లిదండ్రుల యెడ భయపడ్డావా? భక్తితో వున్నావా? నీ అనుభవజ్ఞానం లోపల ఏమి వుందో, దానిని బట్టే నీ పిల్లల మీద నీవు ప్రయోగించగలుగుతావు. అంతేనా కాదా? నీ తల్లిదండ్రుల యెడ నీకు భయం వుందా? భక్తి వుందా? చూడండి. Correct గా ఇప్పుడు చెప్పగలరా? చెప్పలేరండి. కారణం ఏమిటంటే? నీ బాల్యావస్థ తెరమరుగు అయిపోయింది. నీ 10 ఏళ్ళ లోపే వుంటుందిది, 10 ఏళ్ళ తరువాత వుండదు. ఏం చేసినా 10 లోపే. 10 తరువాత ఏమన్నా భయపెట్టగలవా? ఏం భయపెట్టలేవండి. వాడిని ఒప్పించాల్సిందే. మాట్లాడి ఒప్పించాల్సిందే. భయపెడితే అప్పుడు పని జరుగదు ఇక. 10లోపలే నువ్వు ఏం చేసినా. 5 లోపల భయపెట్టగలవా? వాడికి అప్పడు అసలు ఏమీ తెలియదు. అంటే ఏమి చేయవచ్చుటా ఇప్పుడు? వాడికి ఆ క్రమశిక్షణలో భాగంగా 5 నుంచి 10 లోపల మాత్రమే నువ్వు ఈ ఆయుధాన్ని ఉపయోగించగలుగుతున్నావు. ఇంతేనా కదా? కచ్చితంగా మాట్లాడితే. మరి ఇప్పుడు 5 నుంచి 10 లోపల ఆ క్రమశిక్షణ లో భాగంగా నువ్వు

ఇచ్చినటువంటిది అది భయపడటమా? భయపెట్టటమా? పిల్లలందరికీ మనం ఏం చెబుతూ వుంటాము? ఆ జాగ్రత్త తల్లీ! పడిపోతావు. పడిపోతానని పిల్లవాడికి తెలియదా? మీకు కావాలంటే 2 ఏళ్ళలోపల, 3 ఏళ్ళ లోపల పిల్లల్ని చూడండి. వాడు లేచి నడిచేటప్పుడు, ఆ పరుగెత్తేటప్పుడు, ఆ నడక వచ్చినప్పుడు పడిపోయే సంగతి వాడికి తెలియదా? తెలుసు. వాడికేమీ తెలియక కాదండి. ఏం పడిపోడు. పడిపోతాడా? అథవా ఒక వేళ పడ్డా దాని నుంచి పాఠం నేర్చుకున్నాడు. రెండవసారి పడకుండా వుండగలిగే స్థితి వచ్చింది. ఔనా? అదే అమ్మో! పిల్లాడు పడ్డాడు అని ఈవెడ వెళ్ళిందండి. ఏమైంది అప్పుడు? (ఏడుస్తాడు). ఆ ఏడుపు ప్రభావం చేత పాఠం మరుపుకు వచ్చేసింది. వాడు మళ్ళా ఆ ప్రయత్నం చేయడానికి సమయం తీసుకుంటాడు. అర్థమైందా అండీ! ఎంత సమయం తీసుకుంటాడు అంటే, ఈ దుఃఖ ప్రభావం వాడిలో పని చేసినంత సేపు వాడిక ఆ ప్రయత్నం చేయడు. మనం అయినా అంతే. మీరు కరెంటుతో ఏదో పని చేయ బోయారండి. షాక్ కొట్టింది. ఏం చేస్తారు మీరు? ఇక మళ్ళా చస్తే దాని జోలికి వెళ్ళరు. ఎందుకని? భయం. అది షాక్ కొడుతుందని భయం. ఆ షాక్ కొట్టిన భయం వుంటుంది. వుంటుందా? వుండదా? మళ్ళా ఎంతకాలానికి ప్రయత్నం చేస్తావు? ఆ జ్ఞాపకం మాసిపోవాలి. దానిని అధిగమించాలి నువ్వు. ఆ భయాన్ని అధిగమించిన స్థితి వచ్చినప్పుడే, మరలా ఆ పని చేయగలుగుతావు. చిన్నప్పుడైనా అంతే, పెద్దప్పుడైనా అంతే. మరణం వల్ల భయం వుందా లేదా నీకు? వుందా? మరి మరణభయం ఎలా పోతుంది? ఛస్తే పోతుందా? (అధిగమిస్తే పోతుంది) ఎట్లాగ? ముందు చేయలేవుగా ఆ పని? ఇవన్నీ అంటే చేసి చూడగలవండి. మరణం ఎలా చేసి చూస్తావు? చేస్తే ఏమౌతావు? నువ్వు వుండవు. అర్థమైందా ఇప్పుడు మీకు? ఈ అంశాన్ని ఎందుకు తీసుకున్నానంటే నేను, ఈ భయాలన్నిటికి మూలకారణం ఎందులో వుందటా? ఆ ప్రాణభయం మరణభయంలో వుందట. అర్థమైందా అండీ? పోయేది ఏది? నీకు ఎంత సేపు పోయేది తెలుసు. ఏది పోతోంది? ప్రాణం పోతోంది. కాబట్టి ప్రాణ భయం అని అంటున్నావు కానీ, మనస్సుకు భయం, బుద్ధికి భయం అంటున్నావా? అనడం లేదుగా. పోనీ శరీరానికి భయం అంటున్నావా? అనటం లేదు. ఈ భయం అనే లక్షణం ఎవరిది? ప్రాణానిది. ప్రాణభయం, ఆ ప్రాణం పోతుందేమోననే భయం. ఈ భయం ఎవరికి కలిగింది? మనసుకు కలిగింది.

ఎందుకు మనసుకే కలిగింది? బుద్ధికి ఎందుకు కలుగలేదు? మనలో బుద్ధి కూడా వుందిగా. బుద్ధి పనిచేసినప్పుడేమో భయాన్ని అధిగమించావు. మనస్సు ప్రాణం మధ్యలో సంఘర్షణ వున్నప్పుడు ఏమైందంటే, ప్రాణం పోతుందేమో ననే భయానికి మనసులోనైపోయింది. మనసు బుద్ధి మధ్యలోనేమో భ్రాంతి వున్నది. బుద్ధికి అవతలేమో భ్రమ వున్నది. ప్రాణ మనస్సుల మధ్యలోనేమో భయం వున్నది. ఇది మానవ జీవితం. మీరు పుట్టిన దగ్గర నుంచి పోయేవరకు ఏ సంఘటన అయినా లెక్క వేసుకోండి.

మీరు బస్సు ఎక్కుతున్నప్పుడు ఎప్పుడో ఒకప్పుడు పొరపాటున కాలు పెట్టబోయి, కాలు జారిందండి. దెబ్బతగిలింది. ఏం చేస్తారు? బస్సు ఎక్కమన్నప్పుడల్లా ఏం చేస్తారు? (జాగ్రత్త తీసుకుంటారు) వస్తుందా రావడం లేదా? సరే అప్పుడు ఏమన్నారు? నీ పక్కన వున్నవాళ్ళు?  అరే! ఒకసారి పడితే బస్సు ఎక్కవా ఇక? నేను ఎక్కను బాబు. అంటున్నావా? లేదా? అంటే ఇప్పుడు ఎక్కడ ఆగిపోయింది? ప్రాణ మనస్సుల మధ్యలో ఆగిపోయింది. దానిని అధిగమించలేక పోయావు. అధిగమిస్తే ఏమౌతావు? మళ్ళా ఆచరించగలగుతావు. ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి. ఏదైనా ఒక అంశంలో నీకు భయం మిగిలిపోయింది అంటే, అక్కడ నువ్వు ఆగిపోయావు? అంటే, బుద్ధి దాకా చేరడం లేదు. ప్రాణం దగ్గర, మనసు దగ్గర, ప్రాణ మనసుల మధ్యలోనే ఆగిపోయావు. ఏదైనా సరే ఒకటి చేస్తే, దాని ఫలితం భయంగా వచ్చిందనుకోండి అది భ్రాంతి అని చెప్పుకున్నాం కదా ఇందాక. అది ఎక్కడ వుందట ఇప్పుడు? మనో బుద్ధుల మధ్యలో వుంది. అర్థమైందా అండి? నీ మనో బుద్ధుల మధ్యలో వున్నదానిని ఆచరిస్తే ఫలితం ఎక్కడ వస్తుందండి? ప్రాణ మనోబుద్ధుల మధ్యలో భయం అనే ఫలితం వచ్చింది. అదే బుద్ధికి పైనున్నటువంటి భ్రమతో పనిచేస్తే, ఫలితం ఏమి వచ్చిందండి? భ్రమాజన్యజ్ఞానం చేత, జీవాత్మ అనే భ్రాంతి స్థిరపడిపోతుంది. జీవాత్మ కూడా భ్రాంతి. అది భ్రమకాదు. భ్రాంతి అంటే ఎక్కడ వుంది ఇప్పుడు? మనో బుద్ధుల మధ్యలో. ఇప్పుడు మనమందరం, జీవుడు జీవుడు జీవుడు అనేవాడు ఎక్కడున్నాడు ఇప్పుడు? మనోబుద్ధుల మధ్యలో వున్నాడు. అర్థమైందా అండీ ఇప్పడు. చూడండి ఆయన ఒక్క పదంలో ఇంత పెద్ద జీవన సారాన్ని ఇమిడ్చేశాడన్నమాట.

భ్రమాజన్య జ్ఞానం చేత నీవు జీవాత్మగా స్థిరపడిపోయావు. అని ఒక వాక్యం వేశాడు అక్కడ. అంటే ఇప్పుడు దానిని విచారణ చేయాలి అంటే, ఎలా విచారణ చేయాలంటే ఇలా చేయాలి. భ్రమ, భ్రాంతి, భయము. ఈ మూడు మనకు వున్నయా లేవా? వున్నాయి. శరీరం వుందా లేదా? వుంది. శరీరానికి భ్రమ వుందా? దానికి ఏ తెలివీ లేదు. పోనీ భ్రాంతి వుందా? ఆ తెలివీ లేదు. పోనీ భయం వుందా శరీరానికి? వుందా? ఉదాహరణ చెప్తా చూడండి. మీరు నిదురపోతున్నారండి. నిద్రపోతున్నప్పుడు పాము వుంది మీ ప్రక్కన. మీకు ఏమన్నా భయం కలిగిందా? ఎందుకు కలుగలేదు? శరీరం మీద తెలివి లేదు కాబట్టి. అంతేనా? మెలకువ వచ్చింది. చెయ్యి పక్కకు వేశాడు, స్పర్శజ్ఞానం చేత పని చేసింది. వెంటనే బుద్ధి గ్రహించిందా? గ్రహించలేదు. ఎందుకని? నిద్రకు వశుడవై వున్నావు. అప్పుడు ఇంకా సాంతం మెలకువలోకి రాలేదుగా. ఏదో వస్తువున్నదిగా గ్రహించావు. అది పాముగా గ్రహించలేదు. కాసేపట్లో ఏం తెలిసింది ఇప్పుడు? స్పర్శజ్ఞానం బుద్ధి ఇంద్రియాన్ని మేల్కొలిపింది. ఏమిటి ఇదోదే మెత్తగా వుంది, కదులుతోంది ఏమిటి? నీవు పడుకున్నప్పుడు నీ ప్రక్కన అటువంటి వస్తువు ఏమీ లేదే? అని బుద్ధిలో ఏం చేసిందండి? ఈ మేల్కొలుపు వచ్చింది. బుద్ధి అప్పుడు ఏం చేసింది వెంటనే? నువ్వు ముందు మేలుకో, ముందు ఏముందో చూడు అని అంది. చెప్పేదంతా బానే వుంది. నేను నీకు అదేంటో నిర్ణయించి చెప్పాలి అనంటే, ఈ ఒక్క స్పర్శజ్ఞానంతో నేను చెప్పలేను. ఏం కావాలి దానికి ఇప్పుడు? మరొక ఇంద్రియ సహాయం కావాలి. నువ్వు చూస్తావో, వింటావో ఏదో ఒకటి చేయి. జ్ఞానేంద్రియాలలో ఒకదానినే ఉపయోగించావు. నిర్ణయించగలదా? నిర్ణయించలేదు. రెండవదానిని ఉపయోగిస్తే, రెండు జ్ఞానేంద్రియాలు కలిసి కనుక పనిచేస్తే, నిర్ణయం చేయగలుగుతావు. ఏం చేశావు అప్పుడు? ఈ లోపల కళ్ళు విప్పేలోపలే చెవులకు ఏం వినపడింది? శబ్దం వినపడుతుందా? లేదా? ఆ శబ్దజ్ఞానం, ఈ స్పర్శజ్ఞానం కలిసి బుద్ధి ఇంద్రియం ఏం చేసిందండి? నిర్ణయం చేసేసింది. ఇదేదో తేడా వచ్చేసిందిరా బాబోయ్ అంది. అర్థమైందా? ఇప్పుడు కళ్ళు విప్పి చూడలేదు. కానీ నీకు ప్రాణభయం కలిగిందా లేదా? కలుగుతోందా? ఎలాగ? ఏమన్నా పాము కాటు వేసిందా? వెయ్యలేదు. అసలు పాము చూశారా? చూడలేదు. కానీ ఏం కలిగింది? ప్రాణభయం కలిగింది. అర్థమైందా ఇప్పుడు

మీకు? కాబట్టి ప్రాణభయం అంటే ఎక్కడుంటుందది? ప్రాణము, మనస్సు. బుద్ధి క్రమంగా మనస్సులోకి, ప్రాణంలోకి, శరీరంలోకి తనయొక్క జ్ఞానాన్ని ప్రసరింపజేయగానే క్రమంగా ఏమైపోయింది వెంటనే? దానిలో ఆ ప్రాణమనస్సుల సంధిలో ప్రాణభయం మేల్కొంది. అర్థమౌతుందా? అదే మనోబుద్ధుల సంధిలో ఏమి మేల్కొంది? భ్రాంతి మేల్కొంది. బుద్ధికి పైన భ్రమ. ఇలా వున్నది. నీ అంతఃకరణ చతుష్టయం. బుద్ధికి చిత్తానికి మధ్యలోనేమో భ్రమలు వున్నాయి. బుద్ధికి మనస్సుకి మధ్యలోనేమో భ్రాంతులున్నాయి. మనస్సుకి ప్రాణానికి మధ్యలోనేమో భయం వున్నది. ఇది సృష్టి ధర్మం. మీరు అనేక జంతులలో జన్మించి వాటిల్లో సంగ్రహించిన జ్ఞానంతో పాటుగా వచ్చిందిది. వట్టి జ్ఞానమే రాలేదు నీకు. ఆయా జంతువుల జీవశరీరాలలో నీవు పరిణామం చెందడం ద్వారా జ్ఞానంతో పాటు వీటిని కూడా సంగ్రహించావు. అర్థమైందా? వీటిని అక్కడ పోగొట్టుకో గలిగే అవకాశం వుందా? ఎందుకని లేదు? ఉత్తమమైనటు వంటి వివేకాన్ని కలిగించితే తప్ప, ఇవి మూడూ పోవు. ఆ వివేకం పొందడానికి కావలసిన బుద్ధి, ఆ జంతువులలో లేదు. అక్కడ మనస్సు వరకే వుంది. బుద్ధిలేదు. కాబట్టి మనస్సు వరకే కలిగినటువంటి జీవులన్నీ, ప్రాణమనస్సుల మధ్యలో వున్న భయాన్ని పోగొట్టుకోగలవా? పోగొట్టుకోలేవు. కాబట్టి ఏ జంతువుకైనా ప్రాణభయం సహజమై వున్నది. మనలో కూడా ప్రాణభయం పేరు మీద వున్నటు వంటి మరణ భయం రెండూ ఒకటే. ప్రాణభయం అన్నా మరణభయం అన్నా రెండూ ఒక్కటే. ఈ రెండూ కూడా నీకు ఎక్కడినుంచి సంక్రమించినాయి ఇప్పుడు? ఆ పూర్వ దేహాలనుంచి లభించిన జ్ఞానంతో పాటు, ఇది కూడా లభించింది. అర్థమైందా అండీ? కాబట్టి దీనిని అధిగమించాలి అంటే ఒకే ఒక మార్గం వుంది. ఏమిటి?

ప్రాణం నీ స్వాధీనం అవ్వాలి. (ఆ జంతులక్షణాలే ఇప్పుడు పనిచేస్తూన్నాయి) అవి పనిచేస్తూ వుంటాయి. అవ్వటానికి మనిషి శరీరం అయ్యావు. ఒక స్థూల శరీరమే మార్పు చెందిందండి. అర్థమైంది? అప్పుడు నాలుగు కాళ్ళ మీద నడిచేవాడు ఇప్పుడు రెండు కాళ్ళమీద నడుస్తున్నాడు. ఆ మార్పు వచ్చింది. కానీ లోపల వున్నటువంటి భయం గానీ, భ్రాంతి గాని, భ్రమలు గాని పోలేదు. పైనున్న భ్రాంతి భ్రమలేమో మనిషిగా పుడుతూ పోతూ సంపాదించినవి. భ్రాంతులు, భ్రమలు జంతువులకు వున్నాయా? లేవు. వాటికి ఏ

భ్రాంతి లేదు. వాటికి ఏ భ్రమ కూడా లేదు. ఎందుకని బుద్ధే లేదు కాబట్టి. అర్థమైందా అండి? అవి ఒక్క మనిషికే వున్నాయి. ఈ భ్రాంతులు భ్రమలు అనేవి మనిషికే వున్నాయి.

జంతువులు, మానవుల మధ్య భేదం ఏమిటంటే, జంతువలకి బుద్ధి అనే వికాసము లేదు కాబట్టి, వాటికి ప్రాణభయమే ఆఖరిదై వున్నది. మనకు కూడా అదే జంతువు శరీరాలలో జీవించినటువంటి జ్ఞాన ప్రభావంతోటి, అదే ప్రాణభయం మనకు కూడా సంక్రమించింది. బుద్ధిని ఆధారంగా చేసుకుని జీవించేవాడికి, ఈ భయాన్ని, ఆ భ్రాంతిని, ఆ భ్రమని అధిగమించే అవకాశం ఒక్క మానవుడికే వుంది. అందుకే వివేకచూడమణి మొట్టమొదటిలో ఎత్తుకునేటప్పుడే ఏం చెబుతున్నారు? 'జంతూనాం నరజన్మ దుర్లభం'. ఎందుకయ్యా? మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయము ఈ మూడు ఒక్క మానవుడికే సాధ్యము. అందులో మొదటిది ఏమిటి? మనుష్యత్వము. మనుష్యత్వము అంటే ఏముండాలి నీకు? మనసు వుండాలి. అంతే కదండి? నీవు ప్రధానంగా దేనిమీద ఆధారపడి జీవించాలి? మనస్సు మీద ఆధారపడి జీవించాలి. అప్పుడు మనిషివి అయ్యావు. ఎప్పుడైతే మనస్సు ఆధారంగా జీవించావో, అప్పుడు ప్రాణం నీ స్వాధీనం అవ్వాలనేగా అర్థం? శరీరం, ప్రాణం నీ స్వాధీనం అయినటువంటి, పరిస్థితిలో అవి వుంటే, నీవు ఎవరివి? మనిషివి. అదే శరీరానికి లొంగి వున్నావనుకోండి, అప్పుడేమయిపోయావు? జంతువువే. ప్రాణానికి లొంగి వున్నావనుకో, అప్పుడు కూడా జంతువువే. ఎప్పుడైతే మనస్సు నేనుగా వున్నావో, ఎప్పుడైతే నీకు శరీర ప్రాణ మనస్సులు స్వాధీనమయి వున్నాయో, అప్పుడు నీకు భయం పోతుంది.

భగవంతుడిని ఆశ్రయించడం వలన కలిగే మొదటి ఫలితం ఏమిటయ్యా అని అంటే, అభయం. అంటే భయం పోతుంది. ఏమిటా భయము? ప్రాణభయము. నేను పోతానేమో? భగవంతుడు ఏమి చెప్పాడు? ఒకటే మాట చెప్పాడు ఆయన. పోవడం గురించి ఆలోచించమాకు అసలు, నువ్వు ఆలోచించినంత మాత్రాన అది మారేది కాదు. మారుతుందా? ఏమీ మారదు. నువ్వు ఆలోచించినా, ఆలోచించకపోయినా దాని పని అది చేస్తుంది. నువ్వేం చేయాలి? నీకు ఆలోచించే శక్తి వుంది కాబట్టి, దాన్ని విచారణ చేసి భయం పోగొట్టుకో. నీకు విచారణ శీలత, వివేకము సంపాదించే శక్తి వుంది కాబట్టి, నీ

శరీర ప్రాణాలను స్వాధీనం చేసుకో. నీ బుద్ధిని ఉపయోగించి, నీ మనస్సును వుపయోగించి, నీ శరీరాన్ని నీ ప్రాణాన్ని స్వాధీనం చేసుకో.

స్వాధీనం చేసుకోవడం అంటే? (పనిముట్టుగా వాడటం) పనిముట్టుగా వాడాలి. ఇప్పుడు మనం పనిముట్టుగానే వాడుతున్నామా? ఎక్కడెక్కడైతే ఈ రెండిటిని నీవు పనిముట్టుగా వాడటం లేదో, అక్కడ నీకు భయం కలుగక తప్పదు. అర్థమైందా? బాత్‌రూంలో నీళ్ళు పోసి వున్నాయండి. కాళ్ళు జాగ్రత్తగా వేసి నడవాలా వద్దా? పూర్వజ్ఞానంలో బాత్ రూంలో జారిపడ్డ సంఘటన వుందే అనుకోండి, ఆ జాగ్రత్త ఏమౌతుంది? భయంతో కూడిన జాగ్రత్త అవుతుంది. మామూలుగా ప్రపంచంలో అందరూ జాగ్రత్తగానే నడుస్తారు. అజాగ్రత్తగా నడుస్తారా? నడువరు. కానీ పూర్వజ్ఞానంలో ఆ సంఘటనకు సంబంధించి, ఆ విషయానికి సంబంధించినటువంటి దుఃఖం వుందనుకోండి. అప్పుడేమయింది? అక్కడ దుఃఖమే ఇక్కడ భయంగా ప్రకటితమైంది. దాని చేత బాధించబడినటువంటి జ్ఞానమే ఇక్కడ భయంగా ప్రకటితమౌతుంది వర్తమానంలో. అర్థమైందా అండి?

ఉదాహరణ చెప్తా చూడండి. నువ్వు ఎప్పుడో ఒకప్పుడు ప్రయాణం చేసేటప్పుడు బస్సు మధ్యలో టైరు పంక్చర్ అయ్యి ఒక ప్రక్కకు పోయింది. అప్పుడు ఏదో చెట్టుకు కొట్టాడో లేక పక్కకు పోయిందో, ఏదో పక్కకు జారిపోవడమో, ఇప్పుడు అది ఎంతమందికి చెప్తావు? (మరల బస్సు ఎక్కినప్పుడల్లా గుర్తుకువస్తుంటుంది) నీకు గుర్తుకు రావడమే కాదు, నీ పక్కన వున్నవాళ్ళకు కూడా ఏం చెప్పావు? ఓరినీ బస్సు ఎక్కుతానంటావు మొన్న అలాగే లోయలోకి జారిపోయిందిరా బాబు. అరె! ఇప్పుడు వాడు బస్సు ఎక్కాలా? మానేయాలా? ఆలోచించండి. అర్థమైందా ఇప్పుడు మరి?

ఈ రకంగా నీ భయం నీ వర్తమానంలో వున్నటువంటి వివేకానికి, వివేకం ఎప్పుడూ వర్తమానం, వివేకం ఎప్పుడు ఎక్కడుంటుందండి. వర్తమానంలో వుంటుంది. భయం ఎక్కడినుంచి వచ్చింది? భూతకాలం వచ్చి వర్తమానం మీద ఆపాదించబడింది. వర్తమానంలో భయం వుండదు. ఎప్పుడూ ఎవరికీ కూడ. అప్పుడు భయపడుతున్నవారికి కూడా వివేకమే వుంటుంది. ఎందుకని? వాడిలో అది పనిచేస్తూవుంటుంది, దానిని అధిగమించే ప్రయత్నం లోన జరుగుతూ వుంటుంది. అదే వివేకం అంటే. (మరి జాగ్రత్త

తీసుకోవడం?) అనుభవ జ్ఞాన ప్రభావం చేత, దానిని అధిగమించే ప్రయత్నంలో భాగంగా జాగ్రత్త అన్నావు. అర్థమైందా అండి? దానిని చేయకుండా పక్కకు పెట్టేస్తే జాగ్రత్త అన్నావా? ఇప్పుడు మనం చాలా వాటిని ఏం చేశాము? భయపడే వాటిని అన్నిటిని మనం సాధ్యమైనంత వరకూ ఏం చేస్తాం? పక్కకు పెట్టేస్తాము. జీవితంలో వాటిని వాటికి స్థానం లేనివాటిక్రింద తొలగించేస్తాం. ఎందుకని? అయిపోయింది బాబూ, దానితో మనకు ఎందుకు నాయనా? అది మన వల్ల కాదు. వదిలేసేయ్. అంటున్నావా లేదా? మరిప్పుడు ఆ యా అంశాలలో నీకు భయం మిగిలిపోయిందిగా. మిగిలిపోలేదా? మిగిలిపోయింది. మరి ఆ భయం ఎలా పోతుంది? (మళ్ళీ ఆచరణలోకి వస్తే పోతుంది) ఎప్పుడోకప్పుడు దానిని మళ్ళీ ఆచరించాలి. ఆచరించి అధిగమించ వలసిందే. ఎప్పుడైనా ఒక్కటి గుర్తుపెట్టుకోండి. ఒక్క ప్రాణ భయమే, ఒక్క మరణ భయమే అన్ని భయాలుగా ప్రతిబింబిస్తూ వుంది.

ఆ ప్రాణభయం ఎక్కడినుంచి వచ్చిందయ్యా నీకు అని అంటే, ఆనందమయ కోశ ప్రభావం చేత వచ్చింది. ఈ భయం ఎక్కడినుంచి వచ్చిందండి? ఆనందమయ కోశ ప్రభావం చేత వచ్చింది. ఆనందమయ కోశ ప్రభావం అంటే, నిద్రావస్థయేనా? నిద్రావస్థేనా కాదా? (అవునండి గాఢనిద్ర) ఆ గాఢ నిద్రావస్థలో నువ్వు మునిగిపోయి ఎక్కడైతే వున్నావో, ఆ మునిగిపోయినటువంటి, ఎవరైతే వున్నాడో, వాడు ఎవడు? జీవుడు. జీవుడు. మునిగిపోయి వున్నవాడు ఎవడు? జీవుడు. సాక్షిగా మిగిల్తే? ప్రాజ్ఞుడు. ఆ సాక్షి పేరు ప్రాజ్ఞుడు. విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడు అని ఏ మూడు అవస్థలకు సాక్షిత్వాన్ని నిర్ణయిస్తున్నామో, అతను ఎవరు? ఆ మూడు అవస్థలుకు సాక్షి. అర్థమైందా అండి?

ఆ సాక్షి ఏమై వున్నాడట? సాపేక్ష సాక్షి. జీవభావాన్ని, జీవ శరీరాన్ని ఆ జీవునికి సంబంధించినటువంటి ప్రాణాన్ని, మనస్సుని దానికి సంబంధించిన అనుభవాలని, వీటన్నింటితో కలిపి నిర్ణయించబడిన సాక్షి. అర్థమైందా అండి? అందుకని ఏమంటున్నారు? జీవస్థానత్రయంగా పెట్టేశాడు వేదాంతంలో దానిని. వాళ్ళని చెప్పడానికి విశ్వుడని, తైజశుడని, ప్రాజ్ఞుడని చెప్పినా వీళ్ళందరూ ప్రత్యగాత్మ క్రిందే కానీ, పైన కాదు. వీళ్ళందరూ జీవుడికిందే లెక్కకట్టేశారు. ఎక్కడికి వెళ్ళేటప్పటికి? సాంతం పైకి వెళ్ళేటప్పటికి. పరమాత్మ విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృత పరమాత్మ అనే నాలుగు

స్థితులతో పోల్చి చూసినప్పుడు ఈ నాలుగు ఏమైనాయి? జీవతను సాక్షులు అయినాయి. ఆ పైవి ఏమైనాయి? ఈశ్వర తను సాక్షులు అయినాయి. కాబట్టి అక్కడిదాకా వెళ్ళాలి అంటే నీకు ఏమి సాధించబడి వుండాలి? (ఈ జీవతనువుల సాక్షి) ఆ సాక్షిత్వం వచ్చి వుండాలి. ఇప్పుడు నీకు ఈ విశ్వుడు అనే సాక్షి దగ్గర అడ్డం ఏమి వచ్చేసింది? ఈ భయం వచ్చేసింది. అర్థమైందా అండి?

మనలో వున్నటువంటి నేనుకు భయం వుందా అసలు? తల్లిగర్భంలో వున్న నేనుకు భయం వుందా? లేదు. పుట్టిన పిల్లవాడికి భయం వుందా? లేదు. అయిదు సంవత్సరాల వరకు భయం వుందా? లేదు. మరి అప్పటి వరకూ లేని భయం ఎక్కడినుంచి వచ్చింది నీకు? అంటే ప్రాణ మనస్సుల యొక్క సంఘాతంలో, ఆ రెండూ పోటీపడి కలిసి పనిచేసినప్పుడు వచ్చింది. నీవు శరీరం, ప్రాణం, మనస్సులను ఒక సూత్రం మీదకు తెచ్చే ప్రయత్నం అనే యోగబలంలో యోగ విద్యా విధానంలో ఆ సాధనలో ఏం చేశావు ఇప్పుడు, ఈ భయాన్ని అధిగమించేశావు. ఈ సూత్రం, ఒక ఏక సూత్రంగా తేవడానికి, ఆత్మసంయమ యోగం కూడా వుపయోగం. ప్రాణాయామాది అంటే యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులు అనే అష్టాంగ యోగం ఎలా వుపయోగపడుతుందో, ఈ ఎనిమిది అష్టాంగ యోగాలని, ఒకే ఆత్మ సంయమ యోగంలో కూడా చేయవచ్చు. అంటే ఆత్మవిచారణనే ఆశ్రయం చేసుకున్నవాళ్ళు సరాసరి ఆత్మసంయమ యోగానికి పూనుకుంటాడు. అష్టాంగ యోగం నుంచి ప్రయత్నం చేసేవాడైనా సరే, ప్రత్యాహార ధారణల మధ్యలో ఆత్మసంయమ యోగాన్ని అభ్యసించాలి. కానీ సాధరణంగా ఈ అష్టాంగ యోగం యమము, నియమము, ఆసనమనేటటువంటి బాహ్యసాధనల వరకు పరిమితమై ప్రాణాయామం అనే సూక్ష్మంలోకి మారగానే శరీరం ప్రాణం స్వాధీనమైపోయినాయి. ఇంక అప్పుడు భయం వుండదండి వాడికి. ఈ భయాన్ని అధిగమించేసేటప్పటికే సమత్వం వచ్చేస్తుంది. ఎప్పుడైతే ఈ భయాన్ని అధిగమించాడో ఆ సమత్వం వచ్చేస్తుందండి. ఈ సమత్వం వచ్చేసేటప్పటికి ఇంక ఆత్మసంయమ యోగం అనేటటువంటి ప్రత్యాహార ధారణా స్థితులని స్వీకరించడన్నమాట ఇక. వాటితో అవసరం లేదు ఇంక. ఇది వున్నంత సేపే ఈ క్రిందవన్నీ పనిచేస్తూ వుంటాయి. అందుకని ఎక్కడికక్కడ గురువు అవసరం వస్తూ

వుంటుంది అక్కడ కూడా. ఎందుకని అంటే, ఆ లక్ష్యం అందుకోవాలి ఎప్పుడూ కూడా. లక్ష్యాన్ని అందుకునే దిశగానే ప్రయాణం చేయాలి. ఆత్మ సంయమయోగం అనేటటువంటి ఆత్మ విచారణ, శరీర ప్రాణ మనో బుద్ధులను ఏకసూత్రం చేయడం ఈ రెండూ కలిపితే ఆత్మ సంయమయోగం అవుతుంది. ఇది చేసేటప్పుడు విచారణలో నువ్వు ఎలా అధిగమిస్తున్నావు అంటే, నేను ఎవరు? నేను మనస్సునా? మనస్సుకు పుట్టుక వున్నదా? మనస్సుకి పెరుగుదల వున్నదా? మనస్సుకు మరణం వున్నదా? ఎవరైనా చెప్పండి? మనస్సు పుట్టిందా? అర్థమైందా అండీ!

ఎందుకు ఈ గొడవంతా పడుతున్నాము అని అంటే, ఎక్కడ మొదలు పెట్టాము? భ్రమాజన్యజ్ఞానం దాకా వెళ్ళాలిప్పుడు మనం. ఈ అష్టావక్రగీతలో వున్నటు వంటి ప్రధానమైన చిక్కు ఇదే. ఏమిటంటే పంచభ్రమలు నిరూపించబడాలి. పంచభ్రమలు నివర్తించబడాలి. అష్టావక్రగీత వల్ల పరమప్రయోజనం ఏమిటంటే, పంచభ్రమలు నిరూపించబడాలి, పంచభ్రమలు నివర్తించబడాలి. దాని ఫలితంగా నీవే భగవంతునిగా మిగిలిపోతావు. అదే అష్టావక్రగీత యొక్క పరమప్రయోజనము. కాబట్టి ఆయన మొదటి పాఠం లోనే ఏమి ఎత్తుకున్నాడు? భ్రమాజన్యజ్ఞానం అని ఎత్తుకున్నాడు. నీవు నేనుజీవుడను అనేటటువంటి ఉనికి నీకు ఎక్కడినుంచి లభించిందయ్యా? అంటే, భ్రమ వల్ల లభించింది. ఏమిటా మొదటి భ్రమ. జీవేశ్వర భిన్నో ప్రథమ భ్రమః జీవుడు ఈశ్వరుడు వేరే. అనేది మొదటి భ్రమ.

జీవేశ్వర భిన్నో ప్రథమ భ్రమః జీవుడు ఈశ్వరుడు వేరే. అనేది మొదటి భ్రమ. ఈ భ్రమాజన్య జ్ఞానం చేత నీవు జీవాత్మవు అయినావు. జీవుడే నేను అనుకుంటున్నావు. ఆత్మ అని వున్న చోటల్లా నేను పెట్టుకోండి. ఎక్కడ వచ్చినా సరే. ఆత్మ అన్న ప్రతి చోటా నేను. జీవాత్మ అంటే జీవుడే నేను. ఆ భ్రమాజన్య జ్ఞానం చేత, జీవుడే నేనుగా వున్నావు. జీవుడే నేను అంటే ఏమిటి? వాడికి ఏమున్నాయట? భయము, భ్రాంతి వున్నాయి. ఈ రెండూ వున్నవాడు జీవుడు. ఆ భ్రమచేత ఈ రెండూ కలిగినాయి. అర్థమైందా అండీ! భ్రాంతి అంటే ఏమిటి? ఇందాక చెప్పుకున్నాము. ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా. భ్రమ అంటే ఏమిటి? లేనిది వున్నట్లుగా. అంటే అర్థమైందా మీకిప్పుడు? భ్రాంతి అంటే ఏమిటి? ఉన్నది

లేనట్లుగా. ఈశ్వరుడు ఉన్నాడా లేడా? ప్రపంచంలో ఎవరినైనా అడగండి ఈ ప్రశ్న. భగవంతుడు వున్నాడా లేడా? (వున్నాడు). మీకు కనబడుతున్నాడా? లేడండి. అర్థమైందా ఇప్పుడు మీకు. ఒప్పుకుంటున్నావు. కానీ తెలియడం లేదు. కారణం ఏమిటంటే, అయ్యా దీనికి కారణం భ్రాంతి. దీనికి కారణం ఏమిటంటే భ్రాంతి. నువ్వు ఒప్పుకుంటున్నావా లేదా? అనుభవజ్ఞానంలో ఈశ్వరుడు వున్నాడని ఒప్పుకుంటున్నావు. కానీ, ఆ అనుభవజ్ఞానం భ్రమాజన్యజ్ఞానం అవ్వడం చేత స్థిరంగా లేదు. ఆ భ్రాంతి వలన వచ్చిన చిక్కు ఏమిటంటే, లభించిన జ్ఞానం స్థిరంగా లేదు. నువ్వు చిన్నప్పటి నుంచి పూజలు, జపాలు, తపాలు చేశావండి. వున్నాడని చేశావా? లేడని చేశావా? వున్నాడనే చేశావు. వున్నాడా అని గట్టిగా అడిగితే ఏం చెప్పావు? (తెలియదు, చూడలేదు) సమాధానం మనవల్ల కావడం లేదు. స్పష్టత లేదన్నమాట అక్కడ. కారణం ఏమిటంటే, నీవు చేసిన పనులన్నీ భ్రాంతితో చేశావు. అర్థమైందా అండీ!

అందుకే నేను ఉదయం ఏమడిగాను? వినాయక చవితి ఎందుకు చేయాలి? ఈ ప్రశ్న వేశారు అనుకోండి, ఏమంటున్నారు మీరు? వాడిలో నాస్తికుడు వున్నాడు, వాడు అలానే చెప్తాడు. వాడిని ఆశ్రయించవద్దు. పెద్దవాళ్ళు చెప్పారు. వినాయక చవితి చేయమన్నారు. చెయ్యి. చేస్తే ఏమైంది? ఏం ప్రయోజనం కలిగింది? ఆ గణనాథుడు నీ యందు నువ్వు దర్శిండం కోసం అని పెట్టామండి ఈ గొడవంతా. ఆ దైవాన్ని ఆ అధిష్టాన దేవతని, నీయందు నువ్వు దర్శించాలి. ఎప్పుడు దర్శిస్తావు? శరీరానికి బయట వుంటే దర్శిస్తావా? శరీరానికి బయట వుంటే ఎప్పటికీ దర్శించలేవు. అంటే బయటనుంచి విషయాలను సంగ్రహించినంత వరకూ నీకు అదేమీ నిష్ప్రయోజనం. ఏం ప్రయోజనం లేదు. బయట నుంచి విషయాలు అంటే ఏమిటి? శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. నీ బయట ప్రకృతిలో వున్నాయి. వాటిని నీవు నీ ఇంద్రియాల ద్వారా గ్రహించి, సుఖాన్నో దుఃఖాన్నో అనుభవిస్తున్నావు. ఈ స్థితిలో నీవు వున్నంత వరకూ ఇవి నీకేమీ ఉపయోగపడవు. కాబట్టి ఇప్పుడు ఏం చేయాలట? నీ ఇంద్రియాలనీ, నీ బయట నుంచీ నీకు లభిస్తున్నటువంటి శబ్ద స్పర్శ రూప రస గంధాలనే ఐదు విషయాలలో సుఖాన్ని, దుఃఖాన్ని అపేక్షించనివ్వకుండా నిలపగలిగితే, నిగ్రహించ గలిగితే అప్పుడేమౌతాయి అవి? ఏ మనసు ప్రభావం చేతైతే అవి బయటకి వెళ్తున్నాయో, అవి తిరిగి ఎందులోకి

కలిసిపోతాయి? మనసులోనే కలిసిపోతాయి. ఎందుకని? ఈ ఇంద్రియాలన్నీ ఆ మనోరూపమే కాబట్టి. మనస్సే ఇన్ని ఇంద్రియాలుగా వర్తిస్తోంది. కన్ను ద్వారా చూస్తున్నది ఎవరు? మనసే. చెవి ద్వారా వింటున్నది? మనసే. అర్థమైందా అండీ! రసనేంద్రియము ద్వారా రుచి చూస్తున్నది? మనసే. ఈ అన్నింటి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాల రూపాలు అన్నీ ఎవరివి? మనసే. లేకపోతే శరీరం నీ ఆకృతి ఎట్లా ధరించింది? ధరించగలుగుతుందా? ధరించలేదుగా. ఆ మనసు యొక్క ప్రేరణ ప్రభావం చేతనే తల్లి గర్భంలో ఈ అవయవాల ఆకృతులన్నీ ఏర్పడుతున్నాయి. అర్థమైందా అండీ! ఆ మనోరూపమే ఇక్కడ స్థూల శరీర రూపంలో వ్యక్తమైంది. అర్థమైందా? నీ గురించి నీకు నీ శరీరాన్ని చూస్తే బాగా తెలుసా? నీ మనోరూపం నీకు బాగా తెలుసా? (మనోరూపమే బాగా తెలుసు) ఆలోచించండి. ఎవరికి వాళ్ళకి వాళ్ళ గురించి బాగా తెలుసు అంటే ఏమి తెలుసు? చూడండి. నీ శరీరాన్ని చూసి నీవు నేను అనుకుంటున్నావా? నీ మనసుని చూసి నేను అనుకుంటున్నావా? ఈ రెండింటిలో ఏది? చూడండి. ఎవరికి వాళ్ళకి మీ సమాధానం మీ దగ్గర వుంది. ప్రశ్న ఒక్కటే. అర్థమైందా అండీ! కానీ నువ్వు వేదాంతం ఏం చేబుతోంది? శరీరము నువ్వు కాదు. ప్రాణము నువ్వు కాదు. మనస్సు నువ్వు కాదు. ఈ గోలంతా నిర్ణయం చేసే బుద్ధి కూడా నువ్వు కాదు. అంటోంది. చూడండి ఎక్కడికి పెట్టిందో తీసుకువెళ్ళి. ఎందుకనిట? శరీరమే నువ్వు అన్నావా? నీకు మరణ భయం తప్పదు. మనసే నువ్వు అన్నావా? నీకు భ్రాంతి వలన కలిగిన అజ్ఞానము తప్పదు. బుద్ధే నువ్వు అన్నావా? జీవుడు ఈశ్వరుడు వేరే వేరే అనే భ్రమవలన కలిగిన అజ్ఞానం తప్పదు. ఎందుకు నువ్వు 'నేను ఆత్మ' అనుకోవాలి? అంటే మీ దగ్గర సరైన సమాధానం వుందా? లేదన్నమాట. ఇట్లా ఆలోచిస్తే ఇప్పుడు సరైన సమాధానం వచ్చిందా? నీవెందుకు అసలు ఆత్మస్వరూపుడనని అనుకోవాలి అసలు? ఇప్పడు ఏమి నష్టం వచ్చింది? అంటే ఇదిగో ఇదయ్యా నష్టం. నువ్వు శరీరమే అనుకో! నీకు ఫలితం ఏమి లభిస్తుంది? మరణభయం. దానిని తప్పించలేరు ఎవరు. నువ్వు శరీరంగా వున్నంతకాలం, నీకు మరణభయం తప్పదు. నీవు ప్రాణంగా వున్నంతకాలం, ఏం తప్పదు? భయము, భ్రాంతి. అటుఇటుగా పనిచేస్తూ వుంటుందన్నమాట. మనసుగా నీవు వున్నావు. భ్రాంతి తప్పదు. ఆ భ్రాంతి వలన కలిగిన అజ్ఞానం తప్పదు. అందుకేగా మనవాళ్ళు ఏం చెప్తూవుంటారు? తాడు పాము.

అదేమిటి? భ్రమా? భ్రాంతా? తాడు పాము. రెండు ప్రక్కలా పనికి వస్తుంది అది. అటు భ్రమకి పనికి వస్తుంది, ఇటు భ్రాంతికీ పనికి వస్తుంది. అందుకే దానిని ఎక్కువగా వాడుతుంటారండి. దానికి కారణం అదన్నమాట. ఆ రజ్జుసర్ప భ్రాంతి అనటం ఏమో రజ్జుసర్పభ్రాంతి అంటారు. (ఉన్నది లేనట్లు, లేనిది వున్నట్లు) రెండూ వున్నాయి అందులో. అర్థమైందా అండీ! తెలిస్తేనేమో ఒక్క తీరుగా. తెలియకపోతే మరొక తీరుగా. రెండు రకాలుగానూ పనికి వస్తుందన్నమాట. అర్థమైందా? మరణం వుందా? ఎవరైనా చెప్పండి. మరణం వుందా? లేదా? (వున్నది కానీ తెలియటం లేదు కనుక లేనిదౌతుంది) మరణం వుందా? లేదా? ఎవరికి వాళ్ళు చెప్పమనండి చూద్దాము. మరణము వుందా లేదా? చెప్పలేవుగా. వుందని చెప్పాలి అంటే నువ్వు అనుభవించినవాడివి అయ్యివుండాలి. అనుభవిస్తే నువ్వు వుండటం లేదు. లేదు అందామా? కళ్ళముందు కనపడుతోంది కదా! వాస్తవిక జ్ఞానంలో, అనుభవ జ్ఞానంలో కనపడుతోంది కదా! నీవు అనుభవించడం లేదు, కానీ మనోబుద్ధుల ద్వారా ఇతరులు అనుభవించేదానిని నువ్వు గ్రహించ గలుగుతున్నావు. అంటే నీ మనోబుద్ధులకి ఇతరలు అనుభవించేదానిని గ్రహించగలిగే శక్తి వుందా లేదా? ఇప్పుడు? వుందిగా. మరి మాటలతో చెప్పకుండా ఇతరుల మనోబుద్ధులలో ఏం జరుగుతుందో ఎందుకు తెలుసుకోలేక పోతున్నావు? తెలుసుకోగలగాలిగా. తెలుసుకో గలుగుతున్నావా? కొన్ని చెప్పినా తెలుసుకోలేక పోతున్నావు. కొన్నే తెలుసుకోగలుగుతున్నావు. ఒకటో, రెండో, మూడో తెలుసుకోగలుగుతున్నావు. ఆ పరిధి దాటితే పనిచేయడం లేదు. కారణం? నువ్వు మనసుగా వున్నంత కాలం, దానిని అధిగమించలేవు. అర్థమైందా అండి? అందుకని ఇదంతా బాగా అధ్యయనం చేసి, ఆత్మ సంయమ యోగంతో ఒకే ఒక పరిష్కారాన్ని సూచించాడు. బాబూ! నువ్వు ఈ గొడవంతా ఎంత పెట్టుకున్నా, (ఇందాక ఆ అబ్బాయి ఏమన్నా తేలాడా?) ఇందాక విచారణ చేశామండి. ఆ విచారణ ఫలితం ఏమన్నా తేలిందా? ఎందుకని తేలలేదు? ప్రాణం, మనసు, బుద్ధి, శరీరం. ప్రాణం, మనసు, బుద్ధి, శరీరం ఇక్కడే తన్నుకుంటూ వుంటావు ఎంతసేపూ కూడా. ఆ బుద్ధి దాటి అవతలకి వెళ్ళలేదన్నమాట అదిక. అర్థమైందా అండీ!

అప్పుడేమి చెప్పారు? కాసేపు నీ గోల ఆపు. నేను చెప్పింది చేయి. నేను చెప్పింది చేస్తే, దీనిని అధిగమించే శక్తి వస్తుంది. డాక్టర్ ఏం చెప్పాడంట ఇప్పుడు? నీ అనారోగ్యం అంతా నువ్వు ఏకరువు పెట్టావండి. డాక్టర్ ఏం చేశాడు? అంతా విని చూడు బాబు, నీకు శక్తి లేకపోవడం వల్ల నీకు అనారోగ్యం వచ్చింది. శక్తి వుంటే, దానిని ఎదురించగలిగే శక్తి వుంటే, నీకు అనారోగ్యం రాదు. ఇంతే కదా! కాబట్టి నేనొక మార్గం చెప్తాను. అట్లా నువ్వు ఆహారం తీసుకుని, మందు వేసుకుంటే, నీకు ముందు శక్తి వస్తుంది. శక్తి వస్తే ఆరోగ్యం దానంతట అదే కుదుట పడుతుంది. ఇది సరైన విధానం. Patient ఏమన్నాడు? శక్తి రావడానికి చాలా late అవుతుందండి. చాలా time పడుతుందది. అది వద్దు నాకు. ముందు అనారోగ్యం తగ్గించండి. ఇప్పుడు మనపద్ధతి ఇదన్నమాట. ఏమండీ! సమయం పట్టినా పర్వాలేదు. ప్రమాదం లేదు. నీకు వచ్చిన అనారోగ్యం వల్ల కొత్తగా వచ్చి పడిపోయిన ప్రమాదం ఏమైనా వుందా? ఏమీ లేదు. ఎన్నిసార్లు రాలేదు? ఎన్నిసార్లు పోలేదు? అలాగే పోతుంది ఇది కూడా. అసలు ఇన్నిసార్లు ఎందుకు వస్తోంది? అది ఆలోచించాలి మనం. ఔనా కాదా? అంటున్నాడా లేదా? డాక్టరు. మనం కూడా ఆలోచించండి. మనకు కూడా ఎన్నిసార్లు కలుగుతుందండి? ఈ భయము. ఆ భ్రాంతి. ఆ భ్రమ. మనలో మనో కల్పితాలేనా ఇవన్నీ? మరి ఇన్నిసార్లు కలుగుతూవున్నాకూడా దీనిని అధిగమించే శక్తిని పొందాలని మనకు ఎందుకు స్ఫురించడం లేదు? ఎంతసేపూ దీనిని తాత్కాలికంగా పరిష్కరించే ప్రయత్నమే ఎందుకు చేస్తున్నావు? జ్వరం వచ్చింది బిళ్ళ వేసుకున్నావు తగ్గిపోయింది. వదిలేశావు దానిని. ఇక్కడ ఎలా వున్నావో స్థూలంలో, సూక్ష్మం అయినటువంటి మనో కల్పితంలో కూడా అదే తీరుగా ప్రవర్తించావు. ఏమైంది దానివల్ల? అశాశ్వత అజ్ఞానం అలానే వుంది. నువ్వు శాశ్వత జ్ఞాన స్వరూపుడివై వుండి, ఎలా ప్రవర్తిస్తున్నావు? అజ్ఞానంతో ప్రవర్తిస్తున్నావు. నీ అజ్ఞానానికి కారణం ఏమిటయ్యా? నీ కార్యములన్నీ అజ్ఞానమే. కారణం ఏమిటీ అంటే, కారణ స్థానంలో ఈ భ్రాంతి, ఆ భ్రమ వున్నాయి. కారణ స్థానంలో ఏమి వున్నాయండీ? భ్రాంతి, భ్రమ. అసలు కార్య కారణ వివేకం ఏం చెబుతోంది? సర్వకారణ మీశ్వరం. అన్నింటికీ కారణం ఎవరు? ఈశ్వరుడు అని చెబుతోంది. కానీ మరి నీ అజ్ఞానికి కారణం కూడా ఈశ్వరుడేనా? నీ అజ్ఞానాన్ని నువ్వే సృష్టించుకున్నావా? చూడండి. ఎవరైనా ఒప్పుకుంటారా? నాకు నేనే అజ్ఞానాన్ని

సృష్టించుకున్నానండీ అంటే ఒప్పుకుంటారా? ఒప్పుకోరు కదా! ఆ ఒప్పుకోక పోవడమే అతి తెలివి. అంటే బుద్ధి యొక్క విపరిణామం అన్నమాట. పరిణామం కాదు విపరిణామం. ఎందుకని చెబుతున్నాడట? నువ్వు జంతువు శరీరాల నుంచి తెచ్చుకున్నది ప్రాణభయం ఒక్కటే. భ్రాంతి, భ్రమలు నీకు రాలేదు. ఈ భ్రాంతి, భ్రమలు అనేవి నీకు ఎక్కడినుంచి ఉద్భవించినాయయ్యా? అంటే, మానవదేహంలో నువ్వు అనేకసార్లు పుట్టి పోయేటప్పుడు, నీ మనోబుద్ధుల యొక్క అభ్యాసబలం చేత వచ్చినాయి. అక్కడ ఏముందట? వివేకం లేని అభ్యాసబలం వుందట. పెద్ద చిక్కు ఇదే. వివేకంతో కూడిన అభ్యాసబలం వుంటేనేమో అది జ్ఞానానికి దారితీస్తుంది. వివేకం లేనటువంటి అభ్యాసబలం చేత, అజ్ఞానం, భ్రాంతి, భ్రమ కలిగినాయి. ఈ అజ్ఞానానికి మరొక పేరు ఏమిటంటే, భ్రమాజన్యజ్ఞానం. అష్టావక్రులు భ్రమాజన్య జ్ఞానం అనటం వెనుక ఉద్దేశ్యం ఏమిటంటే, నీవు స్వతఃసిద్ధంగా జ్ఞానస్వరూపుడవు. వెలుగులో చీకటికి స్థానం వుందా? లేదుగా. అజ్ఞానం అనటానికి వీలుకాదు అక్కడ. నీవు అజ్ఞానివి అనటానికి మనిషికి వీలుకాదు. ఏ మనిషిని నీవు అజ్ఞానివి అనటానికి అసలు వీలుకాదు. ఏ జీవిని నువ్వు అజ్ఞానివి అనటానికి వీలు కాదు. ఎందుకనిట? అది స్వతఃసిద్ధముగా జ్ఞానము అయివున్నది. వస్తుతః నువ్వు జ్ఞానస్వరూపుడవే.

ఏం జరిగిందని ఇప్పుడు ఇంతకీ? మనో బుద్ధుల సంఘాతం చేత నీ వివేకం కోల్పోయావు అంతే. ఆ వివేకం స్థానంలో ఈ భ్రాంతి, భ్రమ వచ్చి కూర్చున్నాయి. ఆ వివేకం స్థానంలో భ్రాంతి, భ్రమ వచ్చి కూర్చున్నాయి. వీటిని అభ్యాసంతో ఆచరించడం వల్ల, వివేకం లేకుండా ఆచరించడం వల్ల, ఇందులోనే స్థిరపడిపోయావు. స్థిరపడిపోయి, నీకు సింహం అనే జ్ఞానం పూర్తిగా పోయి, మేకగానే వుండి పోయావు. కారణం ఏమిటట? మేకలతో కలిసి జీవించడం వల్ల, తాను సింహం అనే జ్ఞానం లేకుండా పోయింది. ఇది కూడా మేకలతో కలిసి పచ్చగడ్డే మేస్తుంది. ఇది కూడా అక్కడ సింహం అరిస్తే, తాను సింహం అయివుండి కూడా, మేకలతో పాటు పారిపోతోంది. ఇలా పోల్చాడు దానిని.

ఈ భ్రమాజన్యజ్ఞానం అంటే ఏమిటంటే, నువ్వు సింహమే. కానీ మనోబుద్ధులనేటటువంటి మేకలతో కలిసి సంచరించడం వల్ల, నీకు ఆత్మ స్వరూపం అనేటటువంటి సింహ హృదయాన్ని, సింహజ్ఞానాన్ని ఆ యథార్థజ్ఞానం మరుపుకు

వచ్చేసి, నీవు కూడా మేకల వలెనే ప్రవర్తిస్తున్నావు. ఆ ఇంద్రియాల వలెనే ప్రవర్తిస్తున్నావు. ఇంద్రియాలకు యజమానివి అనేటటువంటి జ్ఞానం పోయింది. అనుమతి ఇచ్చేటటువంటి 'అనుమంత' నీ స్థానం పేరు ఏమిటండి? అనుమంత. అంటే నువ్వు అనుమతిస్తేనే ఇంద్రియాలు ఉత్పన్నం అవుతున్నాయి అసలు. నువ్వు లేకుండా ఇంద్రియాలు ఉత్పన్నమయినాయా? సాధ్యమే కాదు. ఈశ్వరుడు లేకుండా సృష్టి అయ్యిందా? అసాధ్యం. ఎందుకని? సర్వకారణమీశ్వరం. ఈ సృష్టి మొత్తానికి కారణ స్థితిలో ఈశ్వరుడు ఉన్నాడు. ఉపాదాన కారణంగా కానీ, వివర్త కారణంగా కానీ. ఆ కారణంలో అనేక రకాలున్నాయి. అది అక్కడికి వెళ్ళినాక మాట్లాడుకుందాము. జీవపద్ధతిగా మాట్లాడినప్పుడు శరీర, ప్రాణ, మనోబుద్ధులనే నాల్గింటి సంఘాతం చేత, నీవు భయానికి, భ్రాంతికి, భ్రమకి లోనవుతున్నావు. వీటివల్ల ఈ అభ్యాసబలంవల్ల నీకు లభించినదంతా భ్రమాజన్యజ్ఞానం. దీనికి ఒకటే రాజౌషధం. ఇట్లా ఒక్కొక్కటీ తీస్తే అవుతుందా ఎప్పటికైనా? పుట్టింది మొదలు, పోయే వరకూ పరుచుకు పోయినటువంటి దీనిని ఒక్కొక్క దారం తీద్దామనుకోండి? ఎప్పటికి అవుతుంది? ఇది ఎప్పటికీ అవ్వదు. పైగా నువ్వు అక్కడ తీస్తూ వుంటే, ఎన్ని అల్లుతుందండీ మళ్ళా పక్కన? ఒకటి తీస్తే పది అల్లుతూ వుంటుంది మళ్ళా పక్కన్నుంచి. ఒక పక్కనుంచీ తీస్తూ వుంటావు, మరో పక్కనుంచి అల్లుకుంటూ వచ్చేస్తుంది. మనోబుద్ధులు. కాబట్టి ఏం చేయమన్నాడు? ఒక రాజౌషధం ఇవ్వవయ్యా! తిరుగులేనటువంటి ఔషధం. ఏమిటయ్యా అంటే, నేను చెబుతున్నానని నమ్ము కాసేపు. నీకు తెలియదు. అనుభవ జ్ఞానం వున్నటువంటి మహర్షి, గురువు చెప్పాడని, నేను ఆత్మస్వరూపుడు అనే రాజౌషధం వెయ్యి దానికి. నీ బుద్ధి ఏం సమాధానం చెప్పింది? నాకు దానికి సంబంధించినటువంటి తెలివి నా దగ్గర ఇక్కడ ఏమీ లేదు. నేను ఆత్మ స్వరూపుడవు అనంగానే నీ బుద్ధి ఏమన్నా సహకరించిందా? ఏమన్నా అందించిందా? పూర్వజ్ఞానాన్ని ఏమన్నా అందించిందా? silent. నాకు చేతకాదు. నువ్వు అడిగినా దానికి సంబంధించిన సమాచారం, నిర్ణయం నా దగ్గర ఏమీ లేదు. మనసు – దాని సంగతి అసలు నాకు ఏమాత్రం తెలియదు. బయటకు చూడమంటే చూస్తా గానీ, దీని సంగతి నువ్వు అడిగితే మాత్రం నాకు తెలియదు. ఇది కూడా ఏమైపోయింది అప్పుడు? silent అయిపోయింది. ఇక ప్రాణాన్ని అడిగావు. నేను ఆత్మ

స్వరూపుడు నువ్వు ఏమన్నా చెప్తావా? యంత్రం వలె ఒక పరిమితి మేరకు కొట్టుకోవడమే నా పని. ప్రాణం పని ఏమిటండీ? ఒక యంత్రం ఎలా పైకి, క్రిందకి కొట్టుకుంటుందో అలా కొట్టుకోవడమే నాపని. ఇంతకు మించి ఎక్కువ అడిగితే, నా దగ్గర ఏమీ లేదు. వుందా? చెప్పండి? ఏమీ లేదుగా. ఆ ప్రాణం ఏమి చేస్తోంది? ఒక యంత్రంలో ఎలా కొట్టుకుంటుందో అలా ఈ యంత్రంలో కొట్టుకుంటుంది పైకీ కిందకి. ఇంతే దాని పని. పోనీ ఇంకొంచెం కిందకి దిగావు. ఏమండీ శరీరం గారు మీరన్నా చెప్పండి. 'నేను ఆత్మస్వరూడు' అనే దాని గురించి మీరు ఏమన్నా చెప్పండి. ఊరక పడి వుండడం తప్ప నేను చేసేది ఏమీ లేదు నాయనా! నేను చెప్పేదీ లేదు, చేసేదీ లేదు. దీనికి చేసేది కూడా అదే. ప్రాణానికి చేసేది వుంది. ప్రాణానికేమో చేసే పని వుంది. శరీరానికి పడి వుండటమే దీని పని. అంటే ప్రాణ చైతన్యం కలిస్తేనే తప్ప ఇది ఏమీ చేయలేదు. ప్రాణాన్ని అడిగితే ప్రాణం ఏం చెప్పింది? నేను మార్పులేకుండా పైకీ క్రిందకి ఒక్కతీరుగా కొట్టుకోవడం ఒక్కటే నా పని. నువ్వు ప్రశ్నలు వేస్తే సమాధానం చెప్పే పని నాది కాదు. నాకు ఆ తెలివి లేదు. నాకు ఆ శక్తి లేదు. అంది. తన అశక్తత వ్యక్తం చేసింది. మనసు దగ్గరకు వెళ్ళావు మళ్ళా. ఆ రెండూ అశక్తం అంటున్నాయి. నాకు దీనికి సమాధానం చెప్పు. అని అడిగింది. ఒకపని చేయి. నేను అంతా చూపెడుతా. నా దగ్గర వున్నవన్నీ చూపెడుతా. ఇవి అవునో కాదో చూసుకో నువ్వే. మనసు ఏం చేయగలుగుతుందండీ? నా దగ్గర చాలా సమాచారం వుంది. ఈ జగత్తులో నేను చూసింది, విన్నది అంతా నీకు నీ ఎదురుగుండా పరుస్తాను. నీకు దేనితోనైనా సరిపోతే అది తీసుకో. అంతకు మించి నేను చేయగలిగింది ఏమీ లేదు. అంది. ఏం చేశావు అప్పుడు? మనసు చూపెట్టినవన్నీ శబ్ద స్పర్శ రూప రస గంధ నిర్ణయాలే కదా! వేరే ఏమన్నా వున్నాయా? లేవుగా. మనసు ఆ ఐదు విషయాలతోటే ఇదంతా పరుగు పేకగా అమర్చింది ఆ ఆలోచనలన్నింటినీ. ఒక్కొక్క ఆలోచనని చూశావు. ఈ ఆలోచన శబ్దజన్యం, ఇది స్పర్శజన్యం, ఇది రూపం, ఇది రసం, ఇదిగో ఇది గంధం. ఇలా ఎక్కడికక్కడ అన్నీ చూశావు. నేను ఆత్మస్వరూపుడను. ఎక్కడైనా కనపడిందా ఇందులో? కనపడలేదు. దేనికైనా match అయిందా పోనీ? (ప్చ్) ఇప్పుడు ఏం తెలిసింది? నేను ఎక్కడో పొరపాటు చేస్తున్నాను. దేని ద్వారా వెతుకుతున్నానంట ఇప్పుడు? దీని పోలికను వెతకడానికి ప్రయత్నం చేస్తున్నాను. అర్థమైందా అండీ? అంటే

జీవితం మొత్తం మీదా పోలికను గుర్తుపట్టేటటువంటి ఒకే ఒక సూత్రానికి కట్టుబడటం చేతనే నీకు ఇప్పుడు అదంతా వచ్చింది. అంతేనా కాదా? ఏం నేర్చుకోవాలన్నా దాని పోలిక మరొకటి వుంటే తప్ప నేర్చుకోలేక పోతున్నావు. ఏనుగు విషయం తెలుసుకోవాలనుకున్నావండి. ఏం చేశావు? ఆ పోలిక వున్న ఏనుగు బొమ్మను దగ్గర పెట్టి దానిని నేర్చుకునే ప్రయత్నం చేశావు. దైవం గురించి తెలుసుకోవయ్యా అన్నాము. ఆ దైవానికి సంబంధించిన లక్షణాలు వున్న బొమ్మను తయారు చేశావు. ఆ దైవ లక్షణాలు వున్నటువంటి, నువ్వు ఎలా వూహించావో, ఆ వూహించిన దైవలక్షణాలున్న బొమ్మని తయారుచేసి ఈ బొమ్మల ద్వారా దైవాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశావు. అంతేనా కాదా? ప్రతిచోట ఏం జరుగుతోంది అక్కడ? సాపేక్షం. పోలిక. మరి ఎంత వెదకి చూచినా ఈ ఆత్మస్వరూపానికి పోలినది ఎక్కడైనా కనపడిందా? కనపడలేదు. అంటే నేను ఎక్కడో తప్పు చేస్తున్నాను. ఏం తప్పు చేస్తున్నాను? అంటే ఈ ప్రపంచంలో అన్నీ పోలినవే వుండాలి అని ఏమైనా rule వుందా? అలాంటిది ఏమైనా వుందా? సముద్రాన్ని పోలింది మరొకటి ఏదైనా చెప్పండి. వుందా? సముద్రాన్ని పోలినది వుందా? లేదు. సూర్యుడిని పోలినది వుందా? అంటే సృష్టిలో సహజమైనటువంటివి ఏమైతే వున్నాయో, వాటిని పోలినటువంటివి మరొకటి చూపెట్టు? లేవు. అంటే అసహజమైనవాటిలో మాత్రమే ఈ పోలికల గొడవంతా వుంది. సహజంలో మాత్రం ఈ గొడవంతా లేదు. కదా! కాబట్టి ఆ సహజమైనటువంటి స్థితిలో ఏముందయ్యా? అంటే నేను వున్నాను. అసహజంలో ఏమున్నాయయ్యా? ఇంద్రియ ధర్మాలున్నాయి. అసహజంలో ఏమున్నాయి? ఇంద్రియధర్మాలున్నాయి. కాబట్టి ఆ సహజమైనటువంటి నేను పేరు ఏమిటయ్యా? అంటే దానితో పోలినది మరొకటి ఏదైతే లేనిది వున్నదో, అది ఆత్మస్వరూపం. అంటే ఏమిటయ్యా? పోలికలు వున్నవన్నీ తీసి అవతల పడేయి. ఒక పనిచేయి మీ ఇంట్లో ఒక వస్తువుని ముఖ్యమైన వస్తువుని మీరు ఎక్కడో పెట్టి మరచిపోయారండి. దానిని గుర్తుపట్టాలి. ఎలా గుర్తుపడతావు? పోలికలతోనేనా? ఎన్ని చూసినా నీ మనసులో వున్న పోలికకు, దానికి match అవ్వలేదు. ఏం చేశావు? వున్న వస్తువులన్నీ తీసి బయటపడేయి. అది కనపడటం లేదు, ఏం చెయ్యాలిప్పుడు? వున్న వస్తువులన్నీ తీసిపడేయి. పోలికలతో సరిపోయినవన్నీ తీసి బయటపడేయి. శేషించినది

ఏదైతే వుందో అదే. అర్థమైందా అండీ! నీ మనసులో గాని, నీ బుద్ధిలో గాని ఏమున్నాయి అంటే, పోలికలతో కూడుకున్నవన్నీ వున్నాయి. పోలికలు లేనటువంటివి అందులో లేవు. ఆత్మస్వరూపము ఎటువంటిది? పోలిక లేనటువంటిది. దానిని ఎందులో వెతుకుతున్నావు? మనసు, బుద్ధిలలో పోలికలలో వెతుకుతున్నావు. వెతికితే కనపడుతుందా? కనపడడం లేదు. ఏం చెయ్యాలట ఇప్పుడు? పోలికలతో కూడినవన్నీ విసర్జించు. ఏమైంది అప్పుడు? ఏది మిగిలిందో అదే నయ్యా నువ్వు. ఇప్పుడిది సులభంగా వుందా? పూర్వపద్ధతి సులభంగా వుందా? అంటే పోలికలలో వెతకడమే భ్రమాజన్యజ్ఞానము. అర్థమైందా అండీ!

ఈ మాట ఇందాకే చెప్పవచ్చుగా? ఇంత story ఎందుకు? భ్రమాజన్యజ్ఞానం అంటే పోలికలలో వెతకడం. అని చెప్పేయచ్చుగా? అర్థమౌతుందా? ఇప్పుడు ఇంతా చెబితే ఏమైంది? ఓహో! శరీరం ఇలా పనిచేస్తుంది, ప్రాణం అలా పనిచేస్తుంది, మనసు ఇలా పనిచేస్తుంది. బుద్ధి ఇలా పనిచేస్తుంది. వీటి మధ్యలో ఒకదానితో ఒకటి సంబంధపడి పనిచేసేటప్పుడు మనలో ఏం కలుగుతుంది? వీటన్నింటినీ అధిగమించాలంటే, వీటితో సంబంధం పడనటువంటిది, పోలిక లేనటువంటిదానిని ఒకదానిని ఆశ్రయించాలి. నీ చుట్టుపక్కల వున్న మేకల యొక్క లక్షణాలు ఏవీ సింహానికి లేవు. వున్నాయా? లేవుగా. నీకు సింహం అని తెలియజెప్పాలి. నీ చుట్టుపక్కల వున్న మేకలతో పోల్చినప్పుడు నీకు సింహం అని తెలుస్తుందా? తెలియబడదు. ఏం చేయాట ఇప్పుడు? నీ మేకలనన్నింటిని పక్కకు తేవాలి. తెచ్చినంత మాత్రాన తెలియబడుతుందా? ఏం చేయాలట మరి? నిన్ను నీకు చూపెట్టాలట. వాటితో వున్నంత సేపు చూపెట్టడానికి వీలౌతుందా? వీలుకాదు. వాటితోనే పోల్చిచూసుకుంటున్నావు. ముందు కాబట్టి నువ్వు ఏం చేయాలయ్యా అంటే, వాటిలోనుంచి కాసేపు పక్కకు రా. వచ్చినాక ఏం చేయాలట? నీ ప్రతిబింబాన్ని నీకు చూపెట్టారు. అప్పుడు కూడా తెలియలేదు. అప్పుడు కూడా ఇంకా మేకనే అనుకుంటున్నావు. ఒక్కసారి గురువుగారు అప్పుడు సింహగర్జన చేశారు. ఆ గర్జన ప్రభావం చేత, నీ పక్కన వున్న మేకల యొక్క సహవాసదోషం లేదుగా అప్పుడు? నీలో ఈ స్వభావం మేల్కొంది. మేల్కొనగానే ఏమైంది? నీవు సింహస్వరూపుడవు అయ్యావు అప్పుడు. నీవు ఆత్మస్వరూపుడవు అని ఒక్కసారి తెలియబడిపోయింది అప్పుడు అంతే.

ఇప్పుడు మేకల దగ్గరకి వెళ్ళావు. ఇప్పుడు ఏమైంది? ఇక కలిసే అవకాశం లేదు. ఇది ఆత్మసాక్షాత్కార జ్ఞానం అంటే. ఇది గురువు వల్ల నీకు ఉపయోగం అంటే. ఇదే ఆత్మసంయమయోగం యొక్క ఫలితం కూడా. నీవు  అష్టాంగ యోగ మార్గం ద్వారా వస్తావో, ఆత్మ విచారణ ద్వారా వస్తావో, ఎలా అన్నా రా, ఈ శరీరం, ప్రాణం, మనసు, బుద్ధి ఇవి నాల్గింటిని అధిగమించడమే, నీవు ఆత్మస్వరూపుడని తెలుసుకోవడమే, ఈ రెండు మార్గాల యొక్క ప్రాథమిక, ప్రధాన ఉద్దేశ్యము. కాబట్టి వీటిని ఉపయోగించేటప్పుడు ఈ రకమైనటువంటి సమస్య అంతా నీకు తెలిసి వుండి, ఇది భ్రమనుంచి ఉత్పన్నమైందా? భ్రాంతి నుంచి ఉత్పన్నమైందా? భయం నుంచి ఉత్పన్నమైందా? ఆ సమస్య ఆ సంఘటన ఆ భావన ఆ అనుభవం ఈ మూడింటి నుంచే ఉత్పన్నం అవ్వాలి ఏమైనా సరే! ఎందుకని? ఆ మూడే వున్నాయి నీ లోపల. ఇంక ఈ మూడు తప్ప ఇంకేమీ లేవు. ఈ మూడు సాపేక్ష జనితాలు. అంటే పోలికల వల్ల ఉత్పన్నమైనాయి. ఆ పోల్చుకునే లక్షణాన్ని గనుక తొలిగించి వేస్తే, నిరపేక్షాన్ని గనుక నీవు ఆశ్రయించి నట్లయితే, సాపేక్షాన్ని విడిచిపెట్టి, ఏమైపోయింది అప్పుడు? ఒక్కసారే ఈ సమస్యలు అన్నీ పరిష్కారం అయిపోయినాయి. అలా కాకుండా ఒక్కొక్కటీ తీద్దాము అంటే, ఒకటి తీస్తే పది వస్తూ వుంటాయి. అందుకని జగత్తుని ఆశ్రయించి నువ్వు దీనిని పరష్కరించ లేవు. కారణం ఏమిటట? నువ్వు ఒకటి తెలుసుకుని దానిని విచారణ చేసి, దానిని ఆచరించి, అధిగమిద్దాం అనుకునే లోపు,  ఆ జగత్తులో ఓ పది వస్తాయి మళ్ళా. తామర తంపరగా అభివృద్ధి చెందుతూ వుంటుంది. ఒకటి తీస్తే 10 వస్తాయి అక్కడ, కాబట్టి జగత్తును ఆశ్రయించి సాధ్యం కాదు. ఈ జగత్తు అంతా సాపేక్ష నిర్ణయంతో కూడుకుని వున్నది. కాబట్టి జీవుడు జగత్తుని ఆశ్రయించినంత కాలం ఈ భ్రమాజన్య జ్ఞానాన్నే పొందుతూ వుంటాడు. కాబట్టి జీవుడు ఎవరిని ఆశ్రయించాలంట ఇప్పుడు? జగత్ భాగాన్ని విడిచిపెట్టి, ఆత్మభాగాన్ని కనుక నీవు ఆశ్రయించినట్లయితే, నీకు ఆ జీవ లక్షణాలు అన్నీ పోయి, ఆత్మ లక్షణాలు మిగిలిపోతాయి. జగత్తుని ఆశ్రయించినంతకాలం జీవుడిగానే వుంటావు. జగత్భావాన్ని విడిచిపెట్టినప్పుడు మాత్రమే నీవు ఆత్మ భావంలో స్థిరపడగలుగుతావు. జై బాబా!

ఓం ఓం ఓం

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనా భవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు మావిద్విషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

సాయిరాం.

(File No. MIC-2010-08-29_06h44m04s.mp3 is over)

# లయయోగము

(అష్టావక్రగీత ప్రవచనానంతరం అనుబంధముగా చెప్పబడిన సాధనా విధానం)

ఇది మీరందరూ కూడా తీరిక వున్నంత సేపు, మీరు నిలబెట్టుకోగలిగినంత సేపు, ఒక సాధనను కొనసాగించినప్పుడు మాత్రమే ఈ అష్టావక్ర గీతలో వున్నటువంటిది అంతా కూడా తురీయానుభవంగా చెప్తారు. ఇదంతా తురీయానుభవం. వివేకచూడామణి తురీయం గురించి ప్రస్తావించి విడిచిపెడితే, అష్టావక్రగీత తురీయానుభవంలో నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ రెండింటి మధ్య ఒక భేదం వుంది. అంటే తురీయం మార్గ దర్శనం చేస్తుంది. ఏమేమి విడిచిపెట్టాలి? ఏమేమి ఉత్తమమైన లక్షణాలను పొందాలి. ఏ శక్తి సామర్థ్యాలు నీకు వుంటే, నీవు తురీయంలో నిలబడగలుగుతావు? అని సవిస్తరంగా చెప్పేది అంతాకూడా వివేక చూడామణి. అదే మీకు ఆ తురీయానుభవాన్ని తెలియజెప్పి, ఆ అనుభవంలో వున్నటువంటి గొప్పతనాన్ని మీకు అర్థమయ్యేట్టు చేసి, అనుభవాన్ని అందించి స్థిరపడేటట్టు చేస్తుంది అష్టావక్రగీత. ఇది ఈ రెండు గ్రంథాలకి వున్నటువంటి ప్రాథమిక లక్ష్యం. కాబట్టి మీరు మిగిలిన సమయం అంటే సత్సంగం చేసే కాలం కాక మిగిలిన సమయంలో సాధ్యమైనంత వరకూ అర్థమాతృకాయుత ప్రణవధ్యానం అనే దానిని అభ్యసించాలి. అంటే మామూలుగా ఇప్పుడు మనమందరమూ చేసే ఓంకారము త్రిమాతృకాయుతము. ‘అ’ కారము, ‘ఉ’ కారము, ‘మ’ కారము తో కూడుకున్నది.

ఓఓఓ...మ్మ్మ్................. అనే ఈ ఓంకారంలో అకారం, ఉకారం, మకారం త్రిమాతృకాయుతం. అయితే ఈ తురీయానుభవంలో ప్రవేశించాలన్నా, నిలబెట్టుకోవాలన్నా ఈ ఓంకారాన్ని కేవలం ‘మ’కార శబ్దంతో అంటే ఓమ్ మ్ మ్ మ్...........మ్ ఓ...మ్ మ్ మ్ దీనికి ఒక ఉపమానం చెబుతారు, దూరంగా వున్న విమానం ఎలా శబ్దం చేస్తూ నీ మీద నుంచి వెళ్ళి పోయింది. అప్పుడు ఎలా వస్తుందుట? చాలా చిన్నగా వినపడుతుంది. తరువాత శబ్దం పెద్దగా అవుతుంది. తరువాత క్రమంగా దూరమైపోతుంది. అలాంటి శబ్దంతో దీనిని పోల్చారు. ఈ ధ్యానానికి ఒక గొప్ప విశిష్ఠత వున్నది. ఇది ఎవరైతే తనలో అణువణువునా దీనిని సిద్ధింప చేసుకుంటారో, ఈ సృష్టిలో

వున్నటువంటి నాద శక్తి అంతా కూడా ఇందులో వుంది. అంటే ప్రణవంలో వున్నటువంటి శక్తి అంతా కూడా ఈ అర్థమాత్రకలో వుంది. ఒక ఆటమ్ బాంబులో ఎంత శక్తి వుంటుందో, అంతటి శక్తి నీలో నిండుతుంది. ఇంకా యోగ పద్ధతిలో మాట్లాడాలి అనంటే, విశ్వప్రాణాన్ని వ్యష్టి ప్రాణంలోకి ఆహ్వానించేటటువంటి మార్గం ఇది. తద్వారా నీవు ఈ వ్యష్టి ప్రాణాన్ని విశ్వప్రాణంలో లయం చేస్తావు. ఈ సాధనలో. తద్వారా ఆ జ్ఞాన సిద్ధి అయినటువంటి, సర్వవ్యాపకమైనటువంటి, అనంతమైనటువంటి ఆద్యంతములు లేవనేటటువంటి స్ఫురణ నీకు కలుగుతుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ మీకు ఎలా వుంది అంటే నేను పుట్టాను, నేను పెరిగాను, కొంతకాలానికి ఇది పోతుంది అనేటటువంటి జ్ఞప్తి మనలో పనిచేస్తూ వుంటుంది. ఈ జ్ఞప్తి నీకొక నేను పుట్టాను, నేను పెరిగాను, మరణిస్తాను అనేటటువంటి భావన ఇక నీలో మిగలదన్నమాట ఈ సాధనలో. ఎందుకని అంటే, నేను అనంతుడను అనేటటువంటి స్థితిలో స్థిరపడిపోతావు. నాకు ఆద్యంతములు లేవు. కారణమేమిటంటే వ్యష్టి స్థితిని కోల్పోతాడు ఈ సాధనలో. నిరంతరాయంగా చేయడం వల్ల. ఇది లయ యోగ విధానం అని అంటారు. అంటే యోగం చాలా పక్షం. అందులో లయయోగం ఒక విధానం. ఒకదానిని ఒకదాంట్లో ఉన్నతమైనటువంటి స్థితులలో, ఉన్నతమైనటువంటి ఫలములలో లయం చేయడాన్ని లయయోగం అని అంటారు. ఈ లయయోగానికి ఆధారం ఈ అర్థమాత్రకాయుత ప్రణవధ్యానం. ఈ లయయోగం ద్వారా నీ యొక్క వ్యష్టి నేను పోతుంది. వ్యష్టినేను పేరే జీవుడు. సమిష్టి నేను ఈశ్వరుడు. ఈ జీవుడు ఎగిరిపోయి, ఆ సమిష్టి నేను మిగులుతాడు. కేవల సమిష్టియైనటువంటి ఆ ఈశ్వర లక్షణం మిగిలుతుంది. అటువంటి ఉత్తమమైనటువంటి సిద్ధిని, ఉత్తమమైనటువంటి సాధ్యాన్ని అందించగలిగేటటువంటి సాధన. కాబట్టి మీరు ఎంత వీలైనంతగా దీనిని సహజత్వాన్ని పొందితే, శబ్దం లేకుండా చేయగలిగేటటువంటి స్థితి వస్తుంది. ఇప్పుడు మనం శబ్దంతోటి అంటున్నాము. సాధన తెలియడం కోసం ఇలా చెప్తున్నాం. మామూలుగా అయితే దీంట్లో ప్రాణం కలిసిపోతే ఇక, ప్రాణం కలవనంత వరకే శబ్దం వస్తుంది బయటకు. ప్రాణం అందులో కలిసిపోయిందనుకోండి, ఇంక శబ్దం రాదు. మనసు బుద్ధి కూడా కలిసిపోతే ఇంక ఆ ధ్యాన స్థితి కూడా వుండదు. రెండూ పోతాయి అప్పుడు. అట్లా క్రమంగా అధిగమించి

నువ్వు పై స్థితిలో వుండిపోయేటటువంటి అవకాశం వుంది. అప్పుడు కళ్ళు తెరిచినా తెరువకపోయినా చేసినా చేయకపోయినా ఏదైనా ఒకే స్థితిలోనే వుంటావు. అక్కడ వ్యష్టినేను వుండడన్నమాట. చేసేవాడు, అనుభవించేవాడనే రెండూ ఒకేసారి లేకుండా పోతారు. ఈ లయయోగ విధానంలో వున్నటువంటి గొప్ప ఫలితం ఏమిటంటే కర్తా, భోక్తా ఇద్దరూ కూడా లేకుండా పోతారు. కేవల సమిష్టి మాత్రమే అయినటువంటి ఈశ్వరాభిమాని అట్టి ఈశ్వరుడే వుండిపోతాడు. అప్పుడు నీ అంతఃకరణం అంతాకూడా.. ఇప్పుడు ఎలా వుంది అంటే చిత్తం చేత ప్రభావితమౌతూ వున్నది, అప్పుడు చిత్ స్వరూపంగా చిద్రూపంగా మారిపోతుంది. నీ అంతఃకరణం జీవాంతఃకరణంగా వుండదన్నమాట. అంటే వాసనామయంగా పనిచేయదు అప్పుడు. చిచ్ఛక్తి ప్రభావం మేరకు, చిద్రూపంగా దైవీ ప్రణాళిక మేరకు పనిచేయడం ప్రారంభిస్తుంది. అలాగ ఈ అంతఃకరణ చతుష్టయాన్ని ఈ సాధన ద్వారా సమిష్టి అంతఃకరణలో లయం చేయడం అన్నమాట. అందుకని దీనిపేరు లయయోగం అని ప్రసిద్ధి.

ఇది యోగములలో ఉత్తమమైనటువంటి, ఉన్నతతరమైనటువంటి సాధన. జ్ఞానసిద్ధిని పొందించేటటువంటి సాధన. అందువల్ల ఇది అభ్యసించడం, నిదానంగా అభ్యసించాలి. నిదానంగా ప్రయాణం చేయాలి. ఇందులో ఇతరత్రా ఏ ఫలితాలు రావు. ఈ సాధనలో ఏ రకమైన ఫలితాలు రావు. ఏ రకమైనటువంటి సిద్ధులు రావు. ఏ రకమైనటువంటి మహిమలు చేయవు. కారణం ఏమిటి? నిన్ను కోల్పోవడానికి మాత్రమే ఇది ఉపయోగపడుతుంది. నువ్వు లేకుండా పోవడానికి ఇది ఉపయోగపడుతుంది. ఎవరున్నారయ్యా అంటే పరమేశ్వరుడే వున్నాడు. ఎల్లవేళల సర్వకాల సర్వావస్థలలో నీ రూపంలో కూడా పరమేశ్వరుడే వున్నాడు. నువ్వు దేశం అన్నావు అదీ పరమేశ్వరుడే. కాలం అన్నావు అదీ పరమేశ్వరుడే. వస్తువు అన్నావు అదీ పరమేశ్వరుడే. రూపం అన్నావు అదీ పరమేశ్వరుడే. గుణం అన్నావు అదీ పరమేశ్వరుడే. అంతా ఈశ్వరమయంగానే నీకు కనపడుతుంది. అలా కనపడేట్టుగా వచ్చే దృష్టిని కలిగిస్తుంది. అంతే దీని ఫలితము. ఇంతకు మించి ఈ లయయోగ సాధన వల్ల వేరే ఏ ఫలితమూ రాదు. అంటే ఐహిక ఫలితాలను సాధించడానికి ఈ సాధన పనికిరాదు. అర్థమైందా అండీ! అంటే ప్రతి సాధనకీ కూడా ఒక నిర్దిష్టమైనటువంటి ప్రమాణం, పరిజ్ఞానం, విజ్ఞానం అవసరం.

ప్రమాణం అంటే ఎలా చేయాలి? చేస్తే ఫలితం ఏమిటి? ముందే అనుభవజ్ఞులందరూ చేసి, సాధించి, నిర్ణయం చేసి విడిచి పెట్టారు. ఇదిగో ఇది దీనికే పనికి వస్తుంది. పరిజ్ఞానం అంటే గురువు దగ్గర అధ్యయనం చేయాలి, అభ్యాసం చేయాలి. విజ్ఞానం – నీవు స్వయంగా సాధించాలి. అప్పుడు విజ్ఞానం. ఇతరులకు ఉపయోగించాలి అప్పుడు సుజ్ఞానం. అర్థమైందా అండీ! నీ వరకే వినియోగించుకున్నావు అప్పుడది విజ్ఞానం. ఇతరులకు కూడా దానిని అధ్యయనం చేయడానికి బోధించి, దానిని అర్థమయ్యేట్టు చేసి, వాడు దానిని సాధించ గలిగేట్టుగా చేయగలిగావు అప్పుడు సుజ్ఞానం. కాబట్టి జ్ఞానాన్ని అధిగమించాలి అంటే ఆ జ్ఞానం అనేది విజ్ఞానం, సుజ్ఞానంగా మార్పు చెందాలి. అప్పుడే నువ్వు జ్ఞానాన్ని అధిగమించగలుగుతావు. లేకపోతే ఈ జ్ఞానం కూడా పరిమితమైపోతుంది. కాబట్టి మహర్షి అని ఎవరినైతే మనం పిలుస్తున్నామో అటువంటి వారు అందరూ కూడా ఏం సాధించారయ్యా అంటే, ఇలాగే సాధించారు. అర్థమైందా అండీ!

[ఇంకా విశేషాలు రేపు చెప్పుకుందాం, జైబాబా]

(54.36)/28.08.2010

File name: MIC-2010-08-28_19h12m56s.mp3